


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 129 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 21 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 129 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 21 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# అదో కాగితపు పులి.. పిరికివాళ్లు

## నాటో దేశాలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

- ఇరాన్‌తో యుద్ధంలో కలిసి రావడానికి ఇష్టపడడంలేదన్న ట్రంప్
- ఇప్పుడు అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారని ఆగ్రహం
- హర్మూజ్ జలసంధిని తెరవడానికి రావడం లేదని విమర్శ
- ఈ పిరికివాళ్లను గుర్తుంచుకుంటామని హెచ్చరిక




హైదరాబాద్ పెన్ పవర్::హర్మూజ్ జలసంధిని తెరవడానికి ముందుకు రావాలని తాను చేసిన విజ్ఞప్తిని నాటో దేశాలు పట్టించుకోకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటో దేశాల వ్యవహారశైలిపై తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా చిందులు వేశారు. అమెరికా లేని 'నాటో' ఓ కాగితపు పులి అని, అమెరికా లేకుండా ఏమీ చేయలేదని మండిపడ్డారు. ఇరాన్‌పై యుద్ధంలో చేరనందుకు, హర్మూజ్ జలసంధిని తెరవడంలో సహకరించనందుకు వారిని గుర్తించుకుంటామని హెచ్చరిక చేశారు."అమెరికా లేకుండా నాటో ఒక పేపర్ టైగర్ వంటిదే. అణ్వాయుధాలు కలిగిన ఇరాన్‌ను ఆపడానికి జరుగుతున్న యుద్ధంలో వారు చేరడానికి ఇష్టపడటం లేదు.

మిగతా 2లో


# యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా చేసిన విజ్ఞప్తిని తిరస్కరించాం

## శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార

- రెండు యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా విజ్ఞప్తి చేసిందన్న శ్రీలంక అధ్యక్షుడు
- యుద్ధంలో తటస్థ వైఖరిని అనుసరిస్తున్నట్లు వెల్లడి
- శ్రీలంక పార్లమెంటుకు తెలిపిన అధ్యక్షుడు అనురకుమార

మిగతా 2లో





## ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు...

### ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి మృతి

- ఇరాన్ ఉన్నతాధికారులే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు
- ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి అలీ మహ్మద్ నయినీ మృతి
- ఇది పిరికిపంద చర్య అని, ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరిక
- ఇటీవల ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి, జాతీయ భద్రతా మండలి కార్యదర్శి కూడా మృతి

మిగతా 2లో




# ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల బీమా

## రాష్ట్రంలోని 1.15 కోట్ల ఫ్యామిలీలకు కవరేజ్

- పేద, మధ్యతరగతి, ధనిక అందరికీ అమలు
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం
- ఈ ఏడాది జూన్ 2 నుంచి అమల్లోకి స్కీం
- విద్యా రంగానికి రూ.26,674 కోట్లు బడ్జెట్
- ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**రూ. 3,24,234 కోట్లతో తెలంగాణ వార్షిక బడ్జెట్...**

- తెలంగాణను దేశంలో నెంబర్ వన్ గా నిలబెట్టడమే లక్ష్యమన్న మల్లు భట్టి
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.33,688 కోట్ల కేటాయింపు
- రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు
- సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,615 కోట్లు




### ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డ్

- వైద్య శాఖకు ₹13,675 కోట్ల బడ్జెట్
- జిల్లా స్థాయిలో క్యాన్సర్, ఎన్సీడీ, పాలియేటివ్ సెంటర్లు
- 44,029 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రుల విస్తరణ
- కొత్తగా మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ కాలేజీలు

మిగతా 2లో



## అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు సుప్రీంకోర్టు కీలక తీర్పు

- అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్య ప్రేరేపణ కాదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- గుజరాత్‌కు చెందిన వ్యక్తిపై నమోదైన క్రిమినల్ కేసు కొట్టివేత
- సూసైడ్ నోట్‌లో బెదిరింపుల వివరాలు లేవని పేర్కొన్న ధర్మాసనం
- అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని వ్యాఖ్య
- గుజరాత్ హైకోర్టు ఉత్తర్వులను పక్కనపెట్టిన సర్వోన్నత న్యాయస్థానం

మిగతా 2లో

# రేషన్ కార్డు ఉన్నవాళ్లకే.. ఇందిరమ్మ బీమా

- రేషన్ కార్డు ఉన్నవాళ్లకే.. ఇందిరమ్మ బీమా:
- ఈ ఏడాది నుంచే నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సింగిల్ సిస్టం
- గృహ నిర్బంధంలో కేసీఆర్.. బంధించింది కేటీఆర్, హరీశ్
- కేబినెట్ విస్తరణ ఎప్పుడు చేయాలో నాకు తెలుసు
- బీఆర్ఎస్ ను తొక్కుకుంటూ మళ్లీ అధికారంలోకి వస్త
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం కోసం శుక్లాను కలుస్తా
- బీఆర్ఎస్ హయాంలో ఆరు వేల ఫోన్లు ట్యాప్
- ఏ1 ప్రభాకర్ రావు స్టేట్ మెంట్ రికార్డు చేస్తున్నం
- చిట్ చాట్ లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న వాళ్లందరికీ ఇందిరమ్మ బీమా పథకాన్ని వర్తింపజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. శుక్రవారం (మార్చి 20) మండలిలో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. విద్యా విధానంలో కీలక మార్పులు తెస్తున్నామన్నసీఎం ఈ విద్యా సంవత్సరం నుంచే నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సింగిల్ సిస్టం ఉంటుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆరువేల ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ కేసులో ప్రభుత్వం ప్రాసెస్ ప్రకారం ముందుకు వెళుతోందని అన్నారు.చట్ట ప్రకారం విచారణ పూర్తికాకుండా అరెస్టు చేయలేమని అన్నారు. ప్రస్తుతం కేంద్రం విచారణకు అనుమతించిందని,

మిగతా 2లో

# అంతా బోగస్...

## తెలంగాణ బడ్జెట్‌పై స్పందించిన హరీశ్ రావు

- బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందన్న హరీశ్ రావు
- సకల జనులకు దక్కింది గుండుసున్నా అని ఎద్దేవా
- అంకెల గారడీ, మాటల గారడీ తప్ప బడ్జెట్‌లో ఏమీలేదని విమర్శలు



హైదరాబాద్ పెన్ పవర్:బడ్జెట్‌పై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టారని విమర్శించారు.

మిగతా 2లో

## ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత... లీటర్ పై ఏకంగా రూ.22 పెంపు



- పారిశ్రామిక డీజిల్ ధరకు రెక్కలు
- లీటరు ధర రూ.87 నుంచి రూ.109కి చేరిన ఇండస్ట్రియల్ డీజిల్
- ప్రీమియం పెట్రోల్ ధరలు కూడా లీటరుకు రూ.2 పెరిగిన వైనం
- ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతోనే అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ఆయిల్ ధరలు
- ఉత్పత్తి ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని ఆందోళన

మిగతా 2లో

## మల్లు భట్టి విక్రమార్క ప్రసంగం కొనసాగుతుండగానే... బీఆర్ఎస్ వాకౌట్



- చెవిలో పువ్వులు పెట్టుకుని సభలోకి వచ్చిన బీఆర్ఎస్ సభ్యులు
- బడ్జెట్ ప్రసంగం మొదలుకాగానే స్పీకర్ పోడియం వద్దకు వెళ్లన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా కొనసాగాయి. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈరోజు అసెంబ్లీలో

మిగతా 2లో

## భ్రష్టు పట్టించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టింది



- అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలు తప్ప ఏమీ లేదన్న బండి సంజయ్
- విద్యకు 16 శాతం నిధులు కావాలంటే 8 శాతమే కేటాయించారన్న బండి సంజయ్
- రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తోందని విమర్శ

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## తెలుగుతనానికి నిర్వచనం తుమ్మల సీతారామ మూర్తి

అచ్చ తెలుగు మాటలతో అందమైన పద్యాలు అల్లగలిగిన ఆధునిక కవుల్లో ఆయనను మించిన వారు లేరంటె అతిశయోక్తి కాదు. కవిగా, పండితుడిగా, తనకు తానే తీర్చిదిద్దుకొన్న ప్రతిభాశాలి ఆయన. భాషాపరంగా ఆయన సంప్రదాయ బద్ధుడైనా భావనా పరంగా ఆధునికులు. అచ్చమైన గాంధేయవాది.తెలుగుదనం మూర్తీభవించిన, తెలుగు భాషానురక్తి కలిగిన జాతీయోద్యమ కవి. ఆయనే అభినవ తిక్కన బిరుదాంకితుడు తుమ్మల సీతారామమూర్తి. సౌమ్యశీలి, నిరాడంబరుడు, గాంధేయవాది, తెలుగు రైతుబిడ్డ, ఆధునిక పద్య కవుల్లో అన్నింటా ముందుండి తెలుగు భాషానురక్తి కలిగిన మహా కవి. తుమ్మల సీతారామమూర్తి 1901 డిసెంబర్ 25 న గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలంలోని కావూరు గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు చెంచమాంబ, నారయ్య. తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి, దువ్వూరి వెంకటరమణ శాస్త్రి వంటి ప్రముఖుల వద్ద విద్యనభ్యసించారు. "మహాత్ముని ఆస్థానకవి" అని కట్టమంచి రామలింగారెడ్డితో పలికించుకున్న తుమ్మల, ఆత్మకథ, మహాత్మ కథ వంటి ఆదర్శ ప్రౌఢ కావ్యాలు, ఆత్మార్పణము, రాష్ట్రగానము, ఉదయ గానము, పఱిగ పంట, పైర పంట, శబల, సమదర్శి, నా కథలు వంటి సామాజిక కవిత్వాన్ని అందించారు.1930లో ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయము నుండి ప్రథమ శ్రేణిలో ఉభయ భాషా ప్రవీణ పట్టాను అందుకున్నారు. చదువు పూర్తయ్యాక, తన స్వగ్రామం కావూరు లోని తిలక్ జాతీయ పాఠశాలలో 1924 నుండి 1929 వరకు ఉపాధ్యాయుడిగా పని చేసారు. 1930 నుండి 1957 వరకు గుంటూరు జిల్లా బోర్డులోని దుగ్గిరాల, బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసారు.1920-1930 మధ్య కాలంలో కాంగ్రెసులో చేరి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1922లో జైలుశిక్ష అనుభవించారు. 1928లో తుమ్మల 'ఆత్మార్పణము' అనే కావ్యాన్ని రచించారు. 1938 లో 'సోదరా లెమ్ము, నీ హక్కులందు కొమ్ము' అని ఆంధ్రరాష్ట్ర సిద్ధి కోసం తన 'రాష్ట్ర గానం' ద్వారా తెలుగువారిని వెన్ను తట్టి లేపారు. తెలుగువారి పూర్వవైభవాన్ని ఎలుగెత్తి చాటి ప్రత్యేక రాష్ట్రసాధనకు ప్రబోధించారు. 1840లో ధర్మజ్యోతి అనే ఒక గాథను,1943లో 'పఱిగి పంట', 1950లో గాంధీజీ ఆత్మకథకు పద్య అనువాదమైన 'ఆత్మకథ'ను రచించారు. 1953లో 'ఉదయగానం' గావించారు. 1955లో 'శబిల' అనే ఖండ కావ్యాల సంపుటిని వెలువ రించారు. తెలుగు సాహిత్య సరస్వతికి శిరోభూషణమైన 'సంక్రాంతి తలపులు' ఈ సంపుటి లోనివే. 1957లో 'గీతాధర్మము' పేరుతో భగవద్గీతకు అనువాదం చేశారు. భర్తృహరి నీతి శతకాన్ని 'తెలుగు నీతి' పేరుతో తెనిగించారు. 'సర్వోదయ' సిద్ధాంతాన్ని విశదీకరిస్తూ 1960లో 'సర్వోదయ గానం' చేశారు. 1963లో తన అభిరుచులు, ఆదర్శాలు, అనుభవాలు వెల్లడి చేస్తూ 'నేను' అనే కావ్యాన్ని,1964లో 'పైరపంట', 1967లో ఆదర్శ ప్రాయులైన కొందరు త్యాగ ధనుల గుణగణాలను విశదీకరిస్తూ 'సమదర్శి' రచించారు. తుమ్మల కవిత్వంలో గ్రామీణ జీవిత, ఆంధ్రత్వ, భారతీయత్వ, విశ్వమానవత్వ లక్షణాలుంటాయి. ఆయనది ప్రధానంగా ధర్మ ప్రబోధనాత్మక కవిత్వం. తాను తెలుగు వాడననే అభిమానం ఆయనలో ఎక్కువ. తెలుగు జాతి, తెలుగు భాష, తెలుగు చరిత్ర, తెలుగు సంస్కృతి అంటే పులకించి పోయేవారాయన. కాల్పనిక వాదం, మానవీయత, దేశభక్తి అనే మూడు ప్రధాన అంశాలతో సీతారామ మూర్తి గారు తన రచనలను కొనసాగించారు. అనేక నాటకాలు, హరికథలు కూడా రచించారు.తెలుగు భాషా సాహిత్యాలకు ఆయన చేసిన సేవలను కీర్తిస్తూ, ఘన సన్మానం చేసి 'అభినవ తిక్కన' అనే బిరుదును ఇస్తే, వినయ పూర్వకంగా, తాను తిక్కన అంత ఘనుణ్ణి కాదని, 'తెలుగు భాషకు సేవకుడను' అనే అర్థం వచ్చేలా 'తెనుగు లెంక' అని పేరు పెట్టుకున్న మహాకవి తుమ్మల సీతారామమూర్తి చౌదరి. రైతు జీవితానికి కావ్య గౌరవం కల్పించి, తెలుగు నుడికారానికి ప్రాణంపోసి, తెనుగు దనానికి నిర్వచనంగా నిలిచిన తుమ్మలను కొంగర జగ్గయ్య 'కళా తపస్వి'గా సంభావించారు. ఒకనాడు వెండి తెర నాయకుడైన చిత్తూరు నాగయ్యకు తుమ్మల అభిమాన కవి. 1949 నిడుబ్రోలులో - గజారోహణము, గండ పెండేరము, కనకాభిషేకము, సువర్ణ కంకణము; 1960లో అఖిల భారత తెలుగు రచయితల మహాసభ సత్కారము; 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వ ప్రదానము; 1969లో కేంద్ర సాహిత్య అకాడమీ బహు మానము; 1969లో ఆంధ్ర విశ్వ విద్యాలయము "కళాప్రపూర్ణ" బిరుదుతో సత్కారము; 1984 మద్రాసులో శ్రీ ఎల్. వి. రామయ్య చారిటీస్ జాతీయకవి అవార్డు; 1985 లో నాగార్జున విశ్వ విద్యాలయం నాగార్జున విశ్వ విద్యాలయము "డాక్టర్ ఆఫ్ లెటర్స్" (డి.లిట్) బిరుదుతో సత్కారము పొందారు.నాటి యువ కవులను ఉద్దేశించి...వచనము గేయము ఆధారముగా చేసుకొని యువ కవులు వ్యవహారిక భాషలో కవిత్వము వ్రాయుచున్నారు. వీరిలో శ్రీశ్రీ వంటి సిద్ధహస్తులు కొందరున్నారు. భాషా మార్గము ఏదైనను రచయిత లోతుగా సాహిత్య కృషి చేసినపుడే పది కాలాల పాటు అది చరిత్రలో నిలుచును. మా తరం వారు చదివినంత గట్టిగా నేటి యువతరం కావ్య పఠనం చేయడం లేదు. పత్రికల నిండా ఏదో రాస్తున్నారు' అని తుమ్మల వ్యక్త పరిచిన అభిప్రాయం నేటికీ అక్షరాలా వాస్తవమని అనిపించక మానదు. 1990 మార్చి 21న గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని అప్పికట్ల గ్రామాలో తుమ్మల సీతారామమూర్తి మరణించారు. ఇరవై నాలుగు వేల పద్యాలు వ్రాసినా, ఆయన సాహిత్యం నిరాదరణకు గురవడం శోచనీయం. విద్యార్థులకు పాఠ్యాంశంగా ఆయన రచనలు ఉండక పోవడం తెలుగు సాహిత్యాభిమానులకు బాధాకరం.

## అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

అప్పు తిరిగి చెల్లించాలని అడగడం లేదా ఒత్తిడి చేయడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కిందకు రాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. కేవలం రుణం తిరిగివ్వాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన ఆత్మహత్య ప్రేరేపణ కేసును కొట్టివేసింది. ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది.

**కేసు నేపథ్యం ఏమిటంటే..**

గుజరాత్‌లోని మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి ట్రాక్టర్ ట్రాలీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పలువురు అప్పుల వాళ్లు వేధిస్తున్నారని ఆరోపిస్తూ అతను రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది. ఆ నోట్‌లో తొమ్మిది మంది రుణదాతల పేర్లను పేర్కొన్నాడు. వారిలో ఒకరైన ధీరూభాయ్ నంజీభాయ్ పటేల్ లోత్వాలాపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ), 506(2) (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. మృతుడికి ఆరు నెలల వ్యవధిలో నిందితుడు సుమారు 40 సార్లు ఫోన్ చేసినట్లు కాల్ రికార్డులను ప్రాసిక్యూషన్ ఆధారాలుగా చూపింది. తనపై కేసును కొట్టివేయాలని ధీరూభాయ్ మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

**సుప్రీంకోర్టు ఏమంది?**

ఈ కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం, ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు ఆత్మహత్య ప్రేరేపణను నిరూపించడానికి సరిపోవని అభిప్రాయపడింది. "సూసైడ్ నోట్‌లో తొమ్మిది మంది పేర్లు ఉన్నప్పటికీ, ఎవరి పాత్ర ఏమిటో స్పష్టంగా లేదు. బెదిరింపుల స్వభావం, అవి ఎప్పుడు, ఎక్కడ జరిగాయనే వివరాలు లేవు. అందరు రుణదాతలను ఒకే గాటన కట్టారు. ఇలాంటి సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ జరపడం వృధా ప్రయాస అవుతుంది" అని ధర్మాసనం పేర్కొంది.

అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని, కేవలం ఎక్కువసార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మృతుడిపై శారీరక దాడి లేదా బలవంతం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు గమనించింది. ఈ పరిస్థితుల్లో నిందితుడిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ధీరూభాయ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్, తదుపరి చర్యలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

## ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డ్

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం విస్తృత చర్యలు చేపడుతోందని ఆర్థిక మంత్రి భట్టి వి క్రమార్క చెప్పారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్యాల మేరకు మాతాశిశు ఆరోగ్యం, యువత ఆరోగ్యం, దీర్ఘకాలిక వ్యాధుల ని యంత్రణ, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయడానికి జిల్లా కేంద్రాల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు, నాన్కమ్యూనికబుల్ వ్యాధుల క్లినిక్స్, వృద్ధులకు పాలియేటివ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ను పూర్తిస్థా యి ప్రభుత్వ సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థగా మారుస్తున్నారు. ప్రజలందరికీ హెల్త్ ప్రొఫైల్‌రూపొందించి డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వా లని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఆరోగ్య సమాచారం గోప్యతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. వైద్య రంగ విస్తరణలో భాగంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం కొనసాగుతుండగా, 3 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్, 28 పారా మెడికల్ కాలేజీలు ప్రారంభించామని చెప్పారు. ప్ర భుత్వ ఆసుపత్రుల్లో మొత్తం పడకల సంఖ్య 44,029కు పెరిగిందని అన్నారు. చికిత్స కేంద్రిత విధానం నుంచి నిరోధక వైద్య విధానా నికి మార్పు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యం గా పెట్టుకుందని భట్టి చెప్పారు. ఈ క్రమంలో వైద్య మరియు ఆరోగ్య శాఖకు ?13,675 కోట్ల బడ్జెట్ కేటాయించినట్టు వివరించారు.

# ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల బీమా

హైదరాబాద్: ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించ బోతున్నట్టు రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఇవాళ 2026-27 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక కుటుంబంలో ఆదాయం తెచ్చే వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక సంక్షోభా న్నితగ్గించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా పే ర్కొన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని 1 కోటీ 15 లక్షల కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఇంటి పెద్ద దిక్కు మరణిస్తే.. ఆ కుటుం బానికి రూ.5 లక్షల జీవిత బీమా వర్తింప జేస్తామని, సామాజిక, ఆర్థిక తేడాలు లేకుండా పేద, మధ్య తరగతి, ధనిక అన్న భేదం లేకుండా అందరికీ ఈ బీమా అందించనున్నామని చెప్పారు. ఈ బీమా ప్రపంచంలోనే అరుదైనదని భట్టి అన్నారు. ఈ ఏడాది రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్ 2) నుంచి దీనిని అమల్లోకి తెస్తున్నట్టు వివరించారు.

**విద్యారంగానికి 26,674 కోట్లు**

తమ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పిన భట్టి విక్రమార్క.. అందులో భాగంగానే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తోందని అన్నారు. అదే విధంగా ఏటీసీలను ఏర్పాటు చేసి భవిష్యత్ తరానికి స్కిల్స్ నేర్పించే కార్యక్రమాన్ని భుజానికి ఎత్తుకుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నైపుణ్య ఆధారిత బ్లూకాలర్ ఉద్యోగ అవకాశాలకు అవసరమైన మానవ వనరులను అందించడంలో, తెలంగాణ రాష్ట్రాన్ని యావత్ ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని తాము భావిస్తున్నామన్నారు. "పిల్లల భవిష్యత్తు కోసం తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ ఖర్చుకాదు అవి పెట్టుబడులు." అమ్మ కలలు, పిల్లల చదువు ఇవే తెలంగాణ భవిష్యత్తు."అని పేర్కొంటూ.. ఈ బడ్జెట్లో విద్యా రంగానికి 26,674 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నామని చెప్పారు.

**భట్టి ప్రసంగంలో మహనీయుల మాటలు**

హైదరాబాద్: బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క మహనీయుల మంచి మాటలను కోట్ చేశారు. అదే విధంగా అంబేద్కర్ ఆశయాలను అనుగుణంగా అట్టడగు వర్గాలకు పెద్దపీట వేస్తూ ప్రజాపాలన సాగిస్తున్నట్టు పేర్కొన్నారు.

**విద్య, మానవ వనరులు**

చదువు లేక పోతే జ్ఞానం రాదు. జ్ఞానం లేకపోతే నైతిక విలువలు ఉండవు. నైతిక విలువలు లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు చదువొక్కటి ఉంటే ఇవన్నీ లభిస్తాయి. నిజమైన విద్య సాధికారతనిస్తుంది.

**-మహాత్మ జ్యోతిరావు పూలే**

**మహిళ-శిశు సంక్షేమం**

ఒక దేశం యొక్క పురోగతి అక్కడి మహిళల స్థితి ద్వారా కొలవబడుతుంది.

**-మహాత్మా గాంధీ**

కలలు కనండి... ఆ కలలు ఆలోచనలుగా మారాలి... ఆ ఆలోచనలు కార్యరూపం దాల్చాలి. అదే విజయానికి మార్గం.

**-ఏపీజే అబ్దుల్ కలాం**

# రేషన్ కార్డు ఉన్నవాళ్లకే.. ఇందిరమ్మ బీమా

- మొదటి పేజి తరువాయి

కేసులో ఏ1గా ఉన్నప్రభాకర్ రావు స్టేట్ మెంట్ రికార్డు చేస్తున్నట్టుచెప్పారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులోసీనియర్ ఐఏఎస్ అర్వింద్ కుమార్ ను సస్పెండ్ చేశామని సీఎం అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని అన్నారు. ఆ పార్టీ నేతలు క్లీన్ చిట్ వచ్చినట్టు చెప్పుకుంటున్నారని చెప్పారు. పంజాగుట్ట ప్రైవేట్ కేసు వ్యవహారంలో హరీష్ కు క్లీన్ చిట్ వచ్చిం దని సీఎం అన్నారు. దానిని హరీశ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 2014 నుంచి ఫోన్ ట్యాప్ జరిగిందని సీఎం చెప్పారు. కేటీఆర్, హరీష్ రావు ఏ విచారణ కోరిన సిద్ధమ ని చెప్పారు. గత ప్రభుత్వ అప్పులకు 3 లక్షల 30 వేల కోట్లు పడ్డీ కడుతున్నట్టు సీఎం చెప్పారు. ఇది సంక్షేమ బడ్జెట్ అని, 17 వేల కోట్ల రూపాయల ను వెల్ఫేర్ కు వాడామని సీఎం చెప్పారు.

**కేబినెట్ విస్తరణ ఎప్పుడు చేయాలో తెలుసు**

రాష్ట్రంలో కేబినెట్ విస్తరణ ఎప్పుడు చేయాలో తనకు తెలుసునని సీఎం రేవంత్ అన్నారు. కేబినెట్ విస్తరణ పై వార్తలు వచ్చిన ప్రతీ సారి వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. డిప్యూటీ స్పీకర్ ఎన్నిక అవసరం ఉన్నప్పుడు చేస్తామని చెప్పారు. మూసీ పై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని అన్నారు. నది కి రెండు వైపులా 50 మీటర్ల చొప్పున మాత్రమే భూ సేకరణ చేస్తామని చెప్పారు. ఈ విషయంలో గాంధీ మనవడు బీఆర్ఎస్ లో పడి ప్రకటన చేసి ఉంటారని అన్నారు. తన లెక్క ఎప్పుడు తప్పలేదు,మళ్ళీ అధికారం తమదేనని సీఎం అన్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ల కేసులో సుప్రీంకోర్టు మళ్ళీ గవర్నర్ కే నిర్ణయాధికారం ఇచ్చిందని, ఈ విషయంలో గవర్నర్ తో మాట్లాడుతామని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు నోటీసులు ఇచ్చినా హాజరవుతానని రేవంత్ అన్నారు.

**గృహ నిర్బంధంలో కేసీఆర్**

కేసీఆర్ ను కేటీఆర్, హరీశ్ రావు గృహ నిర్బంధం చేశారని, ఆయనను సభకు రానీయడం లేదని ఆరోపించారు. కేసీఆర్ జాతిపిత అని వాళ్ల

జాతి భావిస్తుందన్నారు. తెలంగాణ సమాజం జాతిపిత ఎవరనేది నిర్ణయించుకుంటుందని చెప్పారు. జనాభా లెక్కలు హైదరాబాద్ విభజన కు అడ్డంకి కాదని సీఎం అన్నారు. తాను బీఆర్ఎస్ ను తొక్కుకుంటూ మళ్ళీ అధికారంలోకి వస్తా అంటే.. బీఆర్ఎస్ కంటే బండి సంజయ్ ఎక్కువ స్పందించారని అన్నారు. గొర్రె కసాయిని నమ్మినట్టు కేటీఆర్ హరీశ్ రావును నమ్ముతున్నారని అన్నారు. జీవన్ రెడ్డి వ్యవహారం పీసీసీ చీఫ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి చూసుకుంటారని చెప్పారు.

# అంతా బోగస్...

- మొదటి పేజి తరువాయి

అన్ని రంగాలకు మొండిచేయి చూపారని అన్నారు. ఈ బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది గుండుసున్నా అని ఎద్దేవా చేశారు.

అంకెల గారడీ, మాటల గారడీ తప్ప బడ్జెట్?లో ఏమీ లేదని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పరిస్థితి బాగా ఉందని చెబుతున్నారని, మరోవైపు మూడేళ్లు కాకుండానే మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో స్కాంలు తప్ప స్కీములు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో అవినీతి జరిగిందని స్వయంగా మంత్రి కుమార్తె ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. బడ్జెట్‌ను చూస్తుంటే ఇదో బోగస్ బడ్జెట్ అని అర్థమవుతోందని హరీశ్ రావు విమర్శించారు. గతంలో నిధులు కూడా ఖర్చు చేయని పథకాలకు మళ్లీ నిధులు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఈ ప్రభుత్వానికి టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదని అన్నారు. ఇది కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.వెనుక పిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని భట్టి విక్రమార్క రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన వల్ల రాష్ట్ర అభివృద్ధి పడిపోయిందని అన్నారు. క్యూర్, రేర్, ప్యూర్ పేరుతో హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడుతోందని మండిపడ్డారు. కూల్చడాల మీద ఉన్న ప్రేమ నిర్మించడంపై లేదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భ్రష్టు పట్టించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టింది

- మొదటి పేజి తరువాయి

ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశపెట్టడాన్ని ఉద్దేశించి ఆయన అన్నారు. తెలంగాణ బడ్జెట్‌పై ఆయన స్పందించారు. అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలు తప్ప ఏమీలేదని అన్నారు. ఆదాయాన్ని రాకుండా చేసి, అప్పులకోసం అర్రులు చాచే బడ్జెట్‌గా కనిపిస్తోందని విమర్శించారు.రైతు భరోసా డబ్బులు రెండు విడతలుగా ఎగ్గొట్టినట్లే అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇప్పటికీ అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యా శాఖ కమిషన్ ప్రతిపాదిస్తే కేవలం 8 శాతమే కేటాయించారని అన్నారు. ఆరోగ్యశ్రీ బడ్జెట్‌కు కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని చురక అంటించారు.దేవాదాయ శాఖకు గత బడ్జెట్‌లో రూ.190 కోట్లు కేటాయిస్తే, ఈసారి ఆ ప్రస్తావన లేదని అన్నారు. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కేటాయింపులు

తూతూమంత్రంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 56 శాతం బీసీ జనాభాకు నాలుగు శాతం కేటాయింపులు విడ్డూరమని బండి సంజయ్ అన్నారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని, ఇష్టారాజ్యంగా అప్పులు చేసేందుకు సిద్ధపడ్డట్లుగా ఈ బడ్జెట్ కనిపిస్తోందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని బయటకు తీసుకువచ్చి విచారణ చేపడతామని అన్నారు.

# మల్లు భట్టి విక్రమార్క ప్రసంగం కొనసాగుతుండగానే... బీఆర్ఎస్ వాకౌట్

- మొదటి పేజి తరువాయి

తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించగానే.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఊహించని రీతిలో నిరసన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ప్రజల 'చెవిలో పూలు' పెట్టి మోసం చేస్తోందని అంటూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా తమ చెవుల్లో రంగు రంగుల పువ్వులు పెట్టుకుని సభలోకి వచ్చారు.

బడ్జెట్ ప్రసంగం మొదలవ్వగానే బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి? నిరుద్యోగ భృతి ఎక్కడ? రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది? అంటూ నినాదాలతో సభను హోరెత్తించారు. భట్టి విక్రమార్క ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ నేతలు, అనంతరం నిరసనగా సభ నుండి వాకౌట్ చేశారు.

సభ నుంచి బయటకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ఎంట్రీ గేట్ వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. "పెళ్లి చేసుకునే ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు మొహం చాటేస్తున్నారు. ఇది పేద మహిళలను వంచించడమే" అని ధ్వజమెత్తారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని, యువతను నట్టేట ముంచిందని ఆరోపించారు. ఈ బడ్జెట్‌లో రైతులు, మహిళలు, నిరుద్యోగులకు కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయని, ఇది కేవలం అంకెల గారడీ మాత్రమేనని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు.

## ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు...

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) మరోసారి ఇరాన్‌పై విరుచుకుపడింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అధికార ప్రతినిధి, పబ్లిక్ రిలేషన్స్ హెడ్ అలీ మహ్మద్ నయినీని హతమార్చినట్లు శుక్రవారం ప్రకటించింది. గత రెండేళ్లుగా ఐఆర్‌జీసీకి ప్రధాన ప్రచారకర్తగా నయినీ పనిచేస్తున్నారని ఐడీఎఫ్ తెలిపింది. ఇజ్రాయెల్‌పై ఉగ్రదాడులను ప్రోత్సహించేలా మధ్యప్రాచ్యంలోని ఉగ్రసంస్థలకు ఇరాన్ పాలన యంత్రాంగం యొక్క ఉగ్రవాద ప్రచారాన్ని వ్యాప్తి చేశారని ఆరోపించింది. మరోవైపు, పవిత్ర రంజాన్ మాసం చివరి గంటల్లో అమెరికా-ఇజ్రాయెల్ ఉగ్రదాడిలో తమ అధికార ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ అలీ మహ్మద్ నయినీ 'అమరుడయ్యారని' ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఇది పిరికిపంద చర్య అని, ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఇజ్రాయెల్... ఇరాన్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులనే లక్ష్యంగా చేసుకుంటోంది. బుధవారం టెహ్రాన్‌లో జరిగిన వైమానిక దాడిలో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఎస్మాయిల్ ఖతీబ్‌ను హతమార్చినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. అంతకుముందు, ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీని కూడా హతమార్చినట్లు ప్రకటించింది. మార్చి 17న టెహ్రాన్‌లో జరిగిన దాడిలో లారిజానీ తన కుమారుడితో కలిసి మరణించినట్లు ఇరాన్ మీడియా కూడా ధృవీకరించింది. అంతేకాకుండా, బసిజ్ పారామిలిటరీ దళాల యూనిట్ కమాండర్ ఘోలామ్‌రెజా సోలేమానీని కూడా హతమార్చినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఇరాన్‌లో పౌర ప్రదర్శనకారులపై హింసకు, అణచివేతకు సోలేమానీ నాయకత్వం వహించారని ఐడీఎఫ్ ఆరోపించింది. ఇజ్రాయెల్ వరుస దాడులతో ఇరాన్ కీలక అధికారులను కోల్పోతుండటం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తోంది.

## అదో కాగితపు పులి.. పిరికివాళ్లు

- మొదటి పేజి తరువాయి

కానీ తక్కువ నష్టంతో మా సైన్యం విజయం సాధించింది. అయినప్పటికీ నాటో దేశాలు ఇప్పుడు తాము చెల్లించవలసి వస్తున్న అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. కానీ అధిక చమురు ధరలకు కారణమైన హర్మూజ్ జలసంధిని తెరవడానికి నాటో దేశాలు ఇష్టపడటం లేదు. ఒక సాధారణ సైనిక విన్యాసం ద్వారా హర్మూజ్ జలసంధిని తెరవొచ్చు. కానీ సహకరించేందుకు వారు ముందుకు రావడం లేదు. వారు పిరికివాళ్లు, వారిని గుర్తుంచుకుంటాం" అని ట్రంప్ హెచ్చరించారు.

## ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత... లీటర్ పై ఏకంగా రూ.22 పెంపు

అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీలు ధరలను భారీగా పెంచాయి. ముఖ్యంగా పరిశ్రమల్లో వాడే బల్క్ డీజిల్ (ఇండస్ట్రియల్ డీజిల్) ధరను లీటరుకు ఏకంగా రూ.22.03 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ఈ పెంపుతో లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.87.57 నుంచి రూ.109.59కి చేరింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కూడా తన ధరలను సవరించింది. సాధారణ వాహనాల్లో కాకుండా ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్, నిర్మాణ రంగంలోని భారీ యంత్రాలు, జనరేటర్లలో ఈ ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగిస్తారు. దీని ధర పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది. ఈ భారం పరోక్షంగా రవాణా, ఇతర వ్యాపార కార్యకలాపాలపై పడి చివరికి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, స్పీడ్, పవర్ వంటి ప్రీమియం పెట్రోల్ రకాల ధరలను కూడా లీటరుకు రూ.2.09 మేర పెంచారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు.

## యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా చేసిన విజ్ఞప్తిని తిరస్కరించాం

మార్చి నెల ప్రారంభంలో శ్రీలంకలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు విమానాలను దిగడానికి అనుమతించాలని అమెరికా కోరగా, అందుకు నిరాకరించామని శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిస్సనాయకే ఆ దేశ పార్లమెంటుకు తెలిపారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో శ్రీలంక తటస్థ వైఖరి అనుసరిస్తోంది. ఈ క్రమంలో యుద్ధ విమానాలను దింపడానికి అనుమతించాలని అమెరికా విజ్ఞప్తి చేయగా శ్రీలంక తిరస్కరించింది. ఇదే విషయాన్ని ఆ దేశ అధ్యక్షుడు పార్లమెంటుకు తెలిపారు. మార్చి 4 నుంచి 8 తేదీల మధ్య జిబూటీలోని ఒక స్థావరం నుంచి రెండు క్షిపణి సామర్థ్యం కలిగిన విమానాలను మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలించేందుకు అమెరికా అనుమతి కోరిందని అనురకుమార తెలిపారు. కానీ అమెరికా అభ్యర్థనను తిరస్కరించామని వెల్లడించారు.ఎన్నో ఒత్తిళ్లు ఉన్నప్పటికీ తటస్థ వైఖరితో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నామని అన్నారు. పశ్చిమాసియా

యుద్ధం ఎన్నోసవాళ్లను విసురుతోందని, అయినప్పటికీ ఏ పక్షానికి మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేశారు. జిబూటీలోని ఒక స్థావరం నుంచి 8 యాంటీషిప్ మిసైల్స్‌తో కూడిన రెండు యుద్ధ విమానాలను మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసుకురావాలని అమెరికా భావించిందని అన్నారు.

# తెలంగాణ అసెంబ్లీ సోమవారానికి వాయిదా



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ అసెంబ్లీని సోమవారానికి (మార్చి 23) వాయిదా వేశారు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్. శుక్రవారం (మార్చి 20) బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత అసెంబ్లీని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్య శాశసన సభను వాయిదా వేశారు. **హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క. 2026--27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూ.3, 24, 234 కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఈ బడ్జెట్ లో ఆరుగ్యారెంటీలు, ఇందిరమ్మ ఇండ్లు, వద్యా శాఖ ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది ప్రభుత్వం. అందులో భాగంగా గ్యారెంటీలకు ఏకంగా రూ.50 వేల 713 కోట్ల కేటాయింపులు చేశారు. అదే విధంగా ప్రభుత్వం విద్యపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా బడ్జెట్ లో విద్య, మానవ వనరులకు విద్య, మానవ వనరులకు రూ.26 వేల 674 కోట్లు కేటాయించింది. ఆరుగ్యారెంటీల అమలుపై ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేలా బడ్జెట్ లో కేటాయింపులు చేసింది ప్రభుత్వం. ఇప్పటికే మహాలక్ష్మీ స్కీమ్ లో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత గృహ విద్యుత్, వంట గ్యాస్ సహా పలు గ్యారెంటీలు అమలులో ఉండగా మరిన్ని గ్యారెంటీలను అమలు చేసే దిశగా బడ్జెట్ లో కేటాయింపులు చేశారు.

## పెన్ పవర్ తెలంగాణ రౌండప్

# శాంతిభద్రతలకు భారీగా బడ్జెట్ కేటాయింపు..



## తెలంగాణ బడ్జెట్‌ను స్వాగతించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**రైతులు, సంక్షేమం, సమగ్ర అభివృద్ధిపై ఈ బడ్జెట్‌లో దృష్టి సారించారని వెల్లడి**

**మైనారిటీల సంక్షేమానికి రూ.3,769 కోట్లు కేటాయించడం పట్ల హర్షం**

**గత సంవత్సరం కంటే రూ.178 కోట్లు అధికంగా కేటాయించారని ప్రశంస**

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ బడ్జెట్‌పై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్పందించారు. ఈ బడ్జెట్ రైతులు, సంక్షేమం, సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించిందని అన్నారు. మైనారిటీల సంక్షేమానికి రూ.3,769 కోట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది సమ్మిళిత వృద్ధిపట్ల ప్రభుత్వం నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. మైనారిటీల కోసం గత సంవత్సరం బడ్జెట్‌లో కంటే ఈసారి రూ.178 కోట్లు అధికంగా కేటాయించారని ప్రశంసించారు.మైనారిటీ మహిళలకు 10,000 కుట్టు మిషన్ల పంపిణీ, 4,655 మంది మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ వంటి కార్యక్రమాలు ఆర్థిక స్వావలంభనకు తోడ్పడుతాయని పేర్కొన్నారు. మైనారిటీ వర్గాల ఉపాధి అవకాశాలను ఇవి మెరుగుపరుస్తాయని ఆయన తెలిపారు. ఈ బడ్జెట్‌లో మైనారిటీల విద్య, వ్యాపారాల అభివృద్ధి, ఆర్థిక స్వావలంభనకు ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు.

- రైతు భరోసాకు రూ.18,000 కోట్ల కేటాయింపు
- చేయూతకు రూ.14,861 కోట్లు
- పవర్ సబ్సిడీకి రూ.14,000 కోట్లు
- గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్లు
- పంచాయతీరాజ్ రోడ్లకు రూ.2,062 కోట్లు



**ఆరు గ్యారెంటీలకు రూ.50,713 కోట్లు.**
**పాలిటెక్నిక్ కాలేజీల్లో కొత్తగా 15 కోర్సులు**
**చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి రూ. 400 కోట్లు**
**ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ పెట్టే వారి రుణ వడ్డీ కోసం రూ. 350 కోట్లు**
**ఆలయాల అభివృద్ధికి రూ. 440 కోట్లు**
**హెచ్ఎండీఏ అభివృద్ధికి రూ. 500 కోట్లు**

హైదరాబాద్ పెన్ పవర్:2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3,24,234 కోట్లతో రాష్ట్ర వార్షిక బడ్జెట్ ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. అటు శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మల్లు భట్టి మాట్లాడుతూ... అంబేద్కర్ అడుగుజాడల్లోనే తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. వెనుకబడిన, పేద వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. పారిశ్రామిక శిక్షణ పొందుతున్న యువతను ప్రోత్సహించేందుకు... ఐటీఐ, ఏటీసీల్లో చదివే ప్రతి విద్యార్థికి నెలకు రూ. 2 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తామని తెలిపారు. ఇకపై ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్లు వెల్లడించారు.



## బీఆర్ఎస్ యువరాజు డ్రగ్స్ దందా నడుపుతుండు

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ యువరాజు డ్రగ్స్ దందా నడిపిస్తున్నాడని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం (మార్చి 20) ఆయన గాంధీ భవన్?లో మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నేతలు డ్రగ్స్ దందాపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పరస్పరం సహకరించుకుంటున్నాయన్నారు. డ్రగ్స్ నిర్మూలన బీజేపీకి ఇష్టం లేదా అని నిలదీశారు.

బీఆర్ఎస్ నేతల దగ్గర డ్రగ్స్ దొరికితే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారని విమర్శించారు. ఇక, బీసీల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదన్నారు. బీజేపీలో బీసీలకు దక్కుతున్న గౌరవం ఏంటని ప్రశ్నించారు. సికింద్రాబాద్ సీటు బీసీ లీడర్ దత్తాత్రేయ నుంచి కిషన్ రెడ్డి లాక్కున్నారు. అలాగే దత్తాత్రేయ గవర్నర్ పదవిని ఇంద్రసేనా రెడ్డి లాక్కున్నారని అన్నారు. బీసీ నేత దత్తాత్రేయకు బీజేపీలో గౌరవం ఏదని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తొక్కిపట్టిందే బీజేపీ అని అన్నారు. కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీసీలకు పెద్ద పీట వేశామని చెప్పారు.

# బడ్జెట్‌లో బీసీల గొంతు కోశారు.. రూ. 20 వేల కోట్ల బడ్జెట్ ఏమైంది?



- రాష్ట్ర బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప మరేం లేదన్న గంగుల
- బీసీ ఆత్మగౌరవ భవనాల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మండిపాటు
- కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శ

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ అంకెల గారడీ తప్ప ఏమీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. గతంలో బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఈ బడ్జెట్‌లో వారిని మోసం చేసిందని ఆరోపించారు. బీసీలకు కేటాయించాల్సిన రూ. 20 వేల కోట్ల బడ్జెట్ ఏమైంది? అని గంగుల ప్రశ్నించారు. కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించి బీసీల గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన బీసీ ఆత్మగౌరవ భవనాల భూములను ప్రస్తుత ప్రభుత్వం లాక్కునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. -4లో



## ఇది కుంభకోణాల పద్దు.. మహిళలు, రైతులను కాంగ్రెస్ నిలువునా ముంచింది

**రాష్ట్ర బడ్జెట్ పై జగదీశ్ రెడ్డి తీవ్ర విమర్శలు**

**ప్రజలను వంచించేలా బడ్జెట్ ఉందని మండిపాటు**

**ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అటకెక్కించిందని విమర్శ**

**రైతు భరోసాపై నమ్మక ద్రోహం చేశారన్న జగదీశ్ రెడ్డి**

**వృద్ధులు, వికలాంగుల ఆశలపై నీళ్లు చల్లారని ఆగ్రహం**

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌పై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ముప్పేట దాడికి దిగింది. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఈ బడ్జెట్ ప్రజలందరినీ వంచించేలా ఉందని, అందరి చెవిలో పూలు పెట్టే ప్రయత్నాన్ని రేవంత్ సర్కార్ చేస్తోందని మండిపడ్డారు.ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2,500 ఇస్తామని రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చారని... -4లో

# సీఎంను కలిసిన ప్రభుత్వ విప్‌లు



హైదరాబాద్ పెన్ పవర్: అసెంబ్లీలో, శాసనమండలిలో ప్రభుత్వ విప్‌లుగా నియామకమైన ఎమ్మెల్యేలు వేముల వీరేశం, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, విజయరమణారావు, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య తదితరులు ఉన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఇది కుంభకోణాల పద్దు.. మహిళలు, రైతులను కాంగ్రెస్ నిలువునా ముంచింది

- 3 పేజి తరువాయి

ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. ఇది ఆడబిడ్డలను నట్టేట ముంచడం కాదా? అని ప్రశ్నించారు.రైతు భరోసాపై నమ్మక ద్రోహం చేశారని ఆయన మండిపడ్డారు. ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. కనీసం పాత పద్ధతిలో ఇవ్వాల్సిన రూ. 12 వేలు అయినా ఎప్పుడు ఇస్తారో కూడా బడ్జెట్‌లో స్పష్టత లేదని ధ్వజమెత్తారు. రైతులకు ఇచ్చిన ప్రతి మాట ఉత్తమాటగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.వృద్ధులు, వికలాంగుల ఆశలపై కూడా ప్రభుత్వం నీళ్లు చల్లిందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. "వృద్ధులకు రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మౌనంగా ఉండటం దారుణం. నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ బడ్జెట్‌లో చిన్న కేటాయింపు కూడా లేదు" అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్ ప్రజల అభివృద్ధి కోసం కాదని, కేవలం కాంగ్రెస్ నేతలు కుంభకోణాలు చేసుకోవడానికే పనికొస్తుందని జగదీశ్ రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పక్కదారి పట్టించేందుకే అంకెల గారడీ చేస్తున్నారని విమర్శించారు.

# వస్త్రనగరి ఉక్కిరిబిక్కిరి..
# సిరిసిల్ల పరిశ్రమపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం

**రాజన్న సిరిసిల్ల, పెన్ పవర్:**
రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యంతో ఇప్పటికే ఆగమైన సిరిసిల్ల వస్త్రపరిశ్రమ, పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో మరింత ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. వార్ ఎఫెక్ట్‌తో క్రూడాయిల్ ధరలు పెరగడంతో వస్త్ర పరిశ్రమలో ఉపయోగించే యార్న్, రసాయనాల ధరలు అమాంతం పెరుగడంతో సిరిసిల్లలోని పాలిస్టర్, కాటన్ పరిశ్రమ సందిగ్ధంలో పడింది. ఇప్పటికే ప్రభుత్వ అరకొర ఆర్డర్లతో ముక్కుతూ.. మూలుగుతూ నడుస్తుండగా, తాజా పరిస్థితులతో మరింత ఆందోళనకరంగా మారింది. గుజరాత్ రాష్ట్రం సిల్‌వాస నుంచి పాలిస్టర్ యార్న్ దిగుమతి, కాటన్ యార్న్ ఆంధ్రా, తమిళనాడు నుంచి రావాల్సి ఉంటుంది. క్రూడాయిల్, ఇంధన ధరలు పెరగడంతో రవాణాపై ప్రభావంపడి యార్న్ రేట్లు పెరిగాయి. 20 రోజులుగా పెట్టుబడితో పాటు గిట్టుబాటు ధర రాని పరిస్థితులు కనబడటంతో యజమానులు, ఆసాములు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు.
ఇటు ప్రభుత్వ ఆర్డర్లను టెండర్ల ద్వారా గుజరాత్ కంపెనీలకు సర్కార్ కట్టబెట్టడంతో కార్మికులకు చేతినిండా పనిలేకుండాపోయింది. ఇచ్చిన ఆర్డర్లకు ప్రభుత్వం ధరలు తగ్గించడంతో గిట్టుబాట ధర రాక వస్త్రోత్పత్తికి విఘాతం కలుగుతున్నది. కరోనాలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆనాటి కేసీఆర్ సర్కార్ వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వ ఆర్డర్లు, బతుకమ్మ చీరలు ఇచ్చి ఆదుకున్నది. ప్రస్తుతం యుద్ధ ప్రభావంతో భారీగా పెరిగిన యార్న్ ధరలతో వస్త్రోత్పత్తి ముందుకు సాగడం గగనంగా మారింది. ప్రభుత్వమే ముందుకు వచ్చి ఈ విపత్కర పరిస్థితుల నుంచి బయటపడేసి ఆదుకోవాలి, లేదంటే వస్త్ర పరిశ్రమలోని 6 వేల మంది కార్మికులు పనిలేకుండా రోడ్డు మీద పడే దుస్థితి వస్తుంది.
సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఆగమాగం: యార్న్ రేట్లు పెరగడంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఆగమైపోయింది. గత నెలలో వచ్చిన యార్న్ ఇప్పటికే వినియోగించుకోవడంతో తదుపరి యార్న్ కోసం ఆందోళన చెందుతున్నారు. పాలిస్టర్ యార్న్ కిలోకు రూ.107 ఉండగా అదనంగా మరో రూ.33 పెరిగి, రూ.140కి చేరింది. కాటన్ యార్న్ పాత రేటు కిలో రూ.152 ఉండగా రూ.16 పెరిగి రూ.168 చేరింది. అద్దకం పరిశ్రమలో వినియోగించే రసాయనాల ధరలు 30 శాతం పెరగడంతో అదనంగా మీటరు వస్త్రం తయారీకి రూ.5 నుంచి రూ.6 భారం పడుతున్నంది.
ఇదిలా ఉంటే.. ప్రభుత్వం మాత్రం అందించిన ఆర్డర్లకు ధర తగ్గించడం గమనార్హం. దీంతో వస్త్ర పరిశ్రమ యజమానులు, అసాములు, కార్మికులు అందోళన చెందుతున్నారు. అంతంత మాత్రంగా నడుస్తున్న పరిశ్రమలు యార్న్ రేటుతో మూతపడే పరిస్థితి నెలకొంది. దీంతోపాటు 20 రోజులగా వస్త్రోత్పత్తి నిల్వలు పేరుకుపోయాయి.
సర్కార్‌పైనే భారం..: యుద్ధ ప్రభావం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై తీవ్రంగా పడింది. సిరిసిల్ల పరిశ్రమకు దక్కాల్సిన ప్రభుత్వ అర్డర్లను ఇటీవలే టెండర్ల ద్వారా గుజరాత్‌కు చెందిన కంపెనీలకు అప్పజెప్పారు. దీంతో సిరిసిల్లకు దక్కాల్సిన రూ.60 కోట్ల ప్రభుత్వ ఆర్డర్లు దూరమయ్యాయి. ఇటు యుద్ధ ప్రభావంతో నూలు ధరలు పెరిగి.. పెట్టుబడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో వస్త్రోత్పత్తి భారమైంది. దీంతో కాటన్, పాలిస్టర్‌లోని 6 వేల మంది కార్మికులు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. యార్న్ రేటు పెరగడంతో కాటన్, పాలిస్టర్ పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పెట్టుబడితో పాటు గిట్టుబాటు ధర రాకపోవడంతో పాటు నష్టాల్లో ఉండడంతో పరిశ్రమ నిర్వహణ కార్మికులకు ఉపాధిలేక ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో పరిశ్రమకు ప్రభుత్వం అండగా ఉండాలని కార్మికులు వేడుకుంటున్నారు.
రోజూ 18 లక్షల మీటర్ల వస్త్రోత్పత్తి: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ప్రతిరోజూ 18 లక్షల మీటర్ల వస్త్రోత్పత్తి జరుగుతున్నది. పాలిస్టర్ పరిశ్రమలో 15 లక్షల మీటర్లు, కాటన్ పరిశ్రమలో 3 లక్షల మీటర్లు వస్త్రోత్పత్తి జరుగుతున్నంది. 18 వేల మరమగ్గాలపై పాలిస్టర్ వస్త్రోత్పత్తి జరగగా.. 4 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. 5 వేల మరమగ్గాలపై కాటన్ వస్త్రోత్పత్తి జరుగుతున్నది. రెండు పరిశ్రమల్లో 200 మంది యజమానులు, 1600 మంది అసాములు, 6 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. 20 రోజులుగా 3.60 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి జరిగి వీటి నిల్వలు పేరుకుపోయాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం పరిశ్రమను ఆదుకోవాల్సి ఉండగా పట్టించుకోకపోవడమే ఇందుకు కారణం. ఇది ఇలాగే కొనసాగితే పాలిస్టర్, కాటన్ పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డునపడే పరిస్థితి వస్తది.
క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం సహకరించాలి: క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం పరిశ్రమకు సహకరించాలి. గత బీఆర్ఎస్ సర్కార్ కరోనా లాంటి విపత్కర పరిస్థితిలోనూ బతుకమ్మ చీరెలు, తదితర ఆర్డర్లు ఇచ్చి సంక్షోభంలేకుండా చూసింది. యుద్ధ ప్రభావంతో యార్న్ రేట్లు పెరిగి.. కాటన్, పాలిస్టర్ పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడింది. పెట్టుబడితోపాటు గిట్టుబాటు ధర రాని పరిస్థితి ఉంది. మీటరు వస్త్రానికి అదనంగా రూ.5 నుంచి రూ.6 భారం పడటంతో వస్త్రోత్పత్తి నిర్వహణ కష్టంగా మారింది. 20 రోజులుగా యార్న్ ధరలు పెరుగుతూ వస్తున్నాయి,, ప్రభుత్వమే సహకరించి మాంద్యాన్ని నివారించాలి. వస్త్ర పరిశ్రమకు అండగా నిలవాలి.

# వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ సెటైర్లు

**హైదరాబాద్, మార్చి 20 పెన్ పవర్:**
సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఆప్షన్ ఉంటుందని మనందరికీ తెలుసు. కానీ ఒక రాష్ట్రానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ సభ గడప తొక్కకుండానే "అటెండెన్స్ అక్కర్లేని అసాధారణఉద్యోగి" గా కొత్త రికార్డు సృష్టించారు మన గులాబీ బాస్. 'రాజ్యం పోయినా రాచరికం పోలేదు' అన్న సామెతను నిజం చేస్తూ గజ్వేల్ ఫామ్ హౌస్ నుంచే ప్రజాస్వామ్యాన్ని శాసిస్తున్న తీరుపై ఇప్పుడు అసెంబ్లీలోసీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు.సామాన్యుడు ఒక్క రోజు ఆఫీస్ మానేస్తే జీతంలో కోత పడుతుంది. కానీ మన ప్రతిపక్ష నేత గారికి మాత్రం ఇప్పటి వరకు అక్షరాలా రూ. 1.06 కోట్ల జీతభత్యాలు ప్రభుత్వంచెల్లించింది. సభకు వచ్చి ప్రజా సమస్యలపై గళం ఎత్తాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, కేవలం అకౌంట్‌లో పడే మెసేజ్‌లకే పరిమితమైన ఈ 'రాజకీయం' చూసి సామాన్యులు నోరెళ్లబెడుతున్నారు. "కోటి రూపాయలజీతం తీసుకుంటూ కోలుకోలేని నిద్రలో ఉండటం" అంటే ఇదేనేమోనని చర్చించుకుంటున్నారు.గవర్నర్ శివప్రతాప్ శుక్లా అసెంబ్లీలో 'తెలంగాణ రైజింగ్ 2047' అంటూ భవిష్యత్ ప్రణాళికలు వివరిస్తుంటే.. ప్రధానప్రతిపక్షం మాత్రం "మేము రాము.. మాకు ఆ విజన్ డాక్యుమెంట్లు పట్టవు" అన్నట్లుగా వ్యవహరించింది. దీనిపై రేవంత్ సెటైర్ వేశారు. ఏఐ సునామీ రాబోతోందని గవర్నర్ చెబితే, ప్రతిపక్షం మాత్రం ఇంకాపాత రికార్డులే వేస్తోంది. కనీసం విజన్ డాక్యుమెంట్ చదివారా? అంటే.. "మాకు అధికారం పోయిన దుఃఖం చదవడానికే టైమ్ సరిపోవడం లేదు" అన్నట్లుగా ఉందని ఎద్దేవాచేశాడు.నాలుగు కోట్ల మంది ప్రజలు తమగొంతుక వినిపిస్తారని అసెంబ్లీ వైపు చూస్తుంటే, ప్రతిపక్ష నాయకుడు మాత్రం గవర్నర్‌కు కనీసం శుభాకాంక్షలు చెప్పడానికి కూడా రాలేదు. సభకు రాకుండా జీతం తీసుకోవడం అనేది ఒక "మాయని మచ్చ" అనిరేవంత్ రెడ్డి అభివర్ణించారు. అంటే విధులకు హాజరు కాకుండా జీతం తీసుకునే ఈ కొత్త ట్రెండ్‌పై ఇప్పుడు స్పెషల్ క్లాస్ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకోవడం అనేది 'కళ'అయితే.. అందులో కేసీఆర్ గారు 'ఆస్కార్' రేంజ్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. మరి ఈ 'కోటి రూపాయల అటెండెన్స్' వివాదం ఎటు దారితీస్తుందో చూడాలి!

# నల్గొండ పట్టణంలో అశా వర్కర్ల అందోళన

**నల్గండ: పెన్ పవర్:** నల్గొండ గడియారం సెంటర్ వద్ద మండు ఎండలో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల నిరసన ట్రాఫిక్ జామ్ కు దారి తీసింది. స్థానిక మంత్రి కార్యాలయం ఇందిరా భవన్ ను సిఐటియు ఆశ వర్కర్ల యూనియన్ ముట్టడించింది. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఇందిరా భవన్ ముందు నిరసనకారులు బైఠాయించారు. ఆశా వర్కర్లకు రూ. 18,000/- ఫిక్స్ వేతనం వెంటనే అమలు చేయాలి. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి. ఆశాల అన్ని సమస్యల పరిష్కారానికి ఎన్ఎహెచ్ఎం కింద తగిన నిధులు కేటాయించాలి.. ఆశా వర్కర్లపై పెరుగుతున్న పనిభారం తగ్గించి, అదనపు భత్యాలు ఇవ్వాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలని అన్నారు.
గర్భిణీలు, శిశు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశాలకు ప్రత్యేక గౌరవ వేతనం ఇవ్వాలి. ప్రమాద భీమా, ఆరోగ్య భీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేసారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సలీం, దండంపల్లి సత్తయ్య జిల్లా ఉపాధ్యక్షుడు, లకపాక రాజు,పింజర్ల సైదులు, ఆశా కార్యకర్త జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, వెంకటమ్మ, సునీత, సిఐటియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...



# ఎంటీ పూల్లో హైడ్రాలిక్ లిఫ్ట్ షెడ్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించిన జిల్లా ఎస్పీ

**మహబూబ్నగర్ పెన్ పవర్:**
జిల్లా మోటార్ ట్రాన్స్పోర్ట్ (మీ) పూల్ లో హైడ్రాలిక్ లిఫ్ట్ (లాంచ్) స్థాపన కోసం షెడ్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి. జానకి, నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో వాహనాల నిర్వహణ అత్యంత కీలకమని తెలిపారు. హైడ్రాలిక్ లిఫ్ట్ (లాంచ్) ఏర్పాటు ద్వారా వాహనాలకు ఆయిల్ మార్పిడి, వాషింగ్ మరియు మరమ్మత్తులు సులభంగా, వేగంగా చేయుటకు వీలవుతుందని చెప్పారు. దీని వల్ల వాహనాల నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు, ఫీల్డ్ డ్యూటీలకు వాహనాలు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండేలా చేయవచ్చని వివరించారు. అలాగే, పోలీస్ శాఖలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా సేవలను మరింత మెరుగుపరచడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సిబ్బంది అందరూ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ శాఖ ప్రతిష్టను నిలబెట్టాలని సూచించారు. ఈ పూజా కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టవిరుద్ధమైన జప్తును కొనసాగించలేం

**శేరిలింగంపల్లి, మార్చి 20 పెన్ పవర్:** వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నపుడు చట్టప్రకారం జప్తు చేసే అధికారం సంబంధిత మేజిస్ట్రేట్‌కు మాత్రమే ఉంటుందని హైకోర్టు స్పష్టత ఇచ్చింది. పోలీసులకు అధికారం లేకపోయినా చట్టవిరుద్ధంగా చేసిన జప్తును కొనసాగించ లేమంటూ పేర్కొంది. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలో అద్దెకు ఉన్నవారు వ్యభిచార గృహం నిర్వహిస్తుండటంతో పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు అయిదు అంతస్తుల భవనాన్ని జప్తు చేశారు. దీన్ని సవాలు చేస్తూ భవనం యజమాని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ వేణుగోపాల్ విచారణ చేపట్టి ఇటీవల తీర్పు వెలువరించారు. నోటీసు జారీ చేసి జప్తు చేసే అధికారం మేజిస్ట్రేట్‌కు మాత్రమే ఉంటుందని తెలిపారు. పోలీసులకు అలాంటి అధికారం ఉండదని పేర్కొన్నారు. ప్రస్తుత కేసులోని రికార్డుల ప్రకారం పిటిషనర్ భవన యజమాని అని, అద్దెకు తీసుకున్నవారు చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తెలిసీ అనుమతించినట్లు ఆధారాలూ లేవన్నారు.

## చదువుపై శ్రద్ధ పెట్టమన్నందుకు తల్లిపై కుమారుడి దాడి

**సనత్‌నగర్, మార్చి 20 పెన్ పవర్:** చదువుపై శ్రద్ధ పెట్టకపోవడంతో సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని.. ఫోన్ లాక్కోవడానికి యత్నించిన తల్లిపై కుమారుడు దాడి చేసిన ఘటన బోరబండ ఠాణా పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కల్యాణ్‌నగర్ వెంచర్-3లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసించే దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఇబ్రహీంపట్నంలోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. చదువుపై శ్రద్ధ పెట్టకుండా.. ఫోన్ వాడుతుండడంతో లాక్కోవడానికి యత్నించగా తల్లిని కిందికి తోసేశాడు. తల్లిపై దాడి చేయడాన్ని సహించలేకపోయిన చిన్న కుమారుడు అడ్డుకోవడానికి యత్నించగా అతనిపై కత్తితో దాడి చేశాడు.

## రూ.52లక్షల విలువైన గంజాయి పట్టివేత



**సూర్యాపేట, మార్చి 20 పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ఠాణా సమీపంలో చేపట్టిన వాహన తనిఖీల్లో పెద్ద మొత్తంలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. జూలూరుపాడు ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వివరాలను వెల్లడించారు. ఈ నెల 18న ఠాణా సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా రెండు కార్లలో ఉన్న వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. వాటిల్లో నుంచి 105.54కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.52.77లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. అదుపులోకి తీసుకున్న నిందితులను విచారించగా గంజాయిని ఆంధ్రప్రదేశ్‌లోని కలిమెళ్ల, డొంకరాయి నుంచి షిర్డీ తరలించనున్నట్లు తేలింది. నల్గొండ జిల్లా మర్రిగూడెం మండలం ఎర్రగాళ్లపల్లి గ్రామానికి చెందిన శివాకర్ ప్రమోద్‌కుమార్, ఇదే జిల్లా దేవరకొండ ఖిల్లా బజారుకు చెందిన బైరిశెట్టి భార్గవ్, రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన అంధేకర్ శ్రీనివాస్‌ను అరెస్టు చేసి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

## కోదండరాం, అమీర్ అలీ ఖాన్లకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

**హైదరాబాద్ పెన్ పవర్:** గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు కోదండరాం, అమీర్ అలీ ఖాన్ లకు సుప్రీం కోర్టులో చుక్కెదురయింది.తెలంగాణ హైకోర్టు తమపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసి శాసనమండలి సమావేశాల్లో పాల్గొనేలా తమకు అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టులో ఇద్దరూ పిటిషన్ దాఖలు చేసారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రస్తుత దశలో తాము మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని, మీరు ముందు హైకోర్టుకు ఎందుకు వెళ్లలేదని, హైకోర్టులో పిటిషన్ వేసి వాళ్లు కొట్టివేస్తే ఇక్కడికి రండి అంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దీంతో కనీసం మరొక వాయిదా వేయాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోరగా, ఏప్రిల్ 22వ తేదీకి తదుపరి విచారణను వాయిదా వేసింది.

## ఘోర రోడ్డు ప్రమాదం
## ఆటోను ఢీకొట్టిన కారు, ఒకరు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండలం పురుషోత్తమాయిగూడెం శివారులో ఈరోజు ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మా నిజం న్యూస్ తెలుసుకున్న వివరాల ప్రకారం, కురవి వైపు వెళ్తున్న ఆటోలో పిట్టల శ్రీనివాస్, పద్మ, గాలి అరుణ, కీరి, శేఖర్, రామసాని వెంకన్నతో పాటు డ్రైవర్ రవీందర్ ప్రయాణిస్తున్నారు. ఈ సమయంలో ఎదురుగా వచ్చిన కారు అదుపుతప్పి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వారంతా గాయపడగా, రామసాని వెంకన్న తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ రామసాని వెంకన్న (55) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.మిగతా గాయపడిన వారికి చికిత్స కొనసాగుతోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ప్రమాదానికి అధిక వేగమే కారణమై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బడ్జెట్‌లో బీసీల గొంతు కోశారు.. రూ. 20 వేల కోట్ల బడ్జెట్ ఏమైంది?

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా అబద్ధాలు చెబుతోందని గంగుల కమలాకర్ విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని ఇంతకు ముందు ఒక మంత్రి చెప్పారని, ఇప్పుడు మాత్రం కేసీఆర్ హయాంలో కార్డులు ఇవ్వలేదని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు మొహం చాటేశారని... ఇది ప్రజల చెవిలో పువ్వు పెట్టడమే అని విమర్శించారు.

# గ్రేటర్ లో కోర్ అర్బన్ యాక్ట్

**హైదరాబాద్, మార్చి20 పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మహా నగరాభివృద్ధి కోసం దశాబ్దాల కాలం నాటి పాత చట్టాలను పక్కన పెట్టి, అత్యంత శక్తివంతమైన కోర్ అర్బన్ రీఫార్మ్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ చట్టాన్ని తీసుకువస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో రాబోయే ఈ కొత్త చట్టం, నగర పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. ప్రధానంగా అక్రమ కట్టడాల నియంత్రణ, చెరువుల సంరక్షణ , విపత్తు నిర్వహణను ఒకే గొడుగు కిందికి తీసుకురావడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం.ఈ కొత్త చట్టం ద్వారా హైడ్రా కు తిరుగులేని చట్టబద్ధమైన అధికారాలు లభించనున్నాయి. ఇప్పటివరకు అక్రమ నిర్మాణాల కూల్చివేతకు హైడ్రా అధికారులు

ఇతర మునిసిపల్ విభాగాలపై లేదా రెవెన్యూ అధికారుల నోటీసులపై ఆధారపడాల్సి వచ్చేది. కానీ కోర్ చట్టం అమలులోకి వస్తే, హైడ్రా నేరుగా అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసే అధికారంతో పాటు, తక్షణమే

కూల్చివేతలు చేపట్టే విచక్షణాధికారాలను కూడా పొందుతుంది. దీనివల్ల కాలయాపన తగ్గి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుంది.నగర పరిధిలోని ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్ పరిధులు ,

బఫర్ జోన్ల ఆక్రమణలను అడ్డుకోవడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది. నోటీసులు ఇచ్చే ప్రక్రియను డిజిటలైజ్ చేయడం ద్వారా పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా, నిబంధనలు ఉల్లంఘించే భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసేలా కఠిన నిబంధనలను ఇందులో పొందుపరిచారు. ఇది క్షేత్రస్థాయిలో అవినీతిని అరికట్టడానికిదోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.కోర్ చట్టం కేవలం అక్రమ కట్టడాల కూల్చివేతకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఒక ప్రణాళికాబద్ధమైన ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు

పునాదిగా నిలవనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నాటి పాత చట్టాల వల్ల ఎదురవుతున్న న్యాయపరమైన చిక్కులను అధిగమిస్తూ, నూతన తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నారు. అసెంబ్లీలో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి, అధికారికంగా అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గోదావరి నదిలో మునిగి ఐదుగురు యువకులు గల్లంతు

**కొత్తగూడెం, మార్చి 20 పెన్ పవర్:** గోదావరి నదిలో స్నానానికి వెళ్లినవారిలో ఐదుగురు యువకులు గల్లంతయ్యారు. ఈ ఘటన శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం సరిహద్దు ప్రాంతం కూనవరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. భద్రాచలానికి చెందిన ఏడుగురు యువకులు కూనవరం రోడ్డులోని గోదావరి నదిలో స్నానాలు చేసేందుకు దిగారు. నది లోతు తెలియకపోవడంతో ప్రమాదవశాత్తూ వారిలో ఐదుగురు యువకులు గల్లంతవగా, మిగిలిన ఇద్దరూ ఒడ్డుకు చేరుకొన్నారు. గమనించిన స్థానికులు గల్లంతైన వారికోసం బోట్లపై వెళ్లి గాలింపు చర్యలు చేపడుతున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## టాక్స్ చెల్లించలేదని మన గ్రోమార్ ఆఫీసు కు తాళం

**డోర్నకల్, మార్చి 20 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలో ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించని మన గ్రోమార్ అనే ఎరువుల దుకాణానికి శుక్రవారం మున్సిపాలిటీ అధికారులు తాళం వేశారు. మార్చి 30వ తేదీలోపు బకాయి ఉన్న వారందరూ తప్పకుండా మున్సిపాలిటీ టాక్స్ చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రజలు విధిగా ప్రాపర్టీ టాక్స్ చెల్లించాలని సూచించారు.

## మహబూబాబాద్ జిల్లాలో క్షుద్ర పూజలు కలకలం

**మహబూబాబాద్, మార్చి 20 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం కాంపల్లి గ్రామ శివారు పెరుమాడ్ల సంకీస క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అన్నం, ఉప్పు, ఎండి మిర్చి, నిమ్మకాయలు, బొగ్గులు, అనాళ్లతో క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఇది ఆకతాయిల పనా లేక మరేదైనా కారణం ఉందా అనే దానిపై చర్చ జరుగుతోంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులను శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## నగర డిసిసి కార్యదర్శి ఎన్నిక

**నిజామాబాద్, మార్చి 20 పెన్ పవర్:** నిజామాబాద్ నగర డిసిసి కార్యదర్శిగా దండోత్కర్ వినోద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నిక పార్టీ కార్యకలాపాలకు కొత్త ఊపునిస్తుందని భావిస్తున్నారు.

## జుక్కల్ కేజీబీవిని తనిఖీ చేసిన కలెక్టర్

**ఎల్లారెడ్డి, మార్చి 20 పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ శుక్రవారం జుక్కల్ మండలం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యాలయంలోని సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కొంతసేపు మాట్లాడిన కలెక్టర్, మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

## కామారెడ్డి జిల్లా కాంగ్రెస్పార్టీ ఉపాధ్యక్షునిగా విద్యాసాగర్

**కామారెడ్డి, మార్చి 20 పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నేత మంచిర్యాల విద్యాసాగర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మదన్ మోహన్, డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, కాంగ్రెస్ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నియామకం సందర్భంగా రాహుల్, హర్ష వర్ధన్ వంటి అభిమానులు విద్యాసాగర్ ను శాలువాతో సత్కరించారు.

## చద్మల్ తాండలో రూ. 25 లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణం పూర్తి

**బాన్సువాడ, మార్చి 20 పెన్ పవర్:** గాంధారి మండలం చద్మల్ తాండలో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ అభివృద్ధి పనులతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణంతో గ్రామంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయి. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసినందుకు గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## హైదరాబాద్ మెట్రోసేవలకు కాసేపు అంతరాయం

**ఉప్పల్, మార్చి 20 పెన్ పవర్:** నాగోల్-రాయదుర్గం మార్గంలో మెట్రో సేవలకు అంతరాయం ఏర్పడింది. సాంకేతిక సమస్యతో మెట్రో సర్వీసులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దాదాపు 20 నిమిషాల పాటు సేవలు నిలిచిపోయాయి. మరమ్మతుల అనంతరం మెట్రో సర్వీసులు కొనసాగుతున్నాయి.

# డిగ్రీలో మరో 39 కోర్సులు




**హైదరాబాద్, మార్చి 20 పెన్ పవర్:**
రాష్ట్రంలో వచ్చే ఏడాది నుంచి కొత్తగా మరో 39 కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. డిగ్రీ, పీజీలు చదివే విద్యార్థులకు.. చదువు పూర్తి కాగానే.. ఉద్యోగం చేతికి వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. కొత్తగా తీసుకురానున్న జాబ్ ఓరియెంటెడ్ కోర్సులతో హైదరాబాద్‌ను పలు రంగాల్లో మరింత అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించనున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త విద్యా విధానంతో సుమారు 20 లక్షల ఉద్యోగాలురానున్నా యని అంచనా వేస్తున్నాయి.ప్రస్తుతం ఏటా లక్షలాది మంది విద్యార్థులు డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి.. ఉద్యోగ వేట కోసం మార్కెట్‌లోకి వస్తున్నారు. అయితే చదివిన చదువుకు తగిన స్కిల్స్ లేకపోవడం వల్ల ఉద్యోగాలు రాక.. ప్రైవేటు కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. కంపెనీలకు కావాల్సిన స్కిల్స్ కొత్తగా కాలేజీల నుంచి బయటికి వచ్చిన విద్యార్థులకు లేకపోవడంతో.. వారిని తీసుకునేందుకు సంస్థలు వెనకడుకు వేస్తున్నాయి. దీంతో అటు విద్యార్థులకు ఉద్యోగాలు లేక.. ఇటు కంపెనీలకు స్కిల్స్ ఉన్న ఉద్యోగులు దొరక్క.. గ్యాప్ ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ గ్యాప్‌ను భర్తీ చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి

కీలక చర్యలు చేపట్టనుందఇందులో భాగంగానే వచ్చే విద్యా సంవత్సరం (2026-2027) నుంచి రాష్ట్రంలోని అండర్ గ్రాడ్యుయేట్ (డిగ్రీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ)ల్లో 39 నూతన కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లుతెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి స్పష్టం చేశారు. ఈ కొత్త కోర్సులకు సంబంధించిన సిలబస్‌ను జూన్-జులై నాటికి రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లువివరించారు. తాజాగా ఈ కొత్త కోర్సులకు సంబంధించి స్టూడెంట్స్, ప్రొఫెసర్లతో మంగళవారం టీశాట్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. ప్రొఫెసర్లు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు సమాధానాలు

ఇచ్చారు.తెలంగాణ ప్రభుత్వ విజన్ 2047లో భాగంగా.. రాష్ట్రంలో నిరుద్యోగాన్ని రూపుమాపడమే లక్ష్యంగా ఈ కొత్త కోర్సులను రూపొందించినట్లు ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానం ద్వారా రాష్ట్రంలోకి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయమని వెల్లడించారు. ఒక్క మ్యారిటైమ్ రంగంలోనే రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కొత్తగా ప్రవేశపెట్టనున్న కోర్సుల ద్వారా తెలంగాణలో సుమారు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు వస్తాయని అంచనా వేశారుఇదే కాకుండా ఏరోస్పేస్, డిఫెన్స్, ఫిన్‌టెక్, క్లైమేట్ సైన్స్, లైఫ్ సైన్సెస్, ఫుడ్ టెక్నాలజీ వంటి రంగాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని టీజీసీహెచ్ఈ ఛైర్మన్ తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని ఫార్మా, ఏరోస్పేస్, లైఫ్ సైన్సెస్ హబ్‌గా డెవలప్ చేయడంలో ఈ కొత్త కోర్సులు కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడించారు. ఇండస్ట్రీ-అకాడమీ అనుసంధానం కోసం ప్రాధాన్యతను ఇస్తూ.. పలు కంపెనీలతో ఎంఓయూలు కుదుర్చుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులకు తప్పనిసరిగా ప్రాక్టికల్స్, ఇంటర్న్‌షిప్‌లు, ఫీల్డ్ వర్క్, ఇండస్ట్రీ ప్రాజెక్ట్‌లను అమలు చేసి.. వాటికి కూడా క్రెడిట్ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నట్లు తేల్చి చెప్పారు.గ్రామీణ విద్యార్థుల కోసం ల్యాండ్ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ వంటి స్పెషల్ కోర్సులను కూడా ప్రవేశపెడుతున్నట్లు స్పష్టం చేశారు.

అదే సమయంలో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్లకు పరిష్కారం కోసం క్లైమేట్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇక టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భాగంగా ఐఐటీ మద్రాస్ సాయంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ట్యూటర్లను ప్రవేశపెడుతున్నట్లు అధికారులు తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ఈ ఏఐ ట్యూటర్లు విద్యార్థులకు

వచ్చే సందేహాలను నివృత్తి చేస్తాయని పేర్కొన్నారు. డిజిటల్ లెర్నింగ్ మాడ్యూల్స్ ద్వారా ఎప్పుడైనా, ఎక్కడైనా విద్యార్థులు చదువుకునే వెసులుబాటు కలుగుతుందని వివరించారు.

# మలుపులు తిరుగుతున్న ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్, మార్చి 20 పెన్ పవర్:**
తెలంగాణలో పెను సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు ప్రస్తుతం ఒక కీలక మలుపు తిరిగింది. ఈ కేసు లోతుపాతులను వెలికి తీసేందుకు, అంతర్జాతీయ డ్రగ్ మాఫియాతో ఉన్న సంబంధాలను నిగ్గుతేల్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో మార్చి 14 శనివారం రాత్రి పెద్ద ఎత్తున డ్రగ్ పార్టీ జరుగుతోందని పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఈగల్ టీం, స్థానిక పోలీసులు అర్ధరాత్రి సమయంలో మెరుపు దాడులు నిర్వహించారు.ఈ దాడుల సమయంలో అక్కడ పది మందికి పైగా వ్యక్తులు ఉన్నారు. పోలీసులను చూడగానే అక్కడ ఉద్రిక్తత నెలకొంది. రోహిత్ రెడ్డి అనుచరులు, ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మ పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారని, రోహిత్ రెడ్డి

ప్రోద్బలంతోనే నమిత్ శర్మ గాలిలోకి కాల్పులు జరిపారని పోలీసులు ఖీ×=లో పేర్కొన్నారు.ఈ కేసులో పోలీసులు మొత్తం 11 మందిపై చీణూూ చట్టం, ఆర్మ్స్ యాక్ట్, దీచీూ కింద కేసులు నమోదు చేశారు. పైలట్ రోహిత్ రెడ్డిని ూ1గా చేర్చారు. ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, నమిత్ శర్మలపై కూడా కఠిన చర్యలు తీసుకున్నారు. సంఘటనా స్థలంలో ఉన్న వారందరికీ డ్రగ్ పరీక్షలు నిర్వహించగా, రోహిత్ రెడ్డితో పాటు మరికొందరికి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు చెప్పారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ కూడా ఈ పార్టీలో పాల్గొనడం రాజకీయంగా పెద్ద దుమారం రేపింది. రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలకు కోర్టు 14 రోజుల

జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం 9 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేసింది. చెవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ నేతృత్వంలో పనిచేసే ఈ బృందం ఫ్యూచర్ సిటీ కమిషనర్ జి. సుధీర్ బాబు పర్యవేక్షణలో ఉంటుంది. ఈ పార్టీకి డ్రగ్స్ ఎక్కడి నుండి వచ్చాయి? దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతో వీరికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అన్న కోణంలో దర్యాప్తు జరుగుతోంది. పార్టీకి హాజరైన ఇతర రాజకీయ నేతలు, వ్యాపారవేత్తల జాబితాను సిట్ సిద్ధం చేస్తోంది. లైసెన్స్ ఉన్న తుపాకీతో పోలీసులపైకి కాల్పులు జరపడం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యాన్ని

విచారించనున్నారు. మూడు నెలల లోపు పూర్తి నివేదికను సమర్పించాలని ప్రభుత్వం సిట్‌ను ఆదేశించింది.ఈ కేసు కేవలం ఒక క్రైమ్ కేసుగా కాకుండా రాజకీయంగా పెను మార్పులకు కారణమవుతోంది. బీఆర్ఎస్ నేత రోహిత్ రెడ్డి అరెస్ట్ కావడంతో పార్టీ ఇరకాటంలో పడింది.

మరోవైపు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పేరు రావడం కూటమి ప్రభుత్వానికి కూడా సవాలుగా మారింది. రెండు పార్టీలు ఇప్పటికే తమ నేతలకు నోటీసులు జారీ చేశాయి. రాష్ట్రంలో డ్రగ్స్ వాడకంపై కఠినంగా ఉంటామని చెప్తున్న ప్రభుత్వానికి, ఈ కేసులో ప్రముఖులు పట్టుబడటం ఒక పరీక్షగా మారింది. సిట్ విచారణ పారదర్శకంగా జరిగితే మరిన్ని పెద్ద పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది.మొయినాబాద్ ఫామ్‌హౌస్ కేసు తెలంగాణ సమాజంలో డ్రగ్స్ సంస్కృతి ఎంతలా పాతుకుపోయిందో తెలియజేస్తోంది. చట్టసభలకు ప్రాతినిధ్యం వహించిన వారే ఇలాంటి చర్యలకు పాల్పడటం విచారకరం. సిట్ విచారణ ద్వారా డ్రగ్స్ సప్లై చైన్ తెంచగలిగితేనే, ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణపై చేస్తున్న పోరాటానికి అర్థం ఉంటుంది. రాబోయే మూడు నెలలు ఈ కేసులో అత్యంత కీలకం కానున్నాయి.

# టీ కాంగ్రెస్‌లో బీసీ వర్సెస్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 20, పెన్ పవర్:**
తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి మాస్ లీడర్ అని ఆయనకు పీసీసీ ఇస్తే వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు సాధిస్తామంటూ మాస్ ఎలివేషన్స్ ఇచ్చారు. ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న వేళ ప్రతిపక్షాల విమర్శలకు చెక్ పెట్టాల్సిన అధికార పార్టీలో, ఉన్నట్టుండి పీసీసీ మార్పు అంశం చర్చకు రావడం ఆసక్తిగా మారింది. దాంతో ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ పరిస్థితి ఏంటి? అంటూ బీసీ నేతలు కోమటిరెడ్డి వ్యాఖ్యలపై మండిపడుతున్నారు.మంత్రి కోమటిరెడ్డి కామెంట్స్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో రెడ్డి వర్సెస్ బీసీ అనే వివాదానికి తెరలేపినట్లైంది. ప్రస్తుతం బీసీ వర్గానికి చెందిన మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీగా కొనసాగుతున్న తరుణంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన జగ్గారెడ్డిని పీసీసీ చేయాలని అలా చేస్తే వంద సీట్లు సాధిస్తామని చిట్ చాట్ లో చెప్పడాన్ని బీసీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్, కాంగ్రెస్ నేత ఈరవత్రి అనిల్ స్పందిస్తూ సొంత పార్టీపై కోమటిరెడ్డి వ్యాఖ్యలు దురదృష్టకరం అన్నారు. మంత్రి వ్యాఖ్యలు బీసీ నాయకత్వాన్ని

కించపర్చడమేనని బీసీల పట్ల ఎందుకంత వివక్ష అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నిన్ను మంత్రిని చేస్తే కీలకమైన హోదాలో ఉండి ఇలాంటి పిచ్చి పిచ్చి స్టేట్‌మెంట్లు ఇస్తూ పార్టీ పరువు తీస్తున్నారని సొంత పార్టీ మద్దతుదారులే సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో రేవంత్ రెడ్డిపైనే తీవ్ర ఆరోపణలు చేసిన కోమటిరెడ్డి ఇప్పుడు ఆయన కేబినెట్ లోనే ఉంటూ బీసీలను అవమానించేలా మాట్లాడుతున్నారని మండిపడుతున్నారుతాజా పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే పార్టీ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. సీఎల్పీ సమావేశంలో దిశానిర్దేశం చేస్తూ అనవసర వివాదాల జోలికి వెళ్లవద్దని, పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు. అయినా మంత్రి కోమటిరెడ్డి మాత్రం జగ్గారెడ్డి విషయంలో చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలోనే చిచ్చురాజేసినట్లైంది.తన వ్యాఖ్యలు పార్టీలో వివాదానికి దారి తీస్తుండటంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. మహేశ్ కుమార్ గౌడ్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. మహేశ్ కుమార్ గౌడ్ సారథ్యంలోనే గ్రామ పంచాయతీ, మున్సిపల్


ఎన్నికల్లో విజయం సాధించామని చెప్పారు. రంజాన్ వేడుకలకు జగ్గారెడ్డి ఏర్పాట్లు బాగున్నాయి. అందుకే పీసీసీ చీఫ్ అయితే బాగుంటుందని మాత్రమే అన్నారు. ఇప్పుడున్న పీసీసీని తొలగించాలనేది ఉద్దేశం కాదు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

# భారత్‌లో రాష్ట్రాల సగటు ఆయుష్షు.. తెలుగు రాష్ట్రాల సంగతేంటి?

**హైదరాబాద్ పెన్ పవర్:** మనం ఎంత సంపాదించాము అనేదాని కంటే.. ఎంత కాలం ఆరోగ్యంగా బ్రతికామనేదే ముఖ్యం.. తాజాగా భారత ప్రభుత్వం విడుదల చేసిన 'సగటు ఆయుష్షు' గణాంకాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ లిస్ట్‌లో కేరళ అగ్రస్థానంలో నిలవగా, తెలుగు రాష్ట్రాల పరిస్థితి ఎలా ఉంది? ఏయే రాష్ట్రాల్లో జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయి? మీ రాష్ట్రం ఈ జాబితాలో ఎక్కడ ఉందో తెలుసుకోవాలనుందా? అయితే ఈ వివరాలు చూసేయండి..

**కేరళ టాప్.. హిమాచల్ భేష్:**
భారతదేశంలో అత్యధిక సగటు ఆయుష్షు కలిగిన రాష్ట్రంగా కేరళ 75.1 ఏళ్లతో మొదటి స్థానంలో నిలిచింది. అక్కడి మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు, అక్షరాస్యత దీనికి ప్రధాన కారణాలు. ఆ తర్వాతి స్థానాల్లో హిమాచల్ ప్రదేశ్ (74.4), జమ్మూ కాశ్మీర్ (74.4) ఉండటం విశేషం. చల్లని వాతావరణం, కాలుష్యం తక్కువగా ఉండటం కూడా ఈ కొండ ప్రాంత ప్రజలు ఎక్కువ కాలం జీవించడానికి సహకరిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ కూడా 74.2 ఏళ్లతో టాప్ ర్యాంకుల్లోనే ఉండటం గమనార్హం.

**తెలుగు రాష్ట్రాల పరిస్థితి ఏంటి?:**
ఇక మన తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ దాదాపు ఒకే స్థాయిలో ఉన్నాయి. తెలంగాణలో సగటు ఆయుష్షు 70.8 ఏళ్లుగా ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 70.7 ఏళ్లుగా నమోదైంది. అంటే జాతీయ సగటుకు దగ్గరగా మనం ఉన్నామన్నమాట. తమిళనాడు (73.4), మహారాష్ట్ర (72.8) వంటి పొరుగు రాష్ట్రాలు మనకంటే కొంచెం మెరుగైన స్థితిలో ఉన్నాయి. ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకుంటే మన ఆయుష్షు కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.




**వెనుకబడిన రాష్ట్రాల్లో అసలు కారణాలు:**
ఈ జాబితాలో ఛత్తీస్‌గఢ్ 64.6 ఏళ్లతో అందరికంటే చివరన నిలిచింది. మధ్యప్రదేశ్ (67.6), ఉత్తరప్రదేశ్ (68.0) వంటి రాష్ట్రాలు కూడా తక్కువ ఆయుష్షు కలిగిన జాబితాలో ఉన్నాయి. ఇక్కడ మాతా శిశు మరణాలు ఎక్కువగా ఉండటం, పోషకాహార లోపం మరియు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు అందకపోవడం వంటివి సగటు ఆయుష్షు తగ్గడానికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్నా, ఆరోగ్య రంగంలో ఈ రాష్ట్రాలు ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.

**ఆయుష్షు పెరగాలంటే ఏం చేయాలి?:**
కేవలం ప్రభుత్వం ఇచ్చే డేటా మాత్రమే కాదు, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక వంటి రాష్ట్రాలు 70 ఏళ్ల మార్కు వద్ద ఉన్నాయి. మెరుగైన వైద్యం అందరికీ అందుబాటులోకి రావడం, స్వచ్ఛమైన తాగునీరు, కాలుష్య నియంత్రణ వంటివి ప్రజల ఆయుష్షును పెంచుతాయి. బ్రతికే రోజుల్లో కూడా రాష్ట్రాల మధ్య ఈ పోటీ ఆరోగ్యకరమైనదే! ఏ రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుందో, ఆ రాష్ట్ర ప్రజలు అంత ఎక్కువ కాలం చిరునవ్వుతో జీవిస్తారు అన్నది నిపుణుల మాట.

# అటవీ సంరక్షణ సామాజిక బాధ్యత

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ అటవీ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 21 న నిర్వహించ బడుతుంది. 2012 లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రకటించినప్పటి నుండి, ప్రపంచ దేశాలు అన్ని రకాల చెట్లు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2012, నవంబరు 28న యునెస్కో వారిచే తీర్మానించబడిన ప్రపంచ అటవీ దినోత్సవం, 2013 మార్చి 21న తొలిసారిగా నిర్వహించ బడింది. మానవుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరమని తెల్పడం ప్రపంచ అటవీ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం. ప్రస్తుత, ముందు తరాల వారికి అడవుల ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియ జేయడం కోసం ఈ దినోత్సవం రోజున వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు.మానవాళి మనుగడకు అడవులు సోపానాలు. మన జీవావరణ సంపదలు. ఇవి అనేక జీవరాసులకు ఆవాసాలు. పర్యావరణ సమతుల్యానికి పట్టు కొమ్మలు. నదీనదాలకు వర్షాధారాలు. అడవులు మూలికా ఔషధాలకు నిలయాలు. జీవకోటికి ప్రాణ వాయువును అందించడం లోనూ, భూమి కోతను నివారించి భూసారాన్ని పరిరక్షించడం లోనూ ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అందుకే వృక్షో రక్షిత రక్షితః అన్నారు. వృక్షాలను మనం రక్షిస్తే, అవి మనల్ని రక్షిస్తాయి.

రిజర్వు అడవులు: ఇవి ప్రభుత్వం పరిరక్షణలో వుంటాయి. మానవుల, పశువుల సంచారానికి మరియు కలప కొరకు చెట్లును నరకడం ఈ అడవులలో నిషేధం. భారత దేశంలో ఈ అడవులు 40.1 మిలియన్ హెక్టార్లు అనగా 53% వరకు విస్తరించి వున్నాయి.రక్షిత అడవులు: ఇవి ప్రభుత్వం పరిరక్షణలో వున్నప్పటికీ మానవులు, పశువులు సంచారానికి అనుమతి వుంది. అయితే ఈ అడవులకు ఎటువంటి నష్టాన్ని కలుగ చేయకూడదు. భారత దేశంలో ఈ అడవులు 21.5 మిలియన్ హెక్టార్లు అనగా 29% వరకు విస్తరించి వున్నాయి. కేటాయించని అడవులు: ఇవి చెట్లు నరకడానికి, మరియు పశువుల సంచారానికి ఎటువంటి నియమ నిర్బంధాలు లేవు. భారత దేశంలో ఈ అడవులు 13.1 మిలియన్ హెక్టార్లు అనగా 18% మేరకు విస్తరించి వున్నాయి. అడవులు ప్రపంచంలో 4.057 మిలియన్ హెక్టార్ల భూభాగంలో విస్తరించి వున్నాయి. ప్రపంచ అటవీ విస్తీర్ణత లో భారత దేశంలో అటవీ విస్తీర్ణత 1.85% వుంది. అంటే 2% కూడా లేదు. తలసరి అటవీ విస్తీర్ణత 0.05 హెక్టార్లు మాత్రమే వుంది. 2003 ఇండియన్ సెట్ ఫారెస్టు రిపోర్టు ప్రకారం 69.79 మిలియన్ హెక్టార్ల అడవులు భారత దేశ భూభాగంలో విస్తరించి వున్నాయి. ఇది దేశ భౌగోళిక విస్తరణలో 21.23%గా వుంది. ఈ నివేదిక 2013 ప్రకారం అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 34.572 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. రాష్ట్ర భూభాగంలో 22.64% కలిగి వున్నాయి. దేశ అటవీ విస్తీర్ణత ప్రకారం ఆంధ్ర రాష్ట్రం 9వ స్థానాన్ని కలిగి వుంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో 29.242 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉండేవి. రాష్ట్ర భూభాగంలో 25.46% మేరకు విస్తరించి ఉండేవి. కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఖమ్మం జిల్లాలోని 327 ముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడం వల్ల రాష్ట్ర అడవుల విస్తీర్ణం 26,903.70 చ.కి.మీ.కు తగ్గింది. ఇది రాష్ట్ర వైశాల్యంలో 23.99 శాతం.

దేశ అటవీ విస్తీర్ణతలో 4.22% వరకు విస్తరించి, తెలంగాణ 12వ స్థానాన్ని కలిగి వుంది. ఈ సర్వే ప్రకారం భారత దేశంలో అడవులు ఎక్కువగా వున్న రాష్ట్రలలో మధ్య ప్రదేశ్ మె?దటి స్థానాన్ని రెండవ స్థానాన్ని అరుణాచల ప్రదేశ్ మూడవ స్థానాన్ని ఛత్తీస్ గడ్ రాష్ట్రాలు వరుస స్థానాల్లో వున్నాయి. అత్యధిక అడవులు కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాల్లో మె?దటి స్థానంలో నికోబార్ రెండవ స్థానంలో దాద్రా నగర్ హవేలి వున్నాయి. భారత దేశంలో అత్యధిక శాతం అడవులు కలిగిన రాష్ట్రాలు మిజోరం మె?దటి స్థానంలో అరుణాచల ప్రదేశ్ రెండవ స్థానంలో వున్నాయి. దేశంలో అత్య అల్ప శాతం అడవులు కలిగిన రాష్ట్రలు వరుసగా హర్యానా మొదటి స్థానంలో పంజాబ్ రెండో స్థానంలో బీహార్ మూడో స్థానంలో వున్నాయి. అత్యఅల్ప శాతం అడవులు కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాలు వరుసగా పుదుచ్చేరి మె?దటి స్థానంలో ఢిల్లీ రెండవ స్థానంలో వున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్షా డబ్బై వేల ఎకరాల అడవులు అంతరిస్తున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చెట్లును నరికివేసి వాటి నుంచి వచ్చే కలపను ఇంధనంగా వాడటం, పశువుల పచ్చిక బయళ్ళుగా మార్చడం, వంట చెరకు, గృహ నిర్మాణాలు, గృహోపకరణాలకు ఉపయో గించడం, పెరుగుతున్న ప్రపంచ జనాభా అవసరాలను తీర్చడానికి జనావాసాలుగా మార్చడం వంటి చర్యలను అటవీ నిర్మూలనకు కారణాలు. అలాగే అడవుల్లో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలతో విలువైన జాతుల అటవీ సంపదకు నష్టం వాటిల్లుతోంది. భారీ వృక్షాలు, అడవి జంతువులతో పాటు ఆయుర్వేద గుణాలున్న విలువైన మూలికా వృక్షాలు, మొక్కలకు చేటు కలుగుతోంది. సమస్త జీవకోటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అడవులే ఆధారం. అయితే, ప్రస్తుతం అంతరించి పోతున్న అడవులు జీవ వైవిధ్యానికి గొడ్డలి పెట్టుగా మారాయి. ఒకవైపు అక్రమార్కుల చేతిలో పడి అడవులు చిక్కిపోతుంటే, మరోవైపు మానవ తప్పిదాలు అటవీ సంపదకు చేటు చేస్తున్నాయి. వేసవిలో ఏటా అగ్ని ప్రమాదాలకు వృక్ష సంపద ఆహుతవుతోంది. పెరుగుతున్న జనాభా తమ అవ సరాలకు మించి అడవులను నరికివేస్తున్న వైనం. దీంతో ఉష్ణోగ్రతలు పెరిగి జల, వాయు కాలుష్యాలు అధికమై సమస్త జీవరాసుల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. అటవీ నిర్మూలన జరిగిన ప్రదేశాల్లో భూమి కోతకు గురవుతుంది. బంజరు భూమిగా రూపాంతరం చెందుతుంది. వైల్డ్ లైఫ్ యాక్ట్ ప్రకారం భూభాగంలో 33 శాతం అడవులు ఉండాలి. ప్రస్తుతం 24.12 శాతం మాత్రమే ఉన్నాయి. ఇది చాలా విచారించదగ్గ విషయం. అంతరించి పోతున్న వాటిని కాపాడు కోవలసిన బాధ్యత అందరిపైనా ఉంది. అడవుల రక్షణ బాధ్యత అందరిది.

# ఈద్-ఉల్-ఫితర్

**హైదరాబాద్ పెన్ పవర్:** ముస్లింలపవిత్ర గ్రంథం ఖురాన్ సంపూర్ణంగా అవతరించిన మాసం రంజాన్. రంజాన్ మాసంను ముస్లింలు ఎంతో పవిత్రంగా భావిస్తారు. నెలవంకతో ప్రారంభమైన రంజాన్ మాసం.. మళ్లీ నెలవంక రాకతోనే ముగుస్తుంది. రంజాన్ ముగింపులో భాగంగా 'ఈద్ ఉల్ ఫితర్' పండుగను నిర్వహిస్తారు. రంజాన్ నెలలో 29 లేదా 30వ రోజు ఆకాశంలో చంద్ర దర్శనం చేసుకుంటారు. మరుసటి రోజు ఈద్ జరుపు కుంటారు. నిజానికి ఈ రోజు 10 నెల షవ్వాల్ కు మొదటి రోజు. షవ్వాల్ నెలలో మొదటి రోజైన ఈద్-ఉల్-ఫితర్ నాడు ముస్లింలు ఉపవాసం చేయకూడ దనేది ఆచారం. ఇస్లామియ దేశాలలో, ముస్లింల సముదాయాలలో అవలంబింప బడుతున్న కేలండర్ చంద్ర మాసాలపై ఆధారంగా గలది. దీన్ని 'తఖ్వీమ్-హిజ్రి-ఖమరి' అని కూడా అంటారు. ఈ కేలండర్ లో 12 చంద్ర మాసాలు, దాదాపు 354 దినాలు గలవు. హిజ్రీ శకానికి మూలం ముహమ్మద్ ప్రవక్త సంబంధిత హిజ్రా, హిజ్రాహ్ లేదా హిజ్రత్. మహమ్మదు ప్రవక్త , ఆయన అనుయాయులు మక్కా నుండి మదీనా కు క్రీ.శ. 622 లో వలస వెళ్ళారు. ఈ వలస వెళ్ళడాన్నే హిజ్రత్ అని అంటారు. క్రీ. శ. 622. సెప్టెంబరు లో మహమ్మదు ప్రవక్త తమ అనుయాయులతో కలసి హిజ్రత్ (వలస) 'యస్రిబ్' నగరాన్ని చేరు కొన్నట్లు చెపుతారు. యస్రిబ్ నగరానికి మదీనా లేదా "మదీనతున్ – నబీ" లేదా నబీ (ప్రవక్త) యొక్క నగరంగా పేరు స్థిర పడింది. అలా ముస్లింల శకం హిజ్రీ ప్రారంభ మయినట్లు, ఉమర్ కాలంలో 638లో ఇస్లామియ కేలండర్ ప్రారంభమయినట్లు చెపుతారు.మహమ్మదు ప్రవక్త వలస . క్రీ. శ.622 సెప్టెంబరు 9 నాడు మక్కానగరం లోని తమ ఇంటిని వదిలి, మక్కాకు దగ్గరలోని తూర్ గుహలో మూడు రోజులు గడిపి, 622న సెప్టెంబరు 23న మక్కా పొలిమేరలు దాటి, యస్రిబ్ ప్రాంతానికి పయనమైనారు. సెప్టెంబరు 20న మదీనా దగ్గరలోని "ఖుబా" ప్రాంతానికి చేరుకున్నారు ....24 సెప్టెంబరు 34న ఖుబా నుండి మదీనా ప్రయాణం సాగించి, శుక్రవారపు ప్రార్థనలు జరిపారు. 622 అక్టోబరు 4న మదీనా మొదటి దర్శనం జరిగినట్లు తెలుస్తోంది.హిజ్రీ ప్రారంభం మొహర్రం నెలలో కాకుండా, ఇస్లామియ కేలండరు లోని మూడవనెల అయిన రబీఉల్ అవ్వల్ నెలలో హిజ్రత్ జరిగింది. అంటే హిజ్రీ శకం, హి.శ. 1 లోని మూడవ నెల అయిన రబీఉల్ అవ్వల్ 22 వ తేదీన ప్రారంభం అవుతుంది. ఇస్లాం క్యాలెండర్‌లోని హిజ్రీ నెల స్థానిక చంద్రోదయంపై ఆధారపడి వుండడంతో మతపెద్దలు నెలవంక కనిపించగానే ఈద్ ఉల్ ఫితర్ ప్రకటిస్తారు. ఈద్ అసలు పేరు ఈద్-ఉల్-ఫితర్. ఫితర్ లేదా ఫిత్రా పదానికి అర్థం... మానవునిలో గల ప్రాకృతిక ధర్మం ప్రాతిపదికగా తనతో పాటు ఇతరులకూ సంతోషాన్నివ్వడం. ఈ ధర్మం ప్రకారం భాగ్యము లేని పేద వారికి, ధన రూపేణా భాగ్యము కల్పించడం. ఈ ఫిత్రా రంజాన్ పండుగ సందర్భంగా, పేదలకు, అభాగ్యులకు ఇచ్చే దానం. ప్రతి ముస్లిం ఇవ్వవలసిన కనీస దానం. ఈ దానం, రంజాన్ పండుగకు మూడు రోజుల ముందు నుండి ఇవ్వవచ్చును. అలా ఇచ్చినపుడు, పేదలూ సంతోషంగా పండుగ చేసుకునే వాతావరణం ఏర్పడుతుంది. దేవుడి పట్ల కృతజ్ఞతగా ... పేదలకు దానం చేసే ఈవిధానంలో గోధుమలు గానీ , ఆహార ధాన్యాలను గానీ, ధనాన్ని గానీ పంచిపెడతారు. ఈ దానం కుటుంబంలోని సభ్యులందరి తరపున పేదలకు అందజేస్తారు. చంద్ర దర్శనానంతరం చిన్నవారు, పెద్దలకు నమస్కరిస్తారు, శుభాశీస్సులు పొందుతారు. పండుగ రోజున సాధారణంగా ఈద్ ముబారక్, ఈద్ సద్ అని శుభాకాంక్షలు ఒకరికొకరు చెప్పుకుంటారు. ఈద్ నాడు స్నానానంతరం నూతన వస్త్రాలను ధరిస్తారు. పురుషులు మసీదుకు, ఈద్గాహకు వెళ్ళి, చిన్న పెద్ద, ధనిక పేద, తరతమ భేదాలు లేక వరుసలో నిలబడి నమాజు పఠిస్తారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపు కుంటారు. ఇళ్ళలో పాయసం

తదితర పిండి వంటలు భుజిస్తారు. స్నేహితులకు, బంధువులకు కట్న కానుకలను సమర్పించు కుంటారు. పేదలకు దానాలు చేసారు. రంజాన్ నెలలో చేసే దానాలను 'జకాత్' అంటారు. రంజాన్ మాసం భక్తి శ్రద్ధలకు, పవిత్రతకు, నియమాలకు ప్రతీక. ఏకాగ్రతతో ఆత్మసాక్షాత్కారార్థమై, పాపములు తొలుగుటకు, లౌకిక విషయాలను పక్కనపెట్టి, పారమార్థిక విషయాలపై దృష్టి సాధించేందుకు కఠోర నియమాలను పాటించాల్సి ఉంటుంది. రంజాన్ సందర్భంగా నెలరోజుల పాటు ఉపవాస దీక్ష తో పాటు, నియమిత వేళలో భుజిస్తూ దీక్షను స్వీకరించేవారు దైవ భక్తి, ఆత్మ సంయమనంతో పాటు, ఆరోగ్య వంతులుగా ఉండగలరనేది నిర్వివాదాంశం. పవిత్ర మాసంలో ఉపవాసాలు, దీక్షలు, ఆధ్యాత్మిక చింతన, దానాలు, ధర్మాలు చేపడుతూ, నెల రోజులు దీక్షా దక్షులు అయిన ముస్లిం సోదరులు పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపు కునేందుకు ఉద్యుక్తులు అవుతున్నారు.

## తల్లి మరణంతో తల్లడిల్లుతున్న పిల్లలు

**పరకాల, మార్చి 20 పెన్ పవర్:** తండ్రి చేతిలో తల్లీతోపాటు తాత హతం కావడం.. అభం శుభం తెలియని చిన్నారుల జీవితం అగమ్యగోచరంగా మారింది. మమ్మల్ని ఎవరు సాకుతారో తెలుసుకోలేని దిక్కు తోచని పరిస్థితి వారిది. కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహ కల్ప సముదాయంలో బుధవారం తెల్లవారుజామున అదనపు కట్నం కోసం అల్లుడు పోక్కుల ప్రవీణ్ భార్య రాజశ్రీని, మామ రాజశేఖర్‌ను హత్య చేసిన విషయం తెలిసిందే. తప్పు చేసిన తండ్రి, తిరిగిరాని లోకాలకు వెళ్లిన తల్లి.. వెరసి వారి ఏడాదిన్నర బాలుడు జయాంశ్, ఆరు నెలల పాప (జయశ్రీ) పరిస్థితి దయనీయంగా మారింది.

## తహశీల్దార్ కార్యాలయం ముందు ఆశా వర్కర్ల ఆందోళన

**నర్సాపూర్, మార్చి 20 పెన్ పవర్:** పెండింగ్‌లో ఉన్న వేతనాల సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 18,000 వేతనం ఇప్పటికీ అమలు కాలేదని, నెలల తరబడి జీతాలు రాక జీవనోపాధి కష్టంగా మారిందని వారు తెలిపారు. తమను పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగి, తమకు రావాల్సిన పారితోషికం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే శనగలకు మద్దతు ధర



**జహీరాబాద్, మార్చి 20 పెన్ పవర్:** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో శనగలకు మద్దతు ధర లభిస్తుందని ఆత్మ కమిటీ ఛైర్మన్ రామలింగారెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. శనగలకు మద్దతు ధర కల్పించేందుకు నాఫెడ్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులు వాటిని విక్రయించాలని కోరారు. క్వింటాకు మద్దతు ధర రూ.5875 చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఎకరాకు 7 క్వింటాళ్ల చొప్పున శనగలను కేంద్రాలకు తీసుకురావాలన్నారు. వారం వ్యవధిలో నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు.

## అటవీ భూములపై.. అక్రమార్కుల కన్ను!

**వికారాబాద్, మార్చి 20 పెన్ పవర్:** జిల్లాలోని అటవీ భూములపై అక్రమార్కులు కన్నేశారు. వేసవిలో అడవుల్లోని చెట్లను యంత్రాలతో తొలగించి.. ఖాళీగా మారిన భూమిని సాగు భూముల్లో కలిపేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఇది జరగక ముందే అధికారులు అప్రమత్తం కావాలని ప్రజలు కోరుతున్నారు. తాండూరు, ధారూర్, కొడంగల్, వికారాబాద్, పరిగి రేంజ్‌ల పరిధిలో వేల ఎకరాల భూములను కబ్జాచేశారు. వీటిల్లో కొందరు పంటలు సాగు చేస్తుంటే, మరికొందరు ఇతరులకు కౌలుకు ఇచ్చి ఆర్థిక లబ్ధి పొందుతున్నారు.

## వనపర్తి వాసికి మిద్దె తోట పురస్కారం

**వనపర్తి, మార్చి 20 పెన్ పవర్:** రైతు నేస్తం ఫౌండేషన్ ప్రతి ఏటా అందించే శ్రీ తుమ్మేటి రాఘోత్తమ రెడ్డి రైతు నేస్తం మిద్దె తోట పురస్కారం–2025కు వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన పోల్కంపల్లి సుజాత ఎంపికయ్యారు. తన ఇంటి టెర్రస్ పై సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలను గత 5 సంవత్సరాలుగా సాగు చేస్తున్నందుకు ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును శనివారం గుంటూరులో అందజేయనున్నారు.

## గంజాయి మత్తులో యువకుడి పై దాడి

**అచ్చంపేట, మార్చి 20 పెన్ పవర్:** అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో అర్ధరాత్రి గంజాయి మత్తులో యువకులు హల్‌చల్ చేశారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన యువకుడు గోపీకృష్ణపై మధురానగర్ కాలనీకి చెందిన ఉజ్వల్ కారులో వచ్చి ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో గమనించిన వారి స్నేహితుడు అద్వైత్ అడ్డుకొనే ప్రయత్నం చేయడంతో అతనికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను రాత్రి 3 గంటల సమయంలో ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అయింది, ఎవరెవరు గంజాయి తీసుకున్నారు. అనే కోణంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.

## గ్యాస్‌లీకై అగ్ని ప్రమాదం

**మహబూబ్‌నగర్, మార్చి 20 పెన్ పవర్:** వంట గ్యాస్ సిలిండర్‌లీకై మంటలు రేగిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. సూరాపురానికి చెందిన శ్రీలత, వెంకటస్వామి కుమారుడు సిలిండర్‌కు రెగ్యులేటర్ అమర్చుతుండగా గ్యాస్‌లీకైంది. గదిలో విద్యుత్తు బల్బు వేసి ఉండటంతో మంటలు రేగాయి. ప్రమాద సమయంలో అందరూ ఒకేగదిలో ఉండటంతో బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో వెంకటస్వామికి గాయాలవ్వగా...లింగాల పీహెచ్‌సీకి తరలించారు. శ్రీలతకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అచ్చంపేట అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో రూ.50వేలు, 5తులాల బంగారు, 60తులాల వెండి ఆభరణాలు కాలిపోయాయి.

## ఆశ వర్కర్ల మహా ధర్నా..

**నల్లగొండ, మార్చి 20 పెన్ పవర్:** నల్గొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు శుక్రవారం మహా ధర్నా చేపట్టారు. తమ పని భారం తగ్గించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం 18000 చేసి పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎండి సలీం, ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య, రాజు సైదులు, మహేశ్వరి, వెంకటమ్మ మరియు పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సంఘం జిల్లా కోశాధికారిగా కంపె దుర్గయ్య

**మిర్యాలగూడ, మార్చి 20 పెన్ పవర్:** మండలంలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కంపె దుర్గయ్య తెలంగాణ

రైతు సంఘం జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై, వారు పండించిన పత్తి, వరి, మిరప, తదితర పంటలకు మద్దతు ధర లభించేంత వరకు పోరాడుతామన్నారు. జిల్లా కోశాధికారి ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్సీ, సీపీఐ పార్టీ నల్గొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి గుజ్జ రామచంద్రం, సీపీఐ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతపై అసత్య వార్తలను ప్రజలు నమ్మవద్దు



**నిర్మల్, మార్చి 20 పెన్ పవర్:** జిల్లాలో ప్రజల అవసరాలకు సరిపడా గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, సరఫరాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. ప్రజలు బుక్ చేసుకున్న సిలిండర్లు నిర్ణీత గడువులోపు డోర్ డెలివరీ అవుతాయని, ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన పనిలేదని తెలిపారు. గ్యాస్ కొరతపై వస్తున్న అసత్య వార్తలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

## తండ్రి మందలించాడని మనస్తాపం.. యువతి ఆత్మహత్య

**బెల్లంపల్లి, మార్చి 20 పెన్ పవర్:** తండ్రి మందలించాడని మనస్తాపంతో యువతి బలవన్మరణానికి పాల్పడింది. యువతి ఆత్మహత్య ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. రెండో పట్టణ ఎస్ఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి పట్టణం సుభాష్‌నగర్‌బస్తీకి చెందిన లింగంపల్లి లావణ్య, శ్రీనివాస్‌లకు ఒక కుమారుడు, కూతురు వర్షిత(19) సంతానం. ఇటీవలే వర్షిత ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసింది. స్నేహితుడికి ఇంట్లో నుంచి కొంత ఆర్థిక సాయాన్ని చేసింది. డ్రైవర్‌గా పనిచేస్తున్న తండ్రి తమ ఆర్థిక పరిస్థితే బాగా లేనప్పుడు ఎందుకు ఇచ్చావంటూ మందలించాడు. ఏనాడూ మందలించని తండ్రి కోపగించుకోవడంతో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బాత్‌రూంలోకి వెళ్లి ఉరేసుకుంది. వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్ఐ వివరించారు.

## చరవాణిలో యువతుల చిత్రాలు.. కేసు నమోదు

**బోథ్, మార్చి 20 పెన్ పవర్:** చరవాణిలో యువతుల చిత్రాలు దాచిన వ్యక్తితో పాటు ఆ వ్యక్తి చరవాణి బలవంతంగా లాక్కొని తనిఖీ చేసిన వారిపై పరస్పర కేసులను టూటౌన్ పోలీసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు వివరాల మేరకు.. ఆదిలాబాద్ పట్టణం షాద్‌నగర్‌కు చెందిన తౌఫిఖ్‌ఉల్లాఖాన్ వేదాంత అకాడమీ వద్ద ఉండగా పట్టణానికి చెందిన బండారి సంతోష్, కార్తిక్, అక్షయ్‌తో పాటు మరికొంత మంది అతని వద్దకు వెళ్లి ఫోన్ లాక్కొని తనిఖీ చేశారన్నారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా పై వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో నిందితులు షీటీంకు ఫిర్యాదు చేయగా తౌఫిఖ్‌ఉల్లాఖాన్ చరవాణిని షీటీం సభ్యులు తనిఖీ చేసి పలువురు యువతుల ఫొటోలున్నట్లు గుర్తించారు. దీంతో అతడిపైనా కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు మాట్లాడుతూ ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, ఏ సమాచారం ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువతుల ఫొటోలు చరవాణిలో ఉంచుకోవడం నేరమని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## గ్యాస్ కోసం వినియోగదారుల బారులు

**కరీంనగర్, మార్చి 20 పెన్ పవర్:** కమాన్‌పూర్‌లోని గ్యాస్ ఏజెన్సీ వద్ద ఎల్పీజీ సిలిండర్ల కోసం వినియోగదారులు భారీగా బారులు తీరారు. ఉదయం నుంచే మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో ఏజెన్సీ ముందు క్యూలలో నిలబడ్డారు. ఇటీవల ఇరాన్ ? ఇజ్రాయిల్ ? అమెరికాల మధ్య ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో గ్యాస్ కొరత ఏర్పడుతుందేమోనన్న భయంతో వినియోగదారులు ముందస్తుగా బుకింగ్ చేసుకుంటున్నారు. దీంతో ఏజెన్సీ వద్ద మరింత రద్దీ నెలకొంది. మరోపక్క గ్యాస్ బుకింగ్ గడువు కూడా పెంచడం వినియోగదారులకు సమస్యగా మారింది.

## నిధులున్నా పనులు మందగమనం

**చొప్పదండి, మార్చి 20 పెన్ పవర్:** జగిత్యాల పురపాలిక పరిధిలో అమృత్ 2.0 పనులు నత్తనడకన సాగుతున్నాయి. పట్టణంతో పాటు శివారు కాలనీల్లో ఆటంకం లేకుండా శుద్ధ జలాలను సరఫరా చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏడాదిన్నర కిందట పనులు ప్రారంభించారు. ఎప్పటికప్పుడు నిధులు మంజూరయ్యే అవకాశం ఉన్నా, గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

## వేములవాడలో సీతారాముల కళ్యాణోత్సవాలు వైభవంగా

**వేములవాడ, మార్చి 20 పెన్ పవర్:** వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాల్లో రెండవ రోజు పూజా కార్యక్రమాలు వైభవంగా శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా శ్రీసీతారాముల స్వామివారికి పంచోపనిషత్తు విధానంలో అభిషేకం, శ్రీరామచంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీరాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రేవతి నక్షత్రం సందర్భంగా శ్రీలక్ష్మి అనంత పద్మనాభ స్వామివారికి పంచోపనిషత్తు ద్వారా అభిషేకం చేశారు.

## పాల్వంచలో ఘర్షణ కారు అడ్డగించి దాడి

**పినపాక, మార్చి 20 పెన్ పవర్:** పాల్వంచ మండలం తోగూడెం మార్గంలో గొర్రెల మంద ఎదురవడంతో కారు డ్రైవర్ హారన్ కొట్టిన ఘటన వివాదానికి దారితీసింది. ఈ క్రమంలో గొర్రెల కాపరితో వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కాపరి తన బంధువులను పిలిపించి కారును అడ్డగించి డ్రైవర్‌పై దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితులు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భద్రాచలం శ్రీరామాలయంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**భద్రాచలం, మార్చి 20 పెన్ పవర్:** భద్రాచలం శ్రీరామాలయంలో శ్రీరామనవమి కల్యాణ బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వైదిక పండితులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, అభిషేకాలు నిర్వహించారు. పరాభవ నామ సంవత్సరాన్ని వివరిస్తూ, చెడు గుణాలను విడిచిపెట్టి దైవారాధనతో జీవితాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. సాయంత్రం వర్షం కారణంగా తిరువీధి సేవను మార్గం మార్చి నిర్వహించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మరిపెడలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి తీవ్ర గాయాలు



**జనగామ, మార్చి 20 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పురుషోత్తమాయగూడెం సమీపంలోని సీతారాం తండా వద్ద కారు, ఆటో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కేసీఆర్ ఫామ్ హౌజ్.. తెలంగాణ పబ్లిక్ స్కూల్.. రేవంత్ భలే ప్లాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా.. అత్యంత కీలకమైన బడ్జెట్ సమర్పణ వేళ.. ముఖ్య విషయం వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫాంహౌజ్ కు పరిమితం కాకుండా, అసెంబ్లీకి రావాల్సిందిగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ను పదేపదే కోరుతున్న సీఎం రేవంత్ రెడ్డి త్వరలో చేయబోయే ప్రారంభోత్సవం ఆశ్చర్యపరుస్తోంది. తెలంగాణ రాజకీయాల్లోనే కాదు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లోనూ చర్చనీయాంశమైన అంశం కేసీఆర్ ఫామ్ హౌజ్. ఇప్పుడు దీని దగ్గరే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేయనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్ )లను ప్రారంభించనున్నారు. వీటిలో ముఖ్యమైనది సిద్దిపేట జిల్లా మర్కూక్ లో నిర్మించబోయేదే. అదేమంటే.. ఈ స్కూల్ ను కట్టేది కూడా కేసీఆర్ ఫామ్ హౌజ్ కు అత్యంత సమీపంలో కావడమే. కేసీఆర్ 2010-11 నుంచి ఎర్రవల్లి ఫామ్ హౌజ్ లోనే ఎక్కువ ఉంటున్నారు. అక్కడినుంచే 2014 ముందు వరకు తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చి సీఎం అయిన తర్వా కూడా ఫాంహౌజ్ విషయమై ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున విమర్శలు చేశాయి. ఇక 2023 చివరలో అధికారంలో కోల్పోయాక కేసీఆర్ ప్రగతి భవన్ నుంచి నేరుగా ఫాంహౌజ్ కు వెళ్లిపోయారు. ఈ రెండేళ్లకుపైగా సమయంలో 90 శాతం ఆయన అక్కడే గడిపారు.

**22న సీఎం రేవంత్ వెళ్తారా?**

మర్కూక్ లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి ఈ నెల 22న అంటే ఆదివారం రేవంత్ శంకుస్థాపన చేయనున్నారు. ఇదే రోజు సిద్దిపేట జిల్లా నంగునూరులో పామాయిల్ పరిశ్రమను ప్రారంభించనున్నారు. అయితే, టీపీఎస్ కు రేవంత్ వర్చువల్ గా శంకుస్థాపన చేస్తారని తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినందున టీపీఎస్ ల విషయంలో అంతే స్థాయిలో నిర్మాణాలు ఉంటాయని భావించవచ్చు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి వంద టీపీఎస్ లను ఏర్పాటు చేయాలని రేవంత్ ఆదేశించారు. అంటే, ఏడాదిన్నరలో ఇవి అందుబాటులోకి రానున్నాయి.

**అతి సమీపంలోనే..**

మొదట కేసీఆర్ ఫాంహౌస్ జగదేవపూర్ మండల పరిధిలో ఉండేది. తెలంగాణ జిల్లాల పునర్విభజన సమయంలో మండలాలను కొత్తగా ఏర్పాటు చేశారు. అలా కేసీఆర్ ఫాంహౌజ్ ఉన్న ఎర్రవల్లి మర్కూక్ మండల పరిధిలోకి వచ్చింది. కేసీఆర్ 2014లో తెలంగాణ సీఎం అయ్యాక 300 మంది పోలీస్ సిబ్బంది కోసం ఫాంహౌస్ పక్కనే క్వార్టర్స్ కట్టారు. విశేషం ఏమంటే వీటి పక్కనే ఐదు ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఇందులోనే రేవంత్ ప్రభుత్వం ఇప్పుడు తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)ను ఏర్పాటు చేయనుంది. ఒక విధంగా చూస్తే, కేసీఆర్ ఎంతో ఇష్టపడే ఫామ్ హౌజ్ సమీపంలో నెలకొల్పే టీపీఎస్ కారణంగా ఆయన ప్రైవసీకి కొంత ఇబ్బందే. ఒకసారి స్కూల్ ఏర్పాటయ్యాక రాకపోకలు విపరీతంగా పెరుగుతాయి. దీంతోపాటు కేసీఆర్ ఫాంహౌజ్ ఇదిగో.. అంటూ ఆగి చూసేవారు కూడా ఉంటారు. పైగా టీపీఎస్ లు ప్రభుత్వం విద్యార్థులకు అత్యంత ఉన్నత ప్రమాణాల విద్య కోసం ఏర్పాటు చేస్తున్నాయి. దీనిని వ్యతిరేకిస్తే విమర్శలు వస్తాయి. మరి ఏం జరగనుందో చూడాలి.

# వ్యవసాయం నుంచి ఐటీ వరకు అన్ని రంగాలకు నిధుల వర్షం.. తెలంగాణ బడ్జెట్ హైలైట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 ఆర్థిక సంవత్సర బడ్జెట్, రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు ఒక దిక్సూచిలా కనిపిస్తోంది. మొత్తం ?3,24,234 కోట్ల భారీ అంచనాతో రూపొందించిన ఈ పద్దు కేవలం అంకెల గారడీగా కాకుండా క్షేత్రస్థాయిలో సామాన్యుడి అవసరాలను తీర్చే ఒక సమగ్ర ప్రణాళికగా ఆవిష్కృతమైంది. అటు సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ఇటు మౌలిక వసతుల కల్పన ద్వారా దీర్ఘకాలిక అభివృద్ధికి బాటలు వేయడం ఈ బడ్జెట్ లోని ప్రధానాంశం.

**గ్రామీణ భారతం.. అభివృద్ధికి పీఠం**

దేశానికి వెన్నెముక రైతు అయితే రాష్ట్రానికి వెన్నెముక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ. దీనిని గుర్తించిన ప్రభుత్వం పంచాయతీ రాజ్ �ڈ గ్రామీణాభివృద్ధి శాఖకు ?33,688 కోట్లు కేటాయించడం శుభపరిణామం. 'పల్లె ప్రగతి' వంటి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఉపాధి అవకాశాలను పెంచడం వల్ల పట్టణాలకు వలసలు తగ్గే అవకాశం ఉంది. అలాగే వ్యవసాయానికి మరియు సాగునీటి రంగానికి కలిపి దాదాపు ?45,000 కోట్లకు పైగా నిధులు కేటాయించడం ద్వారా అన్నదాతకు భరోసా లభించింది. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే సంకల్పం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది.

**విద్య, వైద్యం.. రేపటి తరానికి పెట్టుబడి**

ఏ సమాజమైనా అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం అనేవి పునాదులు. ఈ బడ్జెట్‌లో విద్య రంగానికి ?26,674 కోట్లు కేటాయించడం ఒక సాహసోపేతమైన ఆహ్వానించదగ్గ నిర్ణయం. డిజిటల్ విద్యను ప్రోత్సహించడం, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన చదువు అందుతుంది. అలాగే, వైద్య రంగానికి ?13,679 కోట్లు కేటాయించడం ద్వారా సామాన్యుడికి ఆరోగ్య భద్రత కల్పించే దిశగా అడుగులు పడ్డాయి.

**సమతుల్యత -- సామాజిక న్యాయం**

బడ్జెట్‌లో కేవలం ఆర్థికాభివృద్ధే కాకుండా సామాజిక న్యాయానికి కూడా పెద్దపీట వేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించడం ద్వారా సమాజంలోని అన్ని వర్గాలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలనే లక్ష్యం నెరవేరుతుంది. ముఖ్యంగా ?47,267 కోట్ల మూలధన వ్యయం అనేది రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు, రోడ్లు, భవనాల నిర్మాణానికి ఊతమిస్తుంది. ఇది భవిష్యత్తులో ఆదాయ వనరులను పెంచడమే కాకుండా ఉపాధి కల్పనకు దారితీస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్, అటు సంక్షేమాన్ని, ఇటు అభివృద్ధిని సమతూకంలో ఉంచే ప్రయత్నం చేసింది. అయితే కేటాయింపులు కాగితాలకే పరిమితం కాకుండా, నిధుల విడుదల.. అమలులో పారదర్శకత వహించినప్పుడే ఈ బడ్జెట్ లక్ష్యం పూర్తిగా నెరవేరుతుంది. నిధుల సమీకరణలో సవాళ్లు ఎదురైనప్పటికీ వ్యయ నియంత్రణ పాటిస్తూ అనుకున్న లక్ష్యాలను సాధిస్తే తెలంగాణ 'రోల్ మోడల్'గా నిలవడం ఖాయం.

# లాలూచీ పాలిటిక్స్: తిరుపతి నేతలకు బాబు వార్నింగ్ ..!



**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులతో తాజాగా టిడిపి అధినేత చంద్రబాబు సమావేశం అయ్యారు. నాలుగు గోడల మధ్య జరిగిన ఈ సమావేశంలో కొంతమంది నాయకులకు ఆయన సీరియస్ గానే కొన్ని విషయాలను ప్రస్తావించినట్లు తెలిసింది. ముఖ్యంగా లాలూచీ రాజకీయాలు చేస్తున్నారన్న వాదన కొన్నాళ్లుగా వినిపిస్తున్న నేపథ్యంలో ఇటువంటి పాలిటిక్స్ కి దూరంగా ఉండాలని చంద్రబాబు తేల్చి చెప్పినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే దూకుడు, లేకపోతే లాలూచీ రాజకీయాలు చేస్తున్నారన్న వాదన వినిపిస్తున్న మూడు నియోజకవర్గాల్లో పరిస్థితులపై ఆయన సమీక్షించారు.

వారి వారి గ్రాఫ్ ను కూడా ఆయన వివరించారు. అంతేకాదు ప్రజల మధ్య ఉండని నాయకులను పక్కన పెడతానని కూడా హెచ్చరించారు. ప్రధానంగా సుదీర్ఘకాలంగా ఎదురుచూసిన ఒక కీలక నియోజకవర్గంలో గత ఎన్నికల్లో టిడిపి తరఫున సీనియర్ నాయకుడు విజయం సాధించారు. అయితే ఎమ్మెల్యేగా ఆయన ఉన్నప్పటికీ ఆయన సతీమణి ఆ నియోజకవర్గంలో చక్రం తిప్పడం పట్ల సొంత పార్టీలోనే విమర్శలు వచ్చాయి. ప్రధానంగా పార్టీ నాయకులను దూరం పెట్టి వ్యాపారాలు వ్యవహారాలు సాగిస్తున్నారని ఆమెపై వస్తున్న ప్రధాన విమర్శ.అదే విధంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా ఎవరికి వారుగా నాయకులు వ్యవహరిస్తున్న తీరుపట్ల చంద్రబాబు విస్మయం వ్యక్తం చేశారు. ఎవరు గెలిచారు అన్నది కాదు.. కూటమి తరపున అందరు కలిసి పనిచేయాలని ఆయన పదేపదే సూచిస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో కొంతమంది నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలోనే తిరుపతి జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాలను ప్రామాణికంగా తీసుకున్న ఆయన వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. అంతేకాదు ఎక్కడా ప్రత్యర్థులతో లాలూచీ పడద్దని.. వారితో కలిసి వ్యాపారాలు వ్యవహారాలకు దూరంగా ఉండాలని కొంత కఠినంగానే చెప్పినట్టు తెలిసింది.సత్యవేడు నియోజకవర్గంలో ఇన్చార్జిగా ఉన్న శంకర్రావు ప్రస్తుతం దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇది పార్టీకి నష్టం కలిగించకుండా చూసుకోవాలని ఆయనకు సూచించారు. అదేవిధంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలను ప్రధానంగా ప్రస్తావించిన చంద్రబాబు కుటుంబ సభ్యులను పక్కనపెట్టి ప్రజల మధ్యకు వెళ్లాలని ఆయన తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఆయన నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులు వ్యవహరిస్తున్న తీరు పట్ల వస్తున్న ఫిర్యాదులు అదేవిధంగా పార్టీ రూపొందించిన నివేదికలను కూడా చంద్రబాబు వారి ముందు ఉంచి వారికి వివరించారు. భవిష్యత్తులో తిరుపతి జిల్లాను మోడల్ జిల్లాగా మార్చాలని నిర్ణయించుకున్నామని ఈ క్రమంలో అందరూ కలిసికట్టుగా అభివృద్ధి విషయంలో ముందుకు సాగాలని కూడా తేల్చి చెప్పారు. తిరుపతి అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడేది లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఇక వైసిపి పై విమర్శలు చేయడంలో వెనకబడుతున్న వారిని కూడా ఆయన మందలించారు. తిరుమల శ్రీవారి లడ్డు విషయంలో వచ్చిన ఆరోపణల అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ పై వచ్చిన విమర్శలను సమర్థవంతంగా తిప్పి కొట్టలేకపోయారని సీనియర్ నాయకులను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇట్లాంటివి వచ్చినప్పుడే కదా మీ సత్తా తెలుస్తుంది అని కూడా తేల్చి చెప్పారు. పనితీరు మార్చుకోవాలని అందరూ కలిసికట్టుగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఎవరిని ఉపేక్షించేది లేదని, లాలూచీ రాజకీయాలను అసలు సహించేది లేదని కూడా చంద్రబాబు స్పష్టం చేయడం గమనార్హం. మరి ఏ మేరకు తిరుపతి నాయకులు మారతారు అనేది చూడాలి.

# వెయ్యికాయలకు రూ. 13వేలు నుంచి రూ.14 వేలే

**కాకినాడ మార్చి 19, పెన్ పవర్:** కేరళను తలపించే కొబ్బ రి అందాలు కోనసీమకు సొంతం.. ఉద్యాన పంటల్లో రైతులకు కొబ్బరి ఆదాయమే అధికం.. అయితే ఇప్పుడు మిడిల్ ఈస్ట్‌లో జరుగుతోన్న యుద్ధం కోనసీమ కొబ్బరికి కాస్త గడ్డుకాలంగా మారింది.. ప్రతీ రోజూ టన్నుల కొద్దీ కొబ్బరి స్వదేశీ మార్కెట్ కే కాక ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే కోనసీమ కొబ్బరి అమాంతంగా నిలిచిపోయాయి.. యుద్ధం ప్రభావంతో చెన్నై పోర్టుల్లో కొబ్బరి కంటైనర్లు ఎక్కడిక్కడే నిలిచిపోవడంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతులు లేక ధరలు పతనం అయ్యాయం టున్నారు కొబ్బరి రైతులు.. రంజాన్ తో గల్ఫ్ దేశాలకు ఎగుమతులు చేసి లాభాలు సంపాదిద్దామనుకున్న తరుణంలో యుద్ధమేఘా లు కొబ్బరి రైతులపై నీళ్లు చల్లాయంటున్నారు.గతంతో పోలిస్తే గల్ఫ్ దేశాలకు దక్షిణాది రాష్ట్రాల నుంచి కొబ్బరి ఎగుమతులు గణనీయంగా పెరిగాయని కొబ్బరి వ్యాపారులు చెబుతున్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కొబ్బరి ఎగుమతులు పెద్ద ఎత్తున జరుగుతోండగా కోనసీమ ప్రాంతం నుంచి కూడా తగ్గట్టుగానే ఎగుమతులుంటున్నాయంటున్నారు.. ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో గల్ఫ్ దేశాల్లో కొబ్బరికి బాగా డిమాండ్ ఏర్పడింది. గల్ఫ్ దేశాల్లో రంజాన్ సందర్భంగా సాంప్రదాయ వంటకాల్లో కొబ్బరిని ఎక్కవుగా వాడుతుంటారని, దీంతోపాటు ఆదేశ సౌందర్య, ఇతరాత్ర తయారీ సామాగ్రిలో కొబ్బరి వినియోగం బాగా పెరిగిందంటున్నారు. ఈ నేపథ్యంలోనే సౌదీ అరేబియా, కువైట్, ఒమన్, దుబాయ్, ఇరాన్, ఖతార్ దేశాలకు కొబ్బరి ఎగుమతులు జరుగుతుండగా రంజాన్ నేపథ్యంలోనే ఆ దేశాలకు కొబ్బరి ఎగుమతులు చేసేందుకు అంతా సిద్ధం చేశారు. అయితే ఎగుమతి అయిన సరుకు పోర్టుల్లోని కంటెయినర్లలోనే చిక్కుకుపోయిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు..ప్రస్తుతం వెయ్యికాయలకు రూ. 13వేలు నుంచి రూ.14 వేలు ఉంది.. గతేడాది సెప్టెంబర్ నుంచి నవంబర్, డిసెంబర్ నెలల్లో రికార్డు స్థాయిలో రైతులు లాభాలు పొందారు.. వెయ్యికాయకు రూ. 27 వేలు వరకు ధర పలికింది.. కురిడీ కాయ గతంలో రూ. 30 వేలు నుంచి రూ. 35 వేలు వరకు వెళ్లింది..కానీ ఇప్పుడు రూ. 26 వేలు నుంచి రూ. 29 వేలు వరకు నడుస్తోంది.. రంజాన్ మాసంలో విదేశాలకు ఎగుమతులయ్యే సరుకుకు ఆశాజనకంగా లాభాలు ఆర్జించవచ్చని చూసిన రైతులకు, వ్యాపారులకు ఇరాన్ ఇజ్రాయేల్, అమె రికా యుద్ధం బాగా దెబ్బకొంటిందం టున్నారు. ఇక శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా కొబ్బరికి డిమాండ్ ఉంటుందనుకున్న రైతులకు ఇది కూడా ఊరట నివ్వని పరిస్థితి కనిపిస్తోంది.. నవమి తొమ్మిది రోజుల పాటు కొబ్బరికి డిమాండ్ ఉండగా అయితే ఉత్పత్తి బాగా పెరిగిపోవడంతో డిమాండ్ తగ్గింది..ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాలైన గల్ఫ్ ఏడు దేశాల్లో యుద్ధ వాతావరణంతో నిండిపోయింది..

ఇరాన్‌పై ఇజ్రాయేల్, అమెరికా సేనలు విరుచకుపడుతున్నాయి.. మరో పక్క దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, ఒమాన్, బెహ్రాయిన్ దేశాలపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేస్తుంది.. ఈ పరిస్థితుల నేపథ్యంలో ముంబయి, చెన్నై, తూత్తుకూడి పోర్టుల్లోనే కొబ్బరి కాయలతో కంటెయినర్లు నిలిచిపోయాయని అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు సంబందించిన కొబ్బరి రైతులు చెబుతున్నారు. యుద్ధం ఎప్పుడు ముగు స్తుందో.. ఆయా దేశాలకు ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమవు తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందంటున్నారు. ఈ నేప థ్యంలో ఆయా ఓడరేవుల్లో ఉన్న సరకును స్థానికంగా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ధరల పతనంతో తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు.. ఇదిలా ఉంటే యుద్ధ ప్రభావాన్ని చూపుతున్న వ్యాపారులు మరింత తక్కువ ధరలకే కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు..

# ఏప్రిల్ 2తో ముగియనున్న సర్పంచ్ ల పదవీల కాలం

**విజయవాడ, మార్చి 19, పెన్ పవర్:**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో గ్రామ పాలనపై ఆసక్తికర పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రామ పంచాయతీల నిర్వహణ ఎలా ఉండబోతుందన్న దానిపై స్పష్టత కోసం ప్రజలు, స్థానిక నాయకులు ఎదురు చూస్తున్నారు. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది సర్పంచ్‌లు ఎన్నికయ్యారు. అభివృద్ధి కార్యక్రమాల అమలు, మౌలిక వసతుల కల్పన, కేంద్రరాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం వంటి బాధ్యతలను ఈ ఐదేళ్లలో నిర్వర్తించారు. రహదారులు, తాగునీటి పథకాలు, పారిశు ధ్య కార్యక్రమాలు, వీధి దీపాల ఏర్పాటు, చెత్త నిర్వహణ వంటి అంశాల్లో కొంతమేర అభివృద్ధి కనిపించినప్పటికీ, నిధుల కొరత, అధికార పరిమితులు, వివిధ శాఖల మధ్య సమన్వయం లోపం వంటి సమస్యలు కూడా ఎదురయ్యాయని పలువురు సర్పంచ్‌లు చెబుతున్నారు.పదవీకాలం ముగిసే సమయానికి గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్రారంభమైన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొత్త ఎన్నికలు జరిగే వరకు పెద్దస్థాయి అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవచ్చని తెలుస్తోంది.సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత పంచాయతీల పరిపాలన కొనసాగించడానికి ప్రభుత్వం తాత్కాలిక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సాధారణంగా ఇటువంటి పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు లేదా మండల స్థాయి అధికారులకు ప్రత్యేక అధికారాలు ఇచ్చి పరిపాలన కొనసాగించే విధానం అమలులో ఉంటుంది. ఈసారి కూడా అలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.సర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. కొత్త ఎన్నికలపై స్థానికంగా చర్చలు మొదలయ్యాయి. పలు గ్రామాల్లో ఇప్పటికే కొత్త అభ్యర్థుల పేర్లు వినిపిస్తున్నాయి.







యువత, మహిళలు కూడా ఈసారి పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో స్థానిక రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాధాన్యత, పార్టీ అనుబంధాలు వంటి అంశాలు కూడా రాబోయే ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం ఉంది.తమ పదవీకాలంలో గ్రామాభివృద్ధికి కృషి చేశామని చాలా మంది సర్పంచ్‌లు చెబుతున్నారు. అయితే నిధుల కొరత వల్ల అనుకున్నంత అభివృద్ధి చేయలేకపోయామని కొందరు పేర్కొంటున్నారు. కేంద్రం నుంచి వచ్చే పంచాయతీ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు సమయానికి అందకపోవడం కూడా సమస్యగా మారిందని అంటున్నారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు తమ వ్యక్తిగత నిధులతో కూడా అభివృద్ధి పనులు చేపట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు.సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడే అవకాశముంది. పలు గ్రామాల్లో యువ నాయకులు, సామాజిక కార్యకర్తలు స్థానిక పాలనలోకి రావాలని ఆసక్తి చూపుతున్నారు. అదే సమయంలో ఇప్పటికే ఉన్న నాయకులు మళ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు గ్రామాభివృద్ధికి కొత్త దిశ చూపాలని ప్రజలు ఆశిస్తున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం,

పారదర్శక పాలన అందించడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం వంటి అంశాల్లో కొత్త నాయకత్వం కీలక పాత్ర పోషించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఏప్రిల్ 2తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండగా, గ్రామ పంచాయతీ పరిపాలనపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కీలకంగా మారింది. కొత్త ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చిన తర్వాత గ్రామాల్లో రాజకీయ చైతన్యం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన పంచాయతీ రాజ్ వ్యవస్థలో ఈ మార్పులు రాబోయే రోజుల్లో గ్రామ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి.

## మదనపల్లి ఫైల్స్ లో పెద్దిరెడ్డి చుట్టూ రాజకీయం

**తిరుపతి, మార్చి 19, పెన్ పవర్:**

ఏపీలో మరో కొత్త కేసు తెరపైకి వచ్చింది. మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో బుధవారం కీలక పరిణామం జరిగింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ముని తుకారాం, మాధవ రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో ముని తుకారాం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏ గా వ్యవహరించారు. మాధవరెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధానానుచరుడు. వీరిద్దరూ మదనపల్లె ఫైల్స్ కేసులో ఖ3, ఏ4 నిందితులుగా ఉన్నారు. వీరిద్దరూ బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం నిరాకరించింది. ఈ నేపథ్యంలోనే వీరి అరెస్టు జరిగింది.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ సంబంధమైన కేసులను తెరపైకి తెచ్చింది. ఈ క్రమంలో 2024 జూలై 21న మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటన అప్పట్లో సంచలనంగా మారింది. రెవెన్యూ ఫైల్స్ కాలిపోయాయి. అందుకే ఇది ప్రమాదం కాదని.. ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటన అని అనుమానిస్తూ పలు అభియోగాలు నమోదయ్యాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ ఘటనకు కారణమన్న అనుమానాలు బలపడ్డాయి.. ఈ నేపథ్యంలో ఘటన జరిగిన సమయంలో మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్, హరిప్రసాద్ లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆర్డీవోగా గతంలో పనిచేసిన మురళి అనే అధికారిపై కూడా చర్యలు తీసుకున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో అవకతవకలు బయటపడకుండా ఉండేందుకుగాను ఈ ఘాతుకానికి పాల్పడ్డారన్న అనుమానాలు ఉన్నాయి. అందుకే ఏపీ ప్రభుత్వం 2024 ఆగస్టులో మదనపల్లి ఫైల్స్ కేసును సీబీసీఐడీకి అప్పగించింది. అందులో భాగంగా సిఐడి అధికారులు గౌతమ్ తేజ్ తో పాటు పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి, మురళిలను అరెస్టు చేశారు. అయితే సాంకేతిక కారణాలతో మాధవరెడ్డికి కోర్టు రిమాండ్ విధించలేదు. దీంతో ఆయన బయటే ఉన్నారు. మరోవైపు ఏ 4 నిందితుడిగా ఉన్న ముని తుకారాం గత ఏడాది జూలైలో అమెరికా వెళ్ళిపోయారు. బుధవారం వీరిద్దరినీ ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కేసు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాత్ర పై దర్యాప్తు ముమ్మరంగా సాగే ఛాన్స్ కనిపిస్తోంది. పెద్దిరెడ్డి చుట్టూ ఉచ్చు బిగిస్తున్నట్లు అర్థమవుతుంది.

# జగన్ ఒక వైపే చూస్తున్నారా... ఇబ్బందే మరి !



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక వైపే చూస్తున్నారు, ఒక వైపే ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఆయన మీడియా ముందు మాట్లాడుతున్న తీరు కానీ పార్టీ సమావేశాలలో ఇస్తున్న ప్రకటనలు కానీ చూస్తే ఒక విషయం అర్థం అవుతోంది ఏపీలో 2029 ఎన్నికల్లో వైసీపీని జనాలు తప్పకుండా ఎన్నుకుంటారని ధీమాతో ఉన్నారు. దానికి కారణం తాము చేసిన సంక్షేమ కార్యక్రమాలు అని బలంగా నమ్ముతున్నారు. తాజాగా తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో జరిగిన ఒంగోలు పార్టీ నేతల మీటింగులో సైతం జగన్ ఇదే విషయం గట్టిగా ప్రస్తావించారు.

**ప్రతీ ఇంట్లో చర్చ :**

తమ అయిదేళ్ల పాలన మీద కూటమి ఇరవై నెలల పాలన మీద ప్రతీ ఇంట్లో చర్చ సాగుతోందని జగన్ అంటున్నారు. తాము ఏకంగా రెండు లక్షల 70 వేల కోట్ల రూపయాల పై చిలుకు సంక్షేమంగా ప్రతీ ఇంటికీ నగదు బదిలీగా అందచేశామని జగన్ చెప్పారు. కరోనా లాంటి విపత్తు ఉన్నా వెనకాడలేదని ఆయన గొప్పగా చెప్పుకున్నారు. అందువల్ల కూటమి సూపర్ సిక్స్ సూపర్ సెవెన్ అని ఎన్ని చెప్పినా తమ లాగా జనాలకు సంక్షేమ పథకాలు అందించడంతో విఫలం అవుతోంది అని అన్నారు. ఈ తేడాను ఇప్పటికే జనాలు గుర్తించారని అందుకే తమకే పట్టం కడతారని జగన్ అంటున్నారు. ఆయన వరకూ ఈ విశ్లేషణ బాగుంది, అందులో కొంత నిజం ఉంది, కానీ కేవలం సంక్షేమం విషయాన్ని మాత్రమే జనాలు పరిగణనలోకి తీసుకుని ఓట్లేస్తారా అన్న చర్చ సాగుతోంది.

**అభివృద్ధి మంత్రంతో :**

ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే అభివృద్ధి అని అంతా చెబుతారు. ఆయన సంక్షేమం కంటే దానికే ఎక్కువ ఫోకస్ పెడతారు. అలాంటి బాబు ఏపీలో వైసీపీని గట్టిగా దెబ్బ తీయాలని సంక్షేమం రూట్ కూడా ఎంచుకున్నారు. అలా బాబు ఒక వైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి రెండింటికీ బ్యాలెన్స్ చేస్తూ వస్తున్నారు. ఆయన ప్రతీ మీటింగులోనూ ఈ రెండూ చెబుతున్నారు. అమరావతి రాజధాని ప్రగతిని వివరిస్తున్నారు. పోలవరం ఎపుడు పూర్తి అవుతుందో చెబుతున్నారు. పెట్టుబడులు ఏపీకి ఎన్ని వచ్చాయో ఎన్ని ఉద్యోగాలు వస్తున్నాయో డేటాతో సహా వివరిస్తున్నారు. అంతే కాదు ఉత్తరాంధ్రా అమరావతి తిరుపతిలను ఎకనామిక్ జోన్లుగా చేస్తూ మూడు రీజియన్లను అభివృద్ధి చేస్తున్నారు. ఆ యాక్షన్ ప్లాన్ ని ప్రకటించారు. అలాగే ప్రతీ ప్రాంతంలో ఉన్న సహజ వనరులకు తగినట్లుగా పారిశ్రామిక అభివృద్ధి చేస్తున్నారు. అభివృద్ధి వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలకు సమ ప్రాధాన్యత ఉండేలా చూసుకుంటున్నారు. విజన్ 2047 అని ఒక భారీ బ్లూ ప్రింట్ తో బాబు ముందుకు సాగుతున్నారు.

**జగన్ విజన్ ఏమిటి :**

మరి సంక్షేమం విషయం వరకూ జగన్ ఓకే అనుకున్నా అభివృద్ధి విజన్ ఏదీ అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏపీలో అయిదు కోట్ల మంది ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారు. అలాగే ఉపాధి అవకాశాలు వారు ఆశిస్తున్నారు. వైసీపీ ఈ రోజుకీ రాజధాని విషయంలో క్లారిటీని ప్రకటించలేకపోతోంది. అలాగే పోలవరం ప్రాజెక్ట్ ని తమ హయాంలో పూర్తి చేయలేక పోయింది. ఏపీలో మూడు ప్రాంతాలలో తమదైన అభివృద్ధి అజెండా నమూనాను ఆవిష్కరించడంలో వెనకబడుతోంది అని అంటున్నారు. ఏపీ అంటే సంక్షేమ పథకాలను అందుకునే లబ్దిదారులు మాత్రమే ఉండరని, మధ్యతరగతి ఉన్నత తరగతి వర్గాలు కూడా ఉంటాయని గుర్తు చేస్తున్నారు వీరంతా డెవలప్మెంట్ కోరుకుంటారు అని చెబుతున్నారు. వైసీపీ ఎంతసేపూ తమ విధానంతోనే ముందుకు పోతే ఇబ్బందులు వస్తాయని అంటున్నారు. ఇప్పటికి అయినా మించిపోయింది లేదని వైసీపీ తన డెవలపమెంట్ స్ట్రాటజీస్ ఏమిటి ఏపీని ఎలా ముందుకు తీసుకుని వెల్దామనుకుంటున్నది జనాలకు తరచూ వివరించే ప్రయత్నం చేయకపోతే 2029 ఎన్నికల్లో కూడా కూటమి నుంచి భారీ సవాల్ ఎదురవుతుందని అంటున్నారు.

# మహేష్ పై వేటుకు రంగం సిద్ధం..

**విజయవాడ, మార్చి 19, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఇంటికే అన్న పేరుంది. డ్రగ్స్ వివాదంలో చిక్కుకున్న పుట్టా మహేష్ యాదవ్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరి చూస్తుంటే, ఆయన రాజకీయ భవిష్యత్తుపై క్లారిటీ వచ్చేసింది. “పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టే వాళ్లను మోయాలా?” అంటూ బాబు వేసిన ప్రశ్న.. మహేష్‌పై వేటుకు రంగం సిద్ధమైందనేదానికి నిదర్శనంతిరుపతి జిల్లా నేతతో జరిగిన భేటీలో చంద్రబాబు ఆవేశం కట్టలు తెంచుకుంది. సాధారణంగా ఇలాంటి వ్యక్తిగత ఆరోపణలు వచ్చినప్పుడు ఆచి తూచి స్పందించే బాబు, ఈసారి మాత్రం ఏకంగా “పార్టీకి వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చింది? డ్రగ్స్ తీసుకోవడం ఏంటి?” అని నిలదీశారు. పుట్టా మహేష్ వ్యవహారం కేవలం ఒక వ్యక్తి పొరపాటు కాదని, అది ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించే అంశమని అధిష్టానం భావిస్తోంది.పుట్టా సుధాకర్ యాదవ్ వంటి విధేయుడైన నేతకు తనయుడిగా, యనమల రామకృష్ణుడు వంటి దిగ్గజానికి అల్లుడిగా మహేష్‌కు పార్టీలో రెడ్ కార్పెట్ పరిచారు. కానీ, ఆ గౌరవాన్ని కాపాడుకోవడంలో ఆయన విఫలమయ్యారు. కుటుంబ నేపథ్యం చూసి అవకాశం ఇచ్చాం, కానీ దాన్ని దుర్వినియోగం చేశారన్న బాబు మాటలు.. వారసత్వ రాజకీయం ఇకపై షీల్డ్‌లా పనిచేయదని స్పష్టం చేస్తున్నాయి. గతంలో కూడా తప్పు చేసిన వారిని ఉపేక్షించలేదని గుర్తు చేస్తూ, ఇప్పుడు కూడా అదే కఠిన ఫార్ములాను అమలు చేసేందుకు బాబు మొగ్గు చూపుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ కల్చర్‌పై యుద్ధం ప్రకటిస్తున్న తరుణంలో, సొంత పార్టీ నేతే ఆ ఆరోపణల్లో ఉండటం బాబుకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది. అందుకే, ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా ముందే సర్జరీ చేసేయాలని అధిష్టానం భావిస్తోంది. పార్టీ నుంచి సస్పెండ్ చేయడం లేదా షోకాజ్ నోటీసులతో మొదలుపెట్టి, శాశ్వతంగా పక్కన పెట్టేలా స్కెచ్ సిద్ధమైందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.పుట్టా మహేష్ పై తీసుకోబోయే చర్య కేవలం ఆయనకు మాత్రమే పరిమితం కాదు. పార్టీ ముసుగులో విచ్చలవిడిగా

ప్రవర్తించే మిగిలిన యువ నేతలకు ఇదొక హెచ్చరిక. పార్టీ క్రమశిక్షణ రేఖ దాటితే కుటుంబంతో సంబంధం లేకుండా బహిష్కరణ తప్పదని ఈ ఘటనతో బాబు నిరూపించబోతున్నారని సమాచారం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇంధన కేంద్రాలే టార్గెట్

**హైదరాబాద్ పెన్ పవర్:** యుద్ధోన్మాదంతో తమ నేతలు, సైనికాధికారులతో పాటు సామాన్య ప్రజానీకాన్ని చివరికి ఏ పాపం ఎరుగని చిన్నారులను పొట్టనపెట్టుకుంటున్న అమెరికా, ఇజ్రాయిల్ దేశాలపై ప్రతీకారేచ్ఛతో ఇరాన్ రగిలిపోతోంది. ఇరాన్–ఖతార్ మధ్య విస్తరించి, ప్రపంచంలోనే అతి పెద్ద సహజ వాయువు నిక్షేపంగా కొనసాగుతున్న సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ జరిపిన దాడితో మండిపడిన ఇరాన్ గురువారం అనేక గల్ఫ్ దేశాలలోని ఇంధన కేంద్రాలపై పెద్ద ఎత్తున క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో తీవ్ర భయాందోళనలకు గురైన ఖతార్, అజర్‌బైజాన్, బరైన్, ఈజిప్ట్, జోర్డాన్, కువైట్, లెబనాన్, పాకిస్తాన్, సౌదీ అరేబియా, సిరియా, తుర్కియే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) విదేశాంగ మంత్రులు రియాద్‌లో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. దాడులను వెంటనే నిలిపివేయాలని ఇరాన్‌ను కోరారు. హర్మూజ్ జలసంధిలో చమురు నౌకల ప్రయాణానికి వీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను కూడా వారు ఖండించారు. లెబనాన్ భద్రత, సుస్థిరత, ప్రాదేశిక సమగ్రతకు మద్దతు తెలిపారు.

## అత్యంత సంతోషకరమైన దేశం ఫిన్లాండ్ !

**హైదరాబాద్ పెన్ పవర్:** రోజు రోజుకు తీవ్రమవుతున్న సోషల్ మీడియా వినియోగం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో యువతకు ముప్పుగా పరిణమిస్తోంది. వారి సంక్షేమాన్ని, భవితవ్యాన్ని దెబ్బ తీస్తోందని గురువారం విడుదల చేసిన ప్రపంచ సంతోష సూచిక (హ్యాపీ ఇండెక్స్)–2026 పేర్కొంది. ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశంగా ఫిన్లాండ్ అగ్ర స్థానంలో నిలబడిందని నివేదిక పేర్కొంది. వరుసగా 9వ ఏడాది ఈ ఘనతను సొంతం చేసుకున్న దేశంగా ఫిన్లాండ్ రికార్డు నమోదు చేసింది. మొత్తంగా 147 దేశాలతో నివేదికను విడుదల చేయగా, అందులో భారత్ 116వ స్థానంలో వుంది. గతేడాది 118వ స్థానంతో సరిపెట్టుకుంది. అమెరికా 23వ స్థానంలో వుండగా, కెనడా 25, బ్రిటన్ 29 స్థానాలను కైవసం చేసుకున్నాయి. పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై ఆంక్షలు విధించాలని ఇందుకోసం చట్టాలు, నిబంధనలను రూపొందించాలని అనేక దేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా కనబరుస్తున్న ప్రభావాలను ఈ ఏడాది వరల్డ్ హ్యాపినెస్ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. అలాగే సంతోషానికి, ఆనందానికి సూచికలుగా ఆరు అంశాలను ? తలసరి జిడిపి, ఆయుర్దాయం, సామాజిక మద్దతు, జీవన ఎంపికల్లో స్వేచ్ఛ, ఉదారత, అవినీతి పట్ల వైఖరి ? పేర్కొంది. ఈ ఏడాది కూడా నార్డిక్ దేశాలే హ్యాపినెస్ ర్యాంకింగ్స్‌లో ముందున్నాయి. వరుసగా మొదటి పది దేశాల్లో ఫిన్లాండ్, ఐస్‌ల్యాండ్, డెన్మార్క్, కోస్టారికా, స్వీడన్, నార్వే, నెదర్లాండ్స్, ఇజ్రాయిల్, లగ్జెంబర్గ్, స్విట్జర్లాండ్ దేశాలు వున్నాయి. లాటిన్ అమెరికా దేశం ఈసారి నాల్గవ ర్యాంక్ సాధించడం విశేషం. ఇక ఆఫ్ఘనిస్తాన్ నివేదికలో అట్టడుగున గల దేశంగా నమోదైంది. ఏమాత్రమూ సంతోషంగా లేని పది దేశాల్లో టాంజానియా, ఈజిప్ట్, డి.ఆర్.కాంగో, లెబనాన్, ఎమెన్, బోత్సవానా, జింబాబ్వే, ఆ తర్వాత స్థానాల్లో సియర్రా లియోన్, ఆఫ్రికాలోని మలవి దేశాలు వున్నాయి. గత దశాబ్ద కాలంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా,న్యూజీలాండ్ వంటి దేశాల్లో 25ఏళ్ళ లోపు యువత జీవన విధానం ఎలా తయారైందో ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. లెక్కా పక్కా లేకుండా పలు గంటల పాటు సోషల్ మీడియాలో వుండిపోవడమనేది ఈ నయా ధోరణిలోని కీలకాంశమని పేర్కొంది. కానీ అదే సమయంలో ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో యువత వారి జీవితాలను మెరుగు పరుచుకుంటున్నారని నివేదిక ఎత్తి చూపింది.

## ఇక ఇజ్రాయిల్ దాడి చేయదు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌కు చెందిన అత్యంత విలువైన సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ దాడులు చేయబోదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. 'అమాయకురాలైన ఖతార్‌పై దాడి చేయాలని ఇరాన్ నిర్ణయించుకుంటే తప్ప సౌల్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ దాడి చేయబోదు' అని ఆయన అన్నారు. ఇరాన్‌లోని సౌత్ పార్స్ ఆఫ్‌షోర్ ఎల్ఎన్‌జీ క్షేత్రంపై ఇజ్రాయిల్ జరిపిన దాడి, దానికి ప్రతిగా ఖతార్‌లోని అతి పెద్ద గ్యాస్ క్షేత్రం పైన, పర్షియన్ గల్ఫ్‌లోని ఇంధన స్థావరాల పైన ఇరాన్ చేస్తున్న దాడుల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్య చేశారు. ఒకవేళ ఖతార్‌పై ఇరాన్ దాడి చేస్తే ఇజ్రాయిల్ సాయం కానీ, అనుమతి కానీ తీసుకోకుండా సౌత్ పార్స్ క్షేత్రాన్ని పేల్చివేస్తామని, ఇరాన్ గతంలో ఎన్నడూ చూడని విధంగా తమ బలాన్ని, శక్తిని ప్రదర్శిస్తామని హెచ్చరించారు. కాగా ఆగ్రహంతోనే ఇజ్రాయిల్ ఈ దాడి చేసి హింసాత్మకంగా ప్రవర్తించిందని, దాడి గురించి తమకేమీ తెలియదని అమెరికా కమాండర్–ఇన్–చీఫ్ చెప్పారు. అలా జరుగుతుందని ఖతార్‌కు కూడా తెలియదని అన్నారు. వాస్తవాన్ని తెలుసుకోకుండా ఖతార్ ఎల్ఎన్‌జీ గ్యాస్ క్షేత్రంలోని ఓ భాగంపై ఇరాన్ దాడి చేసిందని విమర్శించారు. సౌత్ పార్స్‌పై ఇజ్రాయిల్ జరిపిన దాడి అమెరికా అధినేతను డిఫెన్స్‌లో పడేసింది. దాడి గురించి తనకేమీ తెలియదంటూ ఆయన సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను కుదిపేసిన ఈ దాడి కారణంగా సరఫరాలకు తీవ్ర ఆటంకం కలిగి చమురు, గ్యాస్, నిత్యావసరాల ధరలు అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది. సౌత్ పార్స్ క్షేత్రానికి ఓ వైపు ఇరాన్, మరో వైపు ఖతార్ ఉన్నాయి. ఇరాన్‌లోని బుషెహర్ రాష్ట్రంలో ఉన్న ఈ క్షేత్రంలో అపార గ్యాస్ నిల్వలు ఉన్నాయి. ఇరాన్ సహజ వాయువు అవసరాలను 70 శాతం వరకూ ఈ క్షేత్రమే తీరుస్తోంద. అంతేకాదు? ప్రపంచ లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) డిమాండ్‌లో 20 శాతాన్ని సమకూరుస్తోంది. ఈ క్షేత్రంలో 1,800 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్ నిల్వ ఉంది. ప్రపంచ గ్యాస్ నిల్వలో ఇది ఎనిమిది శాతం. ఖతార్ నుంచి యూరప్, ఆసియా దేశాలకు జరిగే ఎల్ఎన్‌జీ ఎగుమతులపై కూడా ఈ దాడి ప్రభావం చూపుతుంది. భారత్ సహా అనేక దేశాలకు ఎల్ఎన్‌జీని సరఫరా చేయడంలో సౌత్ పార్స్ క్షేత్రం వెన్నెముకగా ఉంది. ఇజ్రాయిల్ దాడి కారణంగా చమురు, గ్యాస్ ధరలు తక్షణమే పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

### మధ్యప్రాచ్యానికి మరిన్ని అమెరికా దళాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్యప్రాచ్యంలో సైనిక బలగాలను మరింతగా పెంచేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమైంది. ఉధృత దాడులకు అమెరికా సైన్యం సమాయత్తమవుతోందని అధికారులు తెలిపారు. హర్మూజ్ జలసంధిని తమ ఆధీనంలోకి తీసుకోవాలని ట్రంప్ భావిస్తున్నారు. అందుకోసం వైమానిక, నౌకా దళాల మోహరింపునకు ఆయన సన్నద్ధమయ్యారు. ఇరాన్‌లోని ఖర్గ్ దీవిపై మరోసారి భూతల దాడులు చేసే అవకాశంపై ట్రంప్ ఇప్పటికే అధికారులతో చర్చించారు. ఇరాన్ చమురు ఎగుమతులలో 90 శాతం వరకూ ఈ దీవి ద్వారానే జరుగుతున్నాయి. వైమానిక దాడులు చేయడం ప్రమాదమని, ఆ దీవిలో క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ తేలికగా దాడులు చేస్తుందని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్‌లోని దొరుద్ ప్రాంతంలో అమెరికా ? ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో 12 మంది మృతి చెందారని, మరో 116 మంది గాయపడ్డారని అక్కడి అధికారులు వెల్లడించారు. దక్షిణ లెబనాన్‌లోని అనేక పట్టణాలపై కూడా ఇజ్రాయిల్ దాడులు జరిపింది. ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధం కోసం రూ.18.65 లక్షల కోట్లు (200 బిలియన్ డాలరు)?ల అందజేయాలని అమెరికా ప్రతినిధి సభను పెంటగాన్ కోరింది. కాంగ్రెస్ అనుమతి లభిస్తే ఆయుధ ఉత్పత్తి పెరిగి యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఇరాన్‌పై యుద్ధం ప్రారంభమై దాదాపు మూడు వారాలు గడిచింది. ఇప్పటి వరకూ అమెరికా దళాలు ఏడు వేలకు పైగా లక్ష్యాలపై దాడులు చేశాయి.

# ధర్మదామ్ నుంచి బరిలో మూడోసారి

**హైదరాబాద్ పెన్ పవర్:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మరోమారు తన విలక్షణత చాటుకున్నారు. లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వ సారథిగా ఉన్న విజయన్ శాసనసభ ఎన్నికల్లో కన్నూరులోని ధర్మాదామ్ స్థానం నుంచి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఎల్‌డిఎఫ్‌లో సిపిఎం అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను గురువారం నాడు దాఖలు చేశారు. ఈ నియోజకవర్గంలో తొలి నామినేషన్ కూడా విజయన్‌దే కావడం విశేషం. గురువారం ఉదయం 11గంటల కల్లా రిటర్నింగ్ అధికారి సచిన్ కృష్ణకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఎటువంటి హంగు, ఆర్బాటాలు లేకుండా కేవలం 15 నిముషాలలో అన్ని కార్యక్రమాలు ముగించడం విశేషం. పనలూర్‌కు చెందిన చేతివృత్తిదారులు సోమరాజన్, కె.వరదరాజన్ విరాళంగా అందజేసిన మొత్తాన్ని డిపాజిట్‌గా చెల్లించారు. చేతివృత్తిదారులు ఇలా విజయన్ అభ్యర్థిత్వానికి డిపాజిట్ మొత్తాన్ని అందించడం ఇది మూడవసారి. కాగా ధర్మాదామ్ నియోజకవర్గం నుండి విజయన్ పోటీ చేయడం మూడవసారి. అంతకుముందు కుతుపరంబ నుండి మూడుసార్లు, తలిపరంబ నుండి ఒకసారి పోటీ చేశారు. ధర్మాదామ్ నుండి



యుడిఎఫ్ అభ్యర్థిగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపి అబ్దుల్ రషీద్‌ను నిలబెట్టగా, బిజెపి కె రంజిత్‌ను నిలబెట్టింది.ముందుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్ళాలని ప్రణాళిక వున్నా ముఖ్యమంత్రి దాన్ని కాదని నేరుగా ఆఫీసు నుండి అక్కడకు వెళ్ళారు. ఆయన వెంటన స్పీకర్ షంషీర్, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఇపి జయరాజన్, జిల్లా కార్యదర్శి కెకె రాగేష్, పి శశి తదితరులున్నారు. బుధవారం ఇక్కడ మాంబరంలో విజయన్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలోపూర్తి స్థాయిలో పాల్గొనలేకపోవచ్చని చెప్పారు. రాష్ట్రంలో ఇతర చోట్ల కూడా తాను పాల్గొనాల్సి వున్నందున స్థానికంగా వున్న నేతలు, పార్టీ కార్యకర్తలు ఓటర్లను కలిసే బాధ్యతను తీసుకోవాలని కోరారు.

# ఒమన్ సుల్తాన్‌కు ప్రధాని మోడీ ఫోన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంలకు ఫోన్ చేసి పశ్చిమాసియాలోని పరిస్థితులు, పరిణామాలపై వివరంగా చర్చిం చారు. తక్షణమే పశ్చిమాసియాలోని ఉద్రిక్తత లు చల్లారాలని, వెంటనే శాంతి, సుస్థిరతల పునరుద్ధరణ జరగాలని ఆకాంక్షిం చారు. ఇరువురు నేతలకు వేర్వేరుగా ఫోన్ చేసి మాట్లాడిన ప్రధాని మోడీ, హోర్మూజ్ జలసంధి ద్వారా నౌకలు సురక్షితంగా, స్వేచ్ఛగా రాకపోకలు జరగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఒమన్ సుల్తాన్‌తో చర్చలు బాగా జరిగాయని, ఆ దేశ ప్రజలకు ముందుగానే ఈద్ శుభాకాంక్షలు కూడా అందచేశామని మోడీ ఎక్స్ పోస్టులో తెలిపారు. ముందుగా ఉద్రిక్తతలను తగ్గించడానికి తర్వాత శాంతి, సుస్థిరతల పునరుద్ధరణకు గానూ చర్చలకు, దౌత్యానికి ప్రాధాన్యతని వ్వాల్సిన అవసరం వుందని ఇరుపక్షాలు అంగీకరించాయని ఆ పోస్టులో మోడీ తెలిపారు. ఒమన్ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించడాన్ని భారత్ ఖండించినట్లు మోడీ పునరుద్ఘాటించారు. భారత జాతీయులతో సహా వేలాదిమంది ప్రజలు సురక్షితంగా తిరిగి రావడానికి. చేసిన కృషిని కూడా అభినం దించారు. మలేసియా ప్రధానికి, ప్రజలకు కూడా ముందుగానే ఈద్ శుభాకాంక్షలు అందచేశారు. తీవ్రంగా ఆందోళన కలిగిస్తున్న పశ్చిమాసియాలోని పరిస్థితులపై చర్చించామని, ఉద్రిక్తతల తగ్గింపునకు తమ ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించామని చెప్పారు. చర్చలు, దౌత్యమార్గాల ద్వారానే శాంతి నెలకొంటుందని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించిన తర్వాత ఒమన్ సుల్తాన్‌తో మోడీ మాట్లాడడం ఇది రెండోసారి. అలాగే సౌదీ అరేబియా, బహ్రెయిన్, యుఎఇ, జోర్డాన్, ఇజ్రాయిల్, ఇరాన్‌లతో సహా పలువురు ప్రపంచ నేతలతో మోడీ మాట్లాడారు.

# బీజేపీ మాత్రమే రక్తపాతాన్ని కోరుకునేది

**హైదరాబాద్ పెన్ పవర్:** హోలీ పండుగ సందర్భంగా హిందువు లు– ముస్లింల మధ్య జరిగిన ఘర్షణల్లో తరుణ్ బుటోలియా అనే యువకుడు మృతి చెందారు. ఈ ఘటన మార్చి 4న జరిగింది. హోలీ పండుగ సందర్భంగా నీటితో నింపిన బెలూన్‌ని తరుణ్ మేనకోడలు విసరడంతో అక్కడ గొడవ జరిగింది. హిందూ– ముస్లింల మధ్య జరిగిన ఈ ఘర్షణల్లో తరుణ్ మృతి చెందారు. ఈ ఘటనపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ గురువారం స్పందించారు. బీజేపీ మాత్రమే రక్తపాతాన్ని కోరుకుంటోందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ నగర్ ఘటనపై బీజేపీ మత హింసను రెచ్చగొడుతుందని, ఇలాంటి రెచ్చగొట్టే చర్యలకు లొంగపోవద్దని ఢిల్లీవాసులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు రాహుల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ముఖ్యంగా ఈ హింసకు ఉత్తమ్‌నగర్ ప్రజలు భారీ మూల్యం చెల్లించారు. ఈ హింస వల్ల తరుణ్ అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పుడు వారి కుటుంబం మొత్తం వేధింపులను ఎదుర్కొంటోంది. వారు రక్తపాతాన్ని కోరుకోవడం లేదు. కానీ బీజేపీ మాత్రమే రక్తపాతాన్ని కోరుకునేది. ద్వేషమనే పెనం మీద హింస అనే రొట్టెను కాల్చడానికి గల ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకునే నైజం బిజెపిది. దాని సహజ లక్షణమే అది అని రాహుల్ ఎక్స్ పోస్టులో బీజేపీ పై తీవ్ర విమర్శలు చేశారు. వారు (బీజేపీ నేతలు) హిందూ ? ముస్లిం గొడవల్లోనే దేశం చిక్కుకొని ఉండాలని కోరుకుంటున్నారు. దేశ రక్షణ, ఇంధన భద్రత, ఆహార భద్రత, వ్యూహాత్మక సార్వభౌమాధికారాన్ని అమెరికాకు



అప్పగించమని ప్రధానమంత్రిని ఎందుకు బలవంతం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నించకుండా ఉండేందుకే.. దేశ రాజధానిలో పట్టపగలు అల్లర్లను సృష్టిస్తున్నారు. ఇలాంటి సమయంలో బీజేపీ పాల్పడే రెచ్చగొట్టే చర్యలకు లొంగిపోవద్దని, ఐక్యత సోదరభావం, ప్రేమను వ్యాప్తి చేయాలని, కలిసికట్టుగా ఉండాలని రాహుల్ ఢిల్లీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై విచారణ ఏప్రిల్ 22కు వాయిదా

**హైదరాబాద్ పెన్ పవర్:** గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై దాఖలైన పిటిషన్లపై విచారణ మరోసారి వాయిదా పడింది. ఏప్రిల్ 22న ఈ పిటిషన్‌లపై విచారణ చేపడతామని గురువారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందని 2024 ఆగస్టు 4న దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణ సుప్రీంకోర్టును



ఆశ్రయించారు. తమ నియామకాన్ని పక్కన పెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని వారు సవాల్ చేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత.. కాంగ్రెస్ సర్కార్ ప్రతిపాదనలతో ఎమ్మెల్సీలుగా నియమితులైన కోదండరాం, అమీర్ అలీఖాన్‌ల నియామకాన్ని గతేడాది ఆగస్టు 13న సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై విచారణ కొనసాగి స్తోంది. ఈక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ తరపున సీనియర్ అడ్వొకేట్ సంజయ్ ఎం నూలీ ఇంప్లీడ్ అప్లికేషన్(ఐఏ) దాఖలు చేశారు. అలీఖాన్ ఎమ్మెల్సీగా ప్రమాణం చేశారని, ఆయనను ఎమ్మెల్సీగా కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. అయితే? ఈ పిటిషన్లపై గత నెల 3వ తేదీన విచారణ జరిపిన ధర్మాసనం.. తెలంగాణలో గవర్నర్ కోటాలో కొత్తగా చేపట్టబోయే ఎమ్మెల్సీ నియామకాలకు గత సుప్రీంకోర్టు ఆదేశాలు అడ్డంకులు కాదని స్పష్టం చేసింది. మంత్రి వర్గం సిఫారసు చేసే పేర్లపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవచ్చని తేల్చి చెప్పింది. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేసింది.

## ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో లాలూ పిటిషన్ తిరస్కరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసు విచారణలో దాఖలు చేసిన పిటిషన్లను ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. ఈ కేసు విచారణలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీ దేవి తమ వాదనల్ని వినిపించడానికి విశ్వసనీయత లేని (విచారణకు ఆధారపడని పత్రాలు) 1,600 పత్రాలు ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను ఢిల్లీ కోర్టు గురువారం తిరస్కరించింది. ఈ పత్రాలను కోరడమంటే.. ఈ కేసును మరింత క్లిష్టతరం చేయడమేనని కోర్టు అభిప్రాయపడింది. అలాగే విచారణ ప్రారంభంలోనే మరింత చిక్కుముడిగా మార్చడానికే ఈ డాక్యుమెంట్లు రూపొందించబడ్డాయని ఢిల్లీ కోర్టు పేర్కొంది. ఈ కేసులో ఇప్పటికే విచారణ ప్రారంభమైంది. అయితే ఈ పత్రాలను ఇప్పుడు అందించడం చేస్తే.. 'ముందు చేయాల్సిన పనిని తర్వాత చేయడమేనని కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగే అన్నారు. న్యాయ ప్రక్రియను కూడా పూర్తి గందరగోళంలోకి నెట్టేయడమేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఒక ఆధారపడని పత్రం కోరుతూ లాలూ ప్రసాద్ వ్యక్తిగత కార్యదర్శి (పిఎస్) ఆర్.కె మహాజన్ దాఖలు చేసిన దరఖాస్తును, 23 ఆధారపడని పత్రాలు కోరుతూ మాజీ నియామక అధికారి, రైల్వే మాజీ జనరల్ మేనేజర్ మహీప్ కపూర్ దాఖలు చేసిన దరఖాస్తులను కూడా ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగే కొట్టేశారు. కాగా, ఆధారపడని పత్రాలు అంటే దర్యాప్తు సంస్థలచే స్వాధీనం చేసుకున్నప్పటికీ, ప్రాసిక్యూషన్ ఫిర్యాదులో ఆధారంగా పరిగణించబడని పత్రాలు అని అర్థం.

# పశ్చిమాసియా టెన్షన్ ప్రభావం ? సెన్సెక్స్ భారీ పతనం




పశ్చిమాసియాలో మళ్లీ తీవ్రతరమవుతోన్న ఉద్రిక్తతలు భారతీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్ దాడుల కారణంగా గ్లోబల్ మార్కెట్లు కుదేలవుతుండటంతో, దేశీయ సూచీలు కూడా భారీ పతనాన్ని నమోదు చేశాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఉదయం 9:29 గంటల సమయంలో సెన్సెక్స్ దాదాపు 1,500 పాయింట్లు కోల్పోయి 75,200 స్థాయికి దిగజారింది. అదే సమయంలో నిఫ్టీ కూడా 450 పాయింట్లకు పైగా పడిపోయి 23,300 మార్క్ కిందకు చేరింది. పశ్చిమాసియాలో యుద్ధ భయం పెరగడం, ముఖ్యంగా ఇరాన్ కీలక చమురు, గ్యాస్ వనరులను లక్ష్యంగా చేసుకోవడం వల్ల సరఫరా అంతరాయం కలుగుతుందనే ఆందోళనలతో బ్రెంట్ క్రూడ్ ధరలు

ఒక్కసారిగా 3 శాతం ఎగసి బ్యారెల్‌కు 111 డాలర్లను తాకాయి. ఇక విదేశీ మారకద్రవ్య మార్కెట్లో డాలర్ బలపడటంతో రూపాయి మరింత బలహీనపడింది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 92.89 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరుకుంది. రంగాల వారీగా చూస్తే చమురు ధరల పెరుగుదల కారణంగా ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, ఎన్టీపీసీ వంటి కంపెనీల షేర్లు స్వల్ప లాభాలు నమోదు చేస్తున్నాయి. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ, లార్సెన్ అండ్ టూబ్రో, టీఎంపీవీ, శ్రీరామ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ వంటి షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. మొత్తానికి, యుద్ధ భయం కొనసాగుతున్నంత కాలం మార్కెట్లలో అస్థిరత కొనసాగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

# భారత జిడిపి అంచనాలకు కోత

పశ్చిమాసియాలో నెలకొన్న సంఘర్షణల వల్ల వచ్చే ఏడాది కాలంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ 95 స్థాయికి పడిపోవచ్చని గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మాన్ సాక్స్ తెలిపింది. మరోవైపు భారత వృద్ధి రేటు అంచనాలకు కోత పెట్టింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సంక్షయుక్తంగా కొనసాగిస్తోన్న యుద్ధోన్మాదం వల్ల నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలతో వచ్చే ఆర్థిక సంవత్సరం 2026–27లో భారత జిడిపి అంచనాలను 7 శాతం నుంచి 6.4 శాతానికి కోత పెడుతూ హెచ్చరించింది. గతంలో కంటే ఇది 50 బేసిస్ పాయింట్లు తక్కువ. మరోవైపు ద్రవ్యోల్బణ అంచనాను 30 బేసిస్ పాయింట్లు పెంచింది. కరెంట్ అకౌంట్ లోటు (సిఏడి) 2025తో పోలిస్తే ఈ ఏడాది 0.8 శాతం పాయింట్లు పెరిగి జిడిపిలో 1.2 శాతానికి చేరుకోవచ్చని అంచనా వేసింది. వచ్చే ఏడాది కాలంలో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 95 స్థాయికి పడిపోవచ్చని ఆ సంస్థ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ శాంతను సేన్‌గుప్తా హెచ్చరించారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి మూసివేత వంటి పరిస్థితుల వల్ల చమురు ధరలు బ్యారెల్‌కు 100 మార్కును తాకుతున్నాయన్నారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుందని ఆయన ఓ ఇంటర్వ్యూలో విశ్లేషించారు. గత 25 ఏళ్లలో ఎదురైన చమురు సంక్షోభాల కంటే ఇది భిన్నమైనదని శాంతను సేన్‌గుప్తా అభిప్రాయపడ్డారు. గతంలో చమురు ధరలు పెరిగినప్పుడు మధ్యప్రాచ్య దేశాల ఆదాయం పెరిగి.. తద్వారా భారత్‌కు ఎగుమతులు, రెమిటెన్స్‌ల రూపంలో మేలు జరిగేదన్నారు.

కానీ.. ప్రస్తుత యుద్ధం నేరుగా ఆ ప్రాంతంలోనే జరుగుతుండటంతో అటు ఇంధన ధరల భారం పెరగడమే కాకుండా ఇటు మధ్యప్రాచ్య దేశాల ఆర్థిక వ్యవస్థలు కూడా దెబ్బతింటాయన్నారు. దీనివల్ల భారత్‌కు అందే ఎగుమతుల ఆర్డర్లు, నిధుల ప్రవాహం కూడా తగ్గిపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థకు రెండు వైపులా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రపంచ ఆర్థిక మాంద్యం ముప్పు




పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ సంక్షోభం ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారి తీయనుందని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్, యాక్సిస్ కాపిటల్ గ్లోబల్ రీసెర్చ్ హెడ్ నీలకంఠ మిశ్రా హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తోన్న ఉద్రిక్తతలు వచ్చే నాలుగు వారాల పాటు ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ ఇంధన సరఫరాలో దాదాపు 7 శాతం మేర అంతరాయం ఏర్పడిందని వెల్లడించారు. ఇది కేవలం చమురు ధరల పెరుగుదల మాత్రమే కాకుండా నేరుగా ఇంధన కొరతకు దారితీస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో 4 శాతం నుండి 5 శాతం మేర అంతరాయం కలిగితేనే ప్రపంచ జిడిపిలోనూ 4 నుంచి 5 శాతం కోత పడే అవకాశం ఉందన్నారు.ప్రస్తుతానికి కంపెనీల వద్ద ఉన్న నిల్వలకారణంగా అంతర్జాతీయ మార్కెట్లు కొంత స్థిరంగా ఉన్నప్పటికీ సరఫరా గొలుసులో ఇబ్బందులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని మిశ్రా పేర్కొన్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్, వాహన తయారీ రంగాలు కీలక ముడిసరుకుల కొరతను ఎదుర్కొంటున్నాయని ఆయన గుర్తు చేశారు. గ్యాస్ కొరతతో సూరత్ టెక్స్‌టైల్ రంగంలో ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. ఇది కేవలం ఇంధనానికే పరిమితం కాకుండా మొత్తం ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతోందని వివరించారు. ఆర్థిక నష్టం విపరీతంగా పెరిగి అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్ల నుండి ఒత్తిడి పెరిగినప్పుడే యుద్ధంలో పాల్గొంటున్న దేశాలు వెనక్కి తగ్గే అవకాశం ఉందని మిశ్రా అభిప్రాయపడ్డారు. ఈ సంక్షోభం వల్ల కలిగే ఆర్థిక భారంతో అన్ని దేశాలు నష్టపోతాయని హెచ్చరించారు. అందుకే ఈ యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగకపోవచ్చని ఆయన అంచనా వేశారు. అయితే, కీలకమైన ఇంధన మౌలిక సదుపాయాలకు ఏదైనా నష్టం వాటిల్లితే మాత్రం పరిస్థితి మరింత దిగజారి.. జిడిపి రికవరీ ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# 8 గంటల పాటు అనిల్ అంబానీని విచారించిన సీబీఐ



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీపై నమోదైన రూ.2,929 కోట్ల మోసం కేసుకు సంబంధించి సీబీఐ ఆయన్ను సుమారు 8 గంటల పాటు ప్రశ్నించింది. అనిల్ అంబానీ ఉదయం 10:15 గంటలకు సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. లాంఛనాలు పూర్తి చేసిన అనంతరం ఆయన్ను విచారణ బృందం వద్దకు తీసుకెళ్లారు. సాయంత్రం 6:15 గంటల సమయంలో ఆయన సీబీఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. ఇప్పటికే పలు కేసుల్లో సీబీఐ విచారణను ఎదుర్కొంటున్న అనిల్‌ను శుక్రవారం మరోసారి విచారణ నిమిత్తం పిలిచినట్లు అధికారులు తెలిపారు. 'రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్,

అనిల్ అంబానీ, గుర్తు తెలియని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఇతరులు నిందితులుగా ఉన్న రూ.2,929.05

కోట్ల బ్యాంకు మోసం కేసులో.. 2025 ఆగస్టు 21న కేసు నమోదైంది. దీనికి సంబంధించి దిల్లీలోని ప్రధాన కార్యాలయంలో విచారణ నిమిత్తం హాజరు కావాలని అనిల్‌కు సమన్లు జారీ చేశాం. ఆయన్ను సుమారు 8 గంటల పాటు విచారించాం. శుక్రవారం మరోసారి విచారణకు హాజరు రావాలని ఆదేశించామ'ని సీబీఐ అధికారులు తెలిపారు.

## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో విభేదాలు..!




దేశంలోనే అతిపెద్ద ప్రయివేటు రంగ బ్యాంక్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మేనేజ్‌మెంట్‌లో విభేదాలు తలెత్తాయి. ఆ బ్యాంక్ చైర్మన్ అతాన్ చక్రవర్తి ఆకస్మిక రాజీనామాకు మేనేజ్‌మెంట్‌తో ఉన్న విభేదాలే కారణమని తెలుస్తోంది. తన రాజీనామా లేఖలో ఆయన విలువలు, నైతికత విషయంలో గత రెండేళ్లుగా బ్యాంకులో జరుగుతున్న కొన్ని పరిణామాలు ఆందోళన కలిగిస్తోన్నాయని బాంబ్ పేల్చారు. పలు సంఘటలను, ధోరణులను అంగీకరించలేకపోతున్నానని చక్రవర్తి పేర్కొన్నారు. ఇది బ్యాంకింగ్, స్టాక్ మార్కెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో బ్యాంకులో గవర్నెన్స్ సమస్యలు ఉన్నాయనే ఆందోళనతో ఇన్వెస్టర్లు భారీగా షేర్లను విక్రయించారు. ఇంట్రాడేలో ఆ బ్యాంక్ షేర్ 9 శాతం మేర క్షీణించింది. దీంతో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మార్కెట్ కాపిటలైజేషన్ లక్ష కోట్లు పైగా తుడుచుకుపెట్టుకుపోయింది. తుదకు బిఎస్‌ఇలో 5.13 శాతం పతనంతో రూ.799.70కు పడిపోయింది. ఇంట్రాడేలో రూ.772 కనిష్ట స్థాయిని తాకింది. ఇది 52 వారాల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. బ్యాంకులో ఎటువంటి అధికార పోరాటాలు లేవని తాత్కాలిక ఛైర్మన్ కెకె మిస్త్రీ పేర్కొన్నారు. చైర్మన్, మేనేజ్‌మెంట్ మధ్య వ్యక్తిగత సంబంధాల పరంగా వచ్చిన ఇబ్బందుల వల్లే ఈ రాజీనామా జరిగి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. దీనికి బ్యాంకు పనితీరుతో సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. కాగా.. ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ మాక్వారీ గవర్నెన్స్ ఆందోళనల దృష్ట్యా తన 'మర్క్యూ బై లిస్ట్' నుండి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకును తొలగించడం గమనార్హం. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆర్థిక స్థితిగతులు పటిష్టంగా ఉన్నాయని ఆర్‌బిఐ పేర్కొంది. గవర్నెన్స్ పరంగా ప్రస్తుతానికి ఎటువంటి ఆందోళనకరమైన అంశాలు తమ రికార్డుల్లో లేవని తెలిపింది.

## పెరిగిన చమురు ధరలు





ఇరాన్ సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ దాడి చేసిన అనంతరం ప్రతీకారంగా ఇరాన్ మధ్యప్రాచ్యంలోని ఇంధన సదుపాయాలపై దాడి చేయడంతో చమురు ధరలు పెరిగిపోయాయి. బ్యారెల్‌కు 119 డాలర్లు దాటాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ 6.02 డాలర్లు లేదా 5.6 శాతం పెరిగి బ్యారెల్‌కు 113.40 డాలర్ల వద్ద ఉంది. సెషన్ ప్రారంభంలో, బ్రెంట్ 11 డాలర్ల కంటే ఎక్కువ పెరిగి 119.13 డాలర్ల గరిష్ట స్థాయికి చేరుకుంది, ఇది మార్చి 9న తాకిన మూడున్నర సంవత్సరాల గరిష్ట స్థాయికి దగ్గరగా ఉంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ 7 సెంట్లు లేదా 0.1 శాతం పెరిగి బ్యారెల్‌కు 96.39 డాలర్ల వద్ద ఉంది, అంతకుముందు దాదాపు 4 డాలర్లు పెరిగి 100.02 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. అలాగే మధ్యప్రాచ్య బెంచ్‌మార్క్ దుబారు, ఒమన్ ప్రీమియంలు ట్రేడ్ వర్గాలు బ్యారెల్‌కు సుమారు 65 డాలర్ల వద్ద ఆల్–టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అమెరికా సెంట్రల్ బ్యాంక్ బుధవారం వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచామని ప్రకటించింది.

## టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌కు బ్రిటిష్ ప్రభుత్వ నైట్‌హుడ్ పురస్కారం



భారత్–యూకే వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడంలో విశేష కృషి చేస్తున్న టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌కు బ్రిటిష్ ప్రభుత్వం గౌరవ నైట్‌హుడ్‌ను ప్రదానం చేసింది. బుధవారం రాత్రి దిల్లీలోని బ్రిటిష్ హైకమిషనర్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు 'నైట్ కమాండర్ ఆఫ్ ది మోస్ట్ ఎక్సలెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (కేబీఈ)' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'యూకేలో టాటా గ్రూప్ దీర్ఘకాలంగా పెట్టుబడులు పెడుతోంది. దీని కార్యకలాపాలు వాహన, ఉక్కు, సాంకేతికత, వినియోగదారు రంగాల్లో విస్తరించి ఉన్నాయి. ఇది యూకేలో ఉద్యోగాలకు, అధునాతన తయారీ రంగానికి, స్వచ్ఛమైన సాంకేతికతల వైపు పరివర్తనకు మద్దతు ఇవ్వడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. టాటా గ్రూప్ ఛైర్మన్‌గా, ఆయన అనేక సంవత్సరాలుగా యూకే–భారత వ్యాపార సంబంధాలకు, బ్రిటన్‌లో పెట్టుబడులకు విశేష కృషి చేశార'ని హైకమిషన్ తెలిపింది. బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్–3 తరఫున బ్రిటిష్ హైకమిషనర్ కామెరాన్ ఈ గౌరవ పురస్కారాన్ని చంద్రశేఖరన్‌కు ప్రదానం చేశారు. ఈ గౌరవం కేవలం తన ఒక్కడికే కాదని, టాటా గ్రూప్‌లోని సహోద్యోగులందరికీ చెందుతుందని చంద్రశేఖరన్ అన్నారు.

# కళ్లు చెప్పే సంగతులు..



మన శరీరంలో కాలేయం ఒక ముఖ్యమైన భాగం. కాలేయం ఆరోగ్యంగా ఉంటే మొత్తం శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. కాలేయంలో ఏవైనా సమస్యలు ఉంటే క్రమంలో ఆరోగ్యంపై రోగాలు దాడి చేస్తాయి. అయితే కాలేయం దెబ్బతిన్నట్లు ముందస్తు సంకేతాలు ఏమీ కనిపించవు. మన శరీరంలో కాలేయం ఒక ముఖ్యమైన భాగం. కాలేయం ఆరోగ్యంగా ఉంటే మొత్తం శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. కాలేయంలో ఏవైనా సమస్యలు ఉంటే క్రమంలో ఆరోగ్యంపై రోగాలు దాడి చేస్తాయి. అయితే కాలేయం దెబ్బతిన్నట్లు ముందస్తు సంకేతాలు ఏమీ కనిపించవు. అందుకే కాలేయాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. కాలేయం విష పదార్థాలను తొలగించడంలో, ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. కాలేయం దెబ్బతిన్నట్లయితే, తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చు. సాధారణంగా కాలేయం దెబ్బతినడానికి అనేక కారణాలు ఉన్నాయి. కాలేయ సమస్యల లక్షణాలు సాధారణంగా వెంటనే స్పష్టంగా కనిపించవు. లక్షణాలు కనిపించడానికి చాలా సమయం పడుతుంది. అయితే మన ఒంట్లో ఓ అవయవం దీని ఆరోగ్యం గురించి ముందస్తు హెచ్చరికలు ఇస్తుంది.కాలేయం ఎక్కువగా క్షీణించడం ప్రారంభిస్తే దాని లక్షణాలు మన కళ్ళలో కనిపిస్తాయి. దీని వల్ల కళ్ళు నేరుగా ప్రభావితమవుతాయి. కళు ్ళ పసుపు రంగులోకి మారుతాయి. దీనిని మనం కామెర్లు అని పిలుస్తాం. కామెర్లు కాలేయం దెబ్బతింటుందని సూచించే ప్రధాన సంకేతం. అత్యంత సాధారణ లక్షణం కళ్ళు పసుపు రంగులోకి మారడం. దీనిని కామెర్లు అంటారు. అందువల్ల కళ్ళు పసుపు రంగులోకి మారితే దానిని తేలికగా తీసుకోకూడదు. శరీరంలో బిలిరుబిన్ అనే పసుపు వర్ణద్రవ్యం అధికంగా పేరుకుపోయినప్పుడు ఇది జరుగుతుంది. దీని వల్ల కళ్ళు పసుపు రంగులోకి మారుతాయి. ఈ లక్షణం కనిపిస్తే అస్సలు విస్మరించవద్దు.

# ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌తో ముప్పు..



నేటి ఆధునిక జీవనశైలిలో ప్లాస్టిక్ ఒక విడదీయలేని భాగంగా మారిపోయింది. ముఖ్యంగా మనం తినే ఆహార పదార్థాల దగ్గరి నుండి తాగే నీటి వరకు అన్నింటినీ ప్లాస్టిక్ కవర్లు లేదా డబ్బాలలోనే నిల్వ చేస్తున్నాము. అయితే, ఈ సౌకర్యం వెనుక ప్రాణాంతకమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్యాకేజింగ్ కోసం వాడే ప్లాస్టిక్‌లో ఉండే రసాయనాలు ఆహారంతో కలిసి మన శరీరంలోకి చేరుతున్నాయి. ప్లాస్టిక్ తయారీలో విరివిగా వాడే బిస్ఫినాల్ ఏ (ఃఖం) అనే రసాయనం శరీరంలోని హార్మోన్ల వ్యవస్థను పూర్తిగా అస్తవ్యస్తం చేస్తుంది. ఇది మన శరీరంలోని సహజ హార్మోన్లైన ఈస్ట్రోజన్ మరియు టెస్టోస్టిరాన్ పనితీరును దెబ్బతీస్తుంది. దీనివల్ల పురుషులలో శుక్రకణాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడమే కాకుండా, సంతానలేమి సమస్యలు తలెత్తుతున్నాయి. రసాయనాలతో నిండిన ఈ ప్లాస్టిక్ వాడకం వల్ల పునరుత్పత్తి వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోంది. మహిళల విషయంలో కూడా ఈ ప్లాస్టిక్ రసాయనాలు పెను శాపంగా మారుతున్నాయి. ముఖ్యంగా హార్మోన్ల అసమతుల్యత కారణంగా ఖఅూూ (ఖనీశ్రీఎఇఎబబితిఇ ూలజీతీఎ ూఎనిటతీనీఎవ) వంటి సమస్యలు పెరగడానికి ఃఖం ప్రధాన కారణమవుతోంది. అంతేకాకుండా, ఇది శరీరంలోని ఇన్సులిన్ నిరోధకతను పెంచి, చిన్న వయసులోనే టైప్–2 డయాబెటిస్ బారిన పడేలా చేస్తోంది. నాడీ వ్యవస్థపై కూడా దీని ప్రభావం ఉండటం వల్ల మానసిక ఒత్తిడి, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్లాస్టిక్ రక్కసి నుండి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తక్షణమే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. ఆహార పదార్థాల నిల్వకు ప్లాస్టిక్‌కు బదులుగా గాజు పాత్రలు, స్టీలు డబ్బాలు లేదా మట్టి పాత్రలను వాడటం ఉత్తమం. వేడి వేడి పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయడం వల్ల రసాయనాలు వేగంగా ఆహారంలో కలుస్తాయని గుర్తించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం మనందరి బాధ్యత.

# గర్భధారణలో ఉమ్మనీరు.. జాగ్రత్తలు తప్పనిసరి



గర్భస్థ శిశువు ఆరోగ్యంగా పెరగడంలో ఉమ్మనీరు కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కేవలం ద్రవం మాత్రమే కాదు, తల్లి గర్భంలో బిడ్డకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. బాహ్య ఒత్తిళ్ల నుండి శిశువును కాపాడటమే కాకుండా, ఎటువంటి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా ఈ నీరు రక్షణనిస్తుంది. బిడ్డ ఎదుగుదలకు అవసరమైన వెచ్చదనాన్ని, కదలికలకు కావాల్సిన సౌకర్యాన్ని ఇది అందిస్తుంది. అయితే, ఈ ఉమ్మనీరు ఉండాల్సిన పరిమాణం కంటే ఎక్కువగా ఉంటే తల్లికి ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. ముఖ్యంగా పొట్ట ఎక్కువగా పెరగడం వల్ల ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది లేదా ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఏడో నెల దాటిన తర్వాత ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. దీనివల్ల గర్భిణీలు రోజువారీ పనులు చేసుకోవడానికి కూడా చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఉమ్మనీరు అధికంగా ఉండటం వల్ల కేవలం తల్లికే కాదు, బిడ్డకు కూడా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. దీనివల్ల గర్భాశయంపై ఒత్తిడి పెరిగి, నిర్ణీత సమయం కంటే ముందే నొప్పులు వచ్చే అవకాశం ఉంది. ఇలా నెలలు నిండకుండానే ప్రసవం జరగడం వల్ల శిశువు ఆరోగ్యం దెబ్బతింటుంది. కొన్ని తీవ్రమైన పరిస్థితుల్లో బిడ్డ ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యం. అల్ట్రాసౌండ్ స్కాన్ ద్వారా ఉమ్మనీటి స్థాయిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలి. స్వల్ప తేడాలు ఉన్నప్పుడే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి అనర్థాలు జరగకుండా ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వవచ్చు. ఏ చిన్న అసాధారణ లక్షణం కనిపించినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం ఉత్తమం.

# అరటిపండు, ఖర్జూరం రెండిటిలో ఆరోగ్యానికి ఏది బెస్ట్?





ఆరోగ్యంగా ఉండాలని కోరుకునే వారు, జిమ్‌కు వెళ్లేవారు లేదా రోజంతా ఉత్సాహంగా ఉండాలనుకునే వారు ఎక్కువగా ఎంచుకునే ఫలాలు అరటిపండ్లు, ఖర్జూరాలు. ఇవి కేవలం తీపిని మాత్రమే కాదు శరీరానికి అవసరమైన తక్షణ ఇంధనాన్ని కూడా అందిస్తాయి. అరటిపండులో కార్బోహైడ్రేట్లు, స్టార్చ్ రూపంలో ఉంటాయి. ఒక సాధారణ అరటిపండు ద్వారా 105 కేలరీల శక్తి అందుతుంది. ఇందులో పొటాషియం, విటమిన్ ః6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. మరోవైపు ఖర్జూరాలు చాలా కాన్సంట్రేటెడ్ శక్తి వనరులు. కేవలం 3 నుంచి 4 ఖర్జూరాలు తిన్నా దాదాపు 90 –120 కేలరీల శక్తి లభిస్తుంది. వీటిలో ఫైబర్, ఇనుము , మెగ్నీషియం మరియు సహజ చక్కెరలు నిండి ఉంటాయి. అరటిపండ్లు: వీటిలో ఉండే ఫైబర్ చక్కెర శోషణను కొద్దిగా నెమ్మదింపజేస్తుంది. దీనివల్ల ఎక్కువ సేపు శక్తిని ఇవ్వడానికి ఇవి సహాయపడతాయి. సుదీర్ఘ నడక లేదా సాధారణ పనులకు ఇవి అనువైనవి. ఖర్జూరాలు: వీటిలో సహజ చక్కెరల శాతం ఎక్కువ. అందువల్ల ఇవి రక్తంలోకి వెంటనే కలిసిపోయి అత్యంత వేగంగా శక్తిని ఇస్తాయి. ఉపవాసం విడిచేటప్పుడు లేదా కఠినమైన వ్యాయామం తర్వాత కోలుకోవడానికి ఇవి బెస్ట్. షుగర్ లెవల్స్‌పై ప్రభావం: అరటిపండ్లు రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచవు. వీటి గ్లైసెమిక్ సూచిక మితంగా ఉంటుంది. కానీ ఖర్జూరాలు తిన్నప్పుడు చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. అందుకే డయాబెటిస్ ఉన్నవారు వీటిని మితంగా తీసుకోవడం మంచిది. అయితే ఖర్జూరాల్లో ఉండే ఫైబర్ ఈ ప్రభావాన్ని కొంతవరకు నియంత్రిస్తుంది.

కండరాలకు.. గుండెకు: అరటిపండు కండరాల తిమ్మిర్లను నివారించడంలో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో దీనిలోని పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. ఖర్జూరం శరీరంలో రక్తం పెరగడానికి , కండరాల పునరుద్ధరణకు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు దీనిలో మెండుగా ఉంటాయి. మీరు ఎంచుకునే పండు మీ అవసరాలపై ఆధారపడి ఉంటుంది. వ్యాయామానికి ముందు లేదా ఎక్కువ సేపు పనిచేసేటప్పుడు అరటిపండు ఎంచుకోండి. బాగా అలసిపోయినప్పుడు లేదా తీవ్రమైన వర్కవుట్ తర్వాత తక్షణ శక్తి కోసం ఖర్జూరాలు మేలు. అరటిపండు మరియు ఖర్జూరం రెండూ వాటికవే సాటిలేని శక్తి వనరులు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఈ రెండింటినీ సమతుల్యంగా మీ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అద్భుతమైన ఫలితాలను పొందవచ్చు.

# ఈ కూరగాయతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు




మన వంటింట్లో తరచూ కనిపించే బీరకాయ కేవలం ఒక కూరగాయ మాత్రమే కాదు. అద్భుతమైన ఔషధ గని. ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్ సి, ఐరన్, మెగ్నీషియం, పీచు పదార్థాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, పొటాషియం, ఫోలెట్ వంటి విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అంతేకాకుండా బీరకాయలో నీటి శాతం ఎక్కువగా ఉటుంది. ఇందులో కేలరీల సంఖ్య కూడా తక్కువగా ఉంటుంది. తరచూ దీన్ని ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మధుమేహం నియంత్రణ: బీరకాయలో ఉండే కొన్ని ప్రత్యేక పోషకాలు రక్తంలోని చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా 'నేతి బీరకాయ' డయాబెటిస్ రోగులకు ఇన్సులిన్ లాంటి మేలును చేకూరుస్తుంది. జీర్ణక్రియ, మలబద్ధకం: ఇందులో నీటి శాతం మరియు ఫైబర్ (పీచు) అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. దీర్ఘకాలిక మలబద్ధకంతో బాధపడేవారు బీరకాయను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

ఇది పొట్టలోని మలినాలను క్లీన్ చేసి గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది. బరువు తగ్గడం, బెల్లీ ఫ్యాట్: బీరకాయలో క్యాలరీలు చాలా తక్కువ. ఇది తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది, దీనివల్ల అతిగా తినడం తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే వారు మరియు పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును కరిగించుకోవాలనుకునే వారికి ఇది ఒక 'సూపర్ ఫుడ్'.

కంటి చూపు, గుండె ఆరోగ్యం: బీరకాయలో ఉండే బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపరుస్తుంది. అలాగే, ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తపోటును నియంత్రించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. చర్మ సౌందర్యం: రక్తశుద్ధి చేయడంలో బీరకాయ సహాయపడుతుంది. దీనివల్ల మొటిమలు, మచ్చలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది. లోపలి నుండి శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడం వల్ల చర్మం తాజాగా కనిపిస్తుంది. తక్కువ ధరలో లభించే ఈ బీరకాయను వారంలో కనీసం రెండు సార్లు ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల పైన పేర్కొన్న ఎన్నో ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు.

# ఈ టైంలో పండ్లు తింటే.. రోగాలకు రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానించినట్లే!



పండ్లు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయని అందరికీ తెలుసు. అందుకే రోజువారీ ఆహారంలో పండ్లను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను తొలగించుకోవచ్చు. పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయి. పండ్లు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయని అందరికీ తెలుసు. అందుకే రోజువారీ ఆహారంలో పండ్లను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను తొలగించుకోవచ్చు. పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయి. ఆసక్తికరంగా, పండ్లు కూడా మనల్ని ఎన్నో వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతాయి. అయితే పండ్లు ఏ సమయంలో తింటారు అనే దానిపై ఆరోగ్యానికి వాటి ప్రయోజనాలు అందే విధానం ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా పండ్లు తినే ముందు తగిన శ్రద్ధ చూపకపోతే లేనిపోని ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. తరచుగా పండ్లు తినేటప్పుడు అందరూ చేసే పెద్ద తప్పు.. కడుపు నిండా భోజనం చేసిన తర్వాత పండ్లు తినడం. అయితే ఇది ఆరోగ్యానికి మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పండ్లలో సహజ చక్కెర అధికంగా ఉంటుంది. మీరు తినే ఆహారం జీర్ణం కావడానికి ఫైబర్ సహాయపడుతుంది. భారీ ఆహారాలలో ప్రోటీన్, కొవ్వు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల భోజనానికి ముందు ఎప్పుడూ పండ్లు తినకూడదు. మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే భోజనం తర్వాత పండ్లు తినడం మానుకోవాలి. ఉదయం అల్పాహారంగా లేదా మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో ఆకలిగా ఉన్నప్పుడు పండ్ల ముక్కలు తింటే సరిపోతుంది.

# వన్డే ప్రపంచకప్ 2027 లక్ష్యంగా బీసీసీఐ మాస్టర్ ప్లాన్.. ఐపీఎల్‌పై సెలక్టర్ల కన్ను



**హైదరాబాద్ పెన్ పవర్:** వన్డే ప్రపంచకప్ 2027 టోర్నమెంట్‌కు ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, బీసీసీఐ ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ మెగా టోర్నీ కోసం సుమారు 20 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాబబుల్స్ జాబితాను సెలక్టర్లు ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ ఆటగాళ్ల ప్రదర్శనను నిశితంగా గమనించాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు పీటీఐ ఒక కథనంలో పేర్కొంది. సెలెక్షన్ కమిటీ సభ్యులు ఎస్ఎస్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా, ప్రగ్యాన్ ఓఝా.. ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా స్టేడియాల్లోనూ, టీవీల్లోనూ పర్యవేక్షించనున్నారు. ప్రతీ వారం కనీసం ఐదు మ్యాచ్‌లను కవర్ చేసేలా, ఒక్కో సెలక్టర్ ఒక్కో మ్యాచ్‌కు హాజరయ్యేలా ప్రణాళిక రచించినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ పర్యవేక్షణ కేవలం వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని మాత్రమే జరుగుతుందని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ లేదా టీ20 ప్రపంచకప్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదని స్పష్టమైంది. సెలక్టర్లు ప్రధానంగా జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్లపై దృష్టి సారించనున్నారు. మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న హర్షిత్ రాణాకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు జూన్ 6 నుంచి 10 వరకు ముల్లన్‌పూర్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు పూర్తిస్థాయి జట్టును పంపాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ మ్యాచ్‌కు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్లు లేనప్పటికీ, దీనిని తేలిగ్గా తీసుకోవడం లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి. ఆగస్టు నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు భారత్ తొమ్మిది టెస్టులు ఆడాల్సి ఉన్నందున, ఈ మ్యాచ్‌లో కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చే ఉద్దేశం లేదని తెలుస్తోంది. ఐపీఎల్ సమయంలో గాయపడకపోతే బుమ్రా, సిరాజ్ కూడా ఆఫ్ఘనిస్థాన్‌తో టెస్టు ఆడే జట్టులో ఉంటారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. "భారత టెస్టు జట్టు ప్రయోగాలకు వేదిక కాదు. దానికోసం ఇండియా-ఏ పర్యటనలు ఉన్నాయి. ప్రస్తుతం టెస్టుల్లో బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ మా మొదటి ప్రాధాన్యత" అని బీసీసీఐ అధికారి ఒకరు వివరించారు.

# క్రికెట్‌పై ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం సెగ.. ఇంగ్లాండ్‌లో బంతుల కొరత




**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్య ప్రాచ్యంలో ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య నడుస్తున్న యుద్ధం అంతర్జాతీయ క్రికెట్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఈ యుద్ధం వలన ముఖ్యంగా ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్ ఆధ్వర్యంలో జరిగే కౌంటీ క్రికెట్ సీజన్‌కి సెగ తగిలింది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కౌంటీ ఛాంపియన్‌షిప్ సీజన్‌కు ముందు ఈ సమస్య తలెత్తింది. ఈ టోర్నీలో ఉపయోగించే ప్రముఖ డ్యూక్స్ బంతుల సరఫరాలో తీవ్ర కొరత ఏర్పడింది. సాధారణంగా ప్రతి క్లబ్‌కు సరిపడా నిల్వలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 50 శాతం మాత్రమే ఇంగ్లాండ్ బోర్డు దగ్గర అందుబాటులో ఉన్నాయి. ఈ డ్యూక్స్ బంతులు ప్రధానంగా భారత్, పాకిస్తాన్ లాంటి దక్షిణాసియా దేశాల్లో తయారవుతాయి. అయితే మధ్యప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభంతో ఈ బంతులను ఇంగ్లాండ్‌కు రవాణా చేయడంలో పెద్ద ఎత్తున జాప్యం కొనసాగుతుంది. ఫ్యాక్టరీల్లో బంతులు సిద్ధంగా ఉన్నప్పటికీ, వాటిని ఎక్స్ పోర్టు చేయడానికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిపై బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ సంస్థ యజమాని దిలీప్ జజోడియా మాట్లాడుతూ.. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల మేము పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం.. ఈ సీజన్ ప్రారంభానికి క్లబ్‌లకు కేవలం 50 శాతం బంతులనే ఇవ్వగలుగుతున్నాం.. మిగిలినవి తర్వాత అందించాల్సి వస్తోందని వెల్లడించారు. అంతేకాదు, విమానయాన సంస్థలు సరుకు రవాణా చేసేందుకు ముందుకు రావడం లేదని, రవాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయని బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ సంస్థ యజమాని దిలీప్ జజోడియా పేర్కొన్నారు. సాధారణంగా ఒక బాక్స్‌కు కిలోకు 5 డాలర్లు వసూలు చేసేవారు. కానీ ప్రస్తుతం అదే ధర 15 డాలర్లకు పెరిగిపోయింది అన్నారు. ఈ సంక్షోభం మరింత తీవ్రంగా మారితే, ప్రత్యామ్నాయంగా ఆస్ట్రేలియాకు చెందిన కూకబుర్రా బంతులను ఉపయోగించాల్సిన పరిస్థితి రావొచ్చని క్రికెట్ నిపుణులు భావిస్తున్నారు.

# సీఎస్కే ప్లేయింగ్ ఎలెవన్‌లో ఎంఎస్ ధోనీకి దక్కని చోటు.. ఇర్ఫాన్ పఠాన్ ఏమన్నారంటే?






**హైదరాబాద్ పెన్ పవర్:** మరో వారం రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిసన్ ప్రారంభం కానుంది. కాగా ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ప్రస్తుత బ్యాటింగ్ శైలిని విశ్లేషిస్తూ, పఠాన్ తనదైన శైలిలో కామెంట్స్ చేశాడు. ఈ సందర్భంగా సీఎస్‌కే అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవన్‌లో ధోనీకి చోటు దక్కడం కష్టమని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంఎస్ ధోనీ గత కొన్ని సీజన్లుగా బ్యాటింగ్ చేసేందుకు లోయర్ ఆర్డర్ లో 7, 8 స్థానాల్లోనే వస్తున్నాడు. కేవలం ఒకటి లేదా రెండు ఓవర్లు మాత్రమే ఆడుతున్నారని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నారు. ధోనీ కేవలం రెండు ఓవర్లు ఆడటం ఆయన అభిమానులకు ఆనందాన్ని ఇవ్వవచ్చు కానీ, జట్టుకు మాత్రం పెద్దగా ఉపయోగపడదని తేల్చి చెప్పాడు. ఆయన ఆడాలనుకుంటే కనీసం నాలుగు ఓవర్లు బ్యాటింగ్ చేయాలి.. లేదంటే ఆ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించడం జట్టుకు మేలు చేస్తుంది అని పఠాన్ సూచించారు. గత ఐదు సీజన్లలో ఎంఎస్ ధోనీ ఎదుర్కొన్న బంతుల సంఖ్యను పరిశీలిస్తే అతడి బ్యాటింగ్ టైమింగ్ పూర్తిగా తగ్గుతూ వస్తోంది. గత 5 సీజన్లలో సగటున సీజన్‌కు 114 బంతులను మాత్రమే ఎదుర్కొన్నారు. 'ఇంపాక్ట్ ప్లేయర్' రూల్ వల్ల ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకు రావడం సులభమైంది, అయితే ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాటర్ అయినా ఏదో ఒక సమయంలో రిటైర్మెంట్ ఇవ్వాల్సిందేనని భారత జట్టు మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ గుర్తు చేశారు.

**ఇర్ఫాన్ పఠాన్ ఎంచుకున్న 'సీఎస్‌కే 12':**
సంజు శాంసన్, ఆయుష్ మ్హాత్రే, రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), శివం దూబే,డెవాల్డ్ బ్రెవిస్ సర్ఫరాజ్ ఖాన్, కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్, అఖీల్ హొసేన్, మాట్ హెన్రీ,నూర్ అహ్మద్ ఖలీల్ అహ్మద్ (ఇంపాక్ట్ ప్లేయర్),

# సాంప్రదాయంగా ఆకట్టుకుంటున్న భామలు!






తెలుగువారి కొత్త ఏడాది 'ఉగాది' పండుగను మన సినీ తారలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. కేవలం పండుగ జరుపుకోవడమే కాకుండా, పట్టుచీరలు, లంగా ఓణీల్లో అచ్చతెలుగు ఆడపడుచుల్లా ముస్తాబై సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేశారు. శాన్వీ మేఘన, వర్ష బొల్లమ్మ, నభా నటేష్ వంటి హీరోయిన్లు తమ అందచందాలతో అభిమానులకు కంటికి పండగ చేశారు. ఈ కొత్త ఏడాది అందరికీ మంచి జరగాలని కోరుకుంటూ వారు పంచుకున్న ఆ విశేషాలేంటో ఇప్పుడు చూద్దాం.

**లంగా ఓణీలో తెలంగాణ పిల్ల శాన్వీ మేఘన:**
తెలంగాణ ప్రాంతానికి చెందిన శాన్వీ మేఘన తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారును మాయ చేస్తోంది. ఈ ఉగాది సందర్భంగా ఆమె లంగా ఓణీలో అదిరిపోయే ట్రెడిషనల్ లుక్ షేర్ చేసింది. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ తన ఇన్స్టాగ్రామ్ ఫాలోవర్లకు విష్ చేసింది. రీసెంట్‌గా 'అనగనగా ఒక రాజు' సినిమాలో స్పెషల్ సాంగ్ తో సందడి చేసిన ఈ భామ, పండుగ వేళ పద్ధతైన దుస్తుల్లో మెరిసిపోతూ అందరి దృష్టిని ఆకర్షించింది. తన క్యూట్ యాక్టింగ్‌తో త్వరలోనే మరిన్ని మంచి ప్రాజెక్టులతో రాబోతోంది.

**వర్ష బొల్లమ్మ వెరైటీ విషెస్:**
'ఊరిపేరు భైరవకోన' సినిమాతో రీసెంట్‌గా సక్సెస్ అందుకున్న వర్ష బొల్లమ్మ, ఉగాది శుభాకాంక్షలను కొంచెం వెరైటీగా చెప్పింది. చీరకట్టులో అందంగా కనిపిస్తూనే.. "ఉగాది పచ్చడి తిని పిచ్చి తగ్గించుకోండి" అంటూ ఫన్నీగా ఇన్స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. ఆమె సెన్స్ ఆఫ్ హ్యూమర్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. సినిమాల్లో పక్కింటి అమ్మాయిలా కనిపించే వర్ష, ఈ ఉగాది ఫోటోల్లో మాత్రం చాలా గ్లామరస్‌గా, ట్రెడిషనల్‌గా కనిపిస్తూ నెటిజన్ల మనసు గెలుచుకుంది.

**పండుగ కళ తెచ్చిన తారలు:**
ఇక మొత్తానికి ఈ ఉగాది పర్వదినాన మన టాలీవుడ్ హీరోయిన్లు గ్లామర్ పక్కన పెట్టి, సంప్రదాయానికి పెద్దపీట వేశారు. వారి ఫోటోలు చూస్తుంటే తెలుగుతనం ఉట్టిపడుతోంది. అభిమానుల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించి ఇలా విష్ చేయడం వారి పట్ల ఉన్న ప్రేమను చాటుతోంది. ఇక ఈ పరాభవ నామ సంవత్సరంలో ఈ ముద్దుగుమ్మలందరూ మరిన్ని హిట్లు అందుకోవాలని, వారి కెరీర్ మరింత బ్రైట్‌గా ఉండాలని మనమందరం కోరుకుందాం.




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965